PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 349 | విజయవాడ, ఆదివారం 20 జులై 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 20 July 2025 | Rs

పోరాడితేనే విజయం

- సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలి : వి. శ్రీనివాసరావు
- కొనసాగుతున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె

2

8

స్పిన్నర్ల ఉచ్చులో హర్మన్‌ప్రీత్ సేన

- రెండో వన్డేలో ఇంగ్లండ్ చేతిలో 8వికెట్ల తేడాతో ఓటమి

కుబేర..@ నెల్లూరు!

- యాక్సిస్ బ్యాంక్‌లో భారీ స్కామ్
- రుణాల కోసం ఫేక్ కంపెనీల సృష్టి
- నిరుపేదలను సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చూపించి రూ.20 కోట్లు దోపిడీ

కుబేర సినిమా చూశారా? అచ్చం అలాగే నెల్లూరులో భారీ స్కామ్ జరిగింది. కాకపోతే ఆ సినిమాలో బ్లాక్‌మనీని మార్చడానికి బిచ్చగాళ్లను వాడుకుంటే, నెల్లూరులో రుణాలు పొందడానికి నిరుపేదలను వాడుకున్నారు. దీనికోసం ఆ సినిమాలో చూపినట్లే ఫేక్ కంపెనీలను ఏర్పాటు చేశారు. ఫేక్ ఐడెంటిటీ (గుర్తింపు)ని సృష్టించారు. అభం, శుభం తెలియని నిరుపేదల ఆధార్ కార్డులను, సంతకాలను, వేలిముద్రలను తస్కరించారు. వారికేమాత్రం అనుమానం రాకుండానే కోట్లాది రూపాయలను రుణం పేరిట కాజేశారు. అప్పు చెల్లించాలంటూ బ్యాంకు నోటీసులు అందుతుండటంతో ఆ నిరుపేదలు లబోదిబో అంటున్నారు. కుబేర సినిమా ఇటీవల విడుదలైతే, ఈ స్కామ్ మీద తొలి ఫిర్యాదు దాదాపుగా ఏడునెలల క్రితమే పోలీసులకు అందింది. వారి నుండి ఏమాత్రం స్పందన లేకపోవడమే దిగ్భ్రాంతికరం. దీంతో గుట్టుచప్పుడు కాకుండా సాగిన ఈ వ్యవహారం వెనుక ఎవరున్నారన్నది చర్చనీయాంశంగా మారింది.

ఒక్క రూపాయి తీసుకోలేదు

'ఒక్క రూపాయి రుణం తీసుకోలేదు. నేను కూలీ పనులు చేసుకుంటాను. కొద్ది రోజుల క్రితం కొందరు వ్యక్తులు మా ఊరికి వచ్చి మీకు బ్యాంక్ రుణాలు ఇప్పిస్తామని ఆధార్ కార్డులు, బ్యాంక్ బుక్‌లు, తీసుకున్నారు. మాకు రుణం వస్తుందని ఉపయోగపడుతుందని భావించాం. ఇప్పటి వరకు ఒక్క రూపాయి రాలేదు. నేను బ్యాంక్‌కు వెళ్లలేదు. ఎవరినీ కలవలేదు. ఇటీవల బ్యాంక్ నుంచి నోటీసులు వచ్చాయి. రూ.15 లక్షలు రుణం తీసుకున్నారని చెల్లించాలని దానిలో రాశారు'

లక్ష్మీనారాయణ గిరిజనుడు , చౌకచర్ల, విడవలూరు మండలం



11. Inquest Report/ U.D. Case No. if any :

12. Contents of the complaint / statement of the complainant or informant :

This is a case of using fake document as genuine one and cheated Axis bank authorities that occurred during period from 10.02.2022 to 08.01.2024 at various branches of Axis bank, Muthukur, Nellore city and around the district and was reported on 23.12.2024 at 20.00 hours. In which accused Jale Vasudeva Naidu, Alia Bakshu Siva Venkat @ Venky approached various branch managers in Nellore city and around the district to avail personal loans/business loan facilities and other loan facilities and credit cards to the fake 56 employees by showing they were working with their companies viz. AVNET India PVT Ltd, MR Info line, Global Solution and capital tree and submitted fake documents viz. Pay slips of the fake 56 employees and giving false information with regard to job in certain private companies with dishonest intention and availed the same for their wrongful gain, the authorities of Axis bank sanctioned in total digital personal loans disbursements to them was Rs 10,60,43,000/- and outstanding amounts in digital credit cards to the employees an amount of Rs 26,46,000/-. Later the fake 56 employees repay the EMIs an amount of Rs 1,40,97,000/- to Axis bank, but the fake 56 employees fail to repay the loan EMIs and Credit card amounts, total Rs 9,19,47,085.32/- to Axis bank. The accused A-1 to A-4 collude with fake 56 employees by submitting fake documents to Axis bank authorities with dishonest intention and availed the same for their wrongful gain and cheated Axis bank an amount of Rs 9,19,47,085.32/-. On the report given by the complainant Mannepalli Madan Mohan s/o Malyadri, aged 43 years, caste by Gajula Balija, Branch manager, Axis bank, beside RTC bus stand, Nellore city (Phone No: 8142201521) case is registered. Hence FIR.

13. Action taken:

Since The above information reveals commission of offence(s) U/s as mentioned at item No : 1

1) Registered the case and took up the investigation or : Name : SUDHAKAR RAO
2) Directed to take up the Investigation or Rank : Head Constable No.
3) Refused investigation due to :
4) Transferred to P.S : District : on point of jurisd

F.I.R. read over to the complainant / informant, admitted to be correctly recorded and a copy given to the complainant /informant, free of cost.

R.O.A.C

B. Sudhakar Hc 1900

Signature of Officer in charge, Police Station

23/12/2024

14. Signature / Thumb impression of the complainant / informant.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు జిల్లా యాక్సిస్ బ్యాంక్‌లో చోటుచేసుకున్న భారీ స్కామ్ ఇది! ఫేక్ కంపెనీలు సృష్టించి, అందులో కూలీలను, పశువుల కాపరులను సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చూపించారు. వారి పేర్లతో ఆన్‌లైన్‌లో రుణాలు తీసుకున్నారు. ఒక్కొక్కరి పేరుతో 15 లక్షల రూపాయల రుణం తీసుకున్నట్లు చెబుతున్నారు. నెల్లూరుజిల్లా యాక్సిస్ బ్యాంకు పరిధిలోనే ఇలా 20 కోట్ల రూపాయలను కాజేసినట్లు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే తరహా అక్రమాలు చోటుచేసుకున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదే జరిగివుంటే, స్కామ్ మొత్తం భారీగా పెరిగే ప్రమాదం ఉంది.

ఎలా జరిగింది...?

నెల్లూరు జిల్లాలో యాక్సిస్ బ్యాంక్‌లోని కొందరు ఉద్యోగులు, మరికొందరు ఆర్థిక నేరస్తులతో చేతులు కలిపి ఈ మోసానికి పాల్పడ్డట్టు ప్రాథమికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరేనా, వీరికన్నా పెద్దస్థాయి వ్యక్తులు ఎవరైనా ఉన్నారా అన్నది పూర్తిస్థాయి దర్యాప్తులోనే తేలనుంది. యాక్సిస్ బ్యాంకుకు నెల్లూరు, ముత్తుకూరులలో రెండు బ్రాంచ్‌లు ఉన్నాయి. వివిధ ప్రాంతాల్లో కూలీ పనులు చేసుకుంటూ, పశువుల కాపరులుగా ఉంటూ పొట్టపోసుకుంటున్న వారిని కొందరు వ్యక్తులు కలిసి బ్యాంక్ రుణాలు ఇప్పిస్తామని నమ్మబలికారు. వారి వద్ద నుంచి ఆధార్‌కార్డు, ఫొటోలు తీసుకుని బ్యాంక్ ఖాతాలు సృష్టించారు. వీటికి సంబంధించిన రికార్డులన్నింటిని వారి వద్దే ఉంచుకున్నారు. ఇలా 50 నుండి 100 మంది నుండి వీరు రికార్డులు సేకరించి ఉంటారని భావిస్తున్నారు.

నెల్లూరులోని యాక్సిస్ బ్యాంక్ కార్యాలయం

ఫేక్ కంపెనీల ఏర్పాటు...

మరోవైపు నెట్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్, ఎంఆర్ ఇన్ఫ్రా లైన్, గ్లోబల్ సొల్యూషన్, క్యాపిటల్ ట్రీ సాఫ్ట్‌వేర్ పేరుతో నాలుగు బోగస్ కంపెనీలను ఏర్పాటు చేశారు. అప్పటికే రుణాల కోసం తమ వలలో చిక్కుకున్న వారిని ఆ కంపెనీల్లో ఉద్యోగులుగా చూపించారు. ఒకొక్కరికి రూ.75 వేల నుండి లక్ష రూపాయలు జీతాలు ఇస్తున్నట్లు రికార్డులు తయారుచేశారు. ఈ మేరకు ఆరునెలల పాటు జీతాలు చెల్లించినట్లు బ్యాంకు స్టేట్‌మెంట్లు కూడా సృష్టించారు. వీటన్నింటిని ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేయడంతో ఒకొక్కరికి రూ.15 లక్షలను యాక్సిస్ బ్యాంకు రుణంగా సబ్మిట్ చేసింది. ఈ మొత్తం వ్యవహారంలో బ్యాంకు సిబ్బంది ఏ ఒక్క లబ్ధిదారుని రికార్డులను పరిశీలించలేదని, కనీసం నేరుగా మాట్లాడటం, కలవడం వంటివి కూడా చేయలేదు.

ఆన్‌లైన్ రికార్డుల పరిశీలనలో రుణానికి అర్హులని తేలడంతో అప్పు ఇచ్చేసినట్లు చెబుతున్నారు. నాలుగు నెలల బ్యాంక్‌లకు అప్పులు కట్టిన ఫేక్ కంపెనీలు ఆ తరువాత చెల్లింపులు నిలిపివేశాయి. మరోవైపు తమ రికార్డులన్నీ ఇచ్చి, రేపోమాపో అప్పు వస్తుందని ఎదురుచూస్తున్న నిజమైన మిగతా 7లో

ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ఆగస్టు 8న నిరసనలు

- సిపిఎం పొలిట్‌బ్యూరో పిలుపు
- బెంగాలీ మాట్లాడేవారిపై వేధింపులు ఆపాలని డిమాండ్
- ప్రజా ప్రయోజనాలను తాకట్టు పెట్టే ఒప్పందాలు వద్దని హితవు

న్యూఢిల్లీ : కేంద్ర ఎన్నికల సంఘం బీహార్ తరహాలోనే దేశవ్యాప్తంగా చేపట్టాలని చూస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సిఐఆర్)ను వ్యతిరేకిస్తూ ఆగస్టు 8న నిరసనలు చేపట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పిలుపునిచ్చింది. ప్రజాస్వామ్య విరుద్ధమైన ఈ ప్రక్రియను ప్రజలందరూ వ్యతిరేకించాలని కోరింది. బెంగాలీ మాట్లాడేవారిపై జరుగుతున్న వేధింపులను, హింసను తక్షణమే ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అలాగే కీలకమైన అణు శక్తి రంగంలో విదేశీ సంస్థల ప్రవేశానికి వెసులుబాటు కల్పించేలా పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న బిల్లులకు వ్యతిరేకంగా పార్టీలను సమీకరించేందుకు, ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేయాలని నిర్ణయించింది. దేశ ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకోవద్దని కేంద్రాన్ని డిమాండ్ చేసింది. ఈ నెల 18న న్యూఢిల్లీలో సమావేశమైన సిపిఎం పొలిట్‌బ్యూరో ప్రస్తుతం దేశంలో చోటు చేసుకుంటున్న పలు కీలక పరిణామాలపై కూలంకషంగా చర్చించింది. అనంతరం ఒక ప్రకటన విడుదల చేసింది.

ఎస్ఐఆర్ నెపంతో..దొడ్డిదారిన ఎన్ఆర్‌సి

బీహార్‌లో ఓటర్ల జాబితాను ప్రత్యేకంగా సమగ్రంగా సవరించాలని (ఎస్ఐఆర్) ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పుడు ఈ ప్రక్రియను దేశవ్యాప్తంగా విస్తరింపచేయాలని ఇసి భావిస్తోంది. ఓటర్ల జాబితాలను సవరించే పేరుతో ఇసి, ఓటర్ల పౌరసత్వాన్ని నిర్ధారించే అధికారాన్ని స్వాధీనం చేసుకుంటోంది. ఇది, దాని రాజ్యాంగ పరిధికి వెలుపల వున్న అంశం. ఓటర్ల జాబితా నుండి విదేశీయులను తొలగించాలనే నిరాధారమైన సాకుతో వారు, మైనారిటీలు, ఇతర ఎంపిక చేసిన గ్రూపులకు చెందిన వారికి ఓటు హక్కు లేకుండా చేయడానికి చూస్తున్నారు. ఈ మొత్తం ప్రక్రియలో వివిధ రకాలైన ఉల్లంఘనలు వున్నాయి. రాజ్యాంగం అందరికీ హామీ కల్పించిన ఓటు వేసే హక్కు చాలామందికి నిరాకరించబడవచ్చు. కోవిడ్ మహమ్మారికి ముందు ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించిన ఎన్ఆర్‌సి ప్రక్రియనే దొడ్డిదారిన రహస్యంగా అమలు చేయతలపెట్టారు. ఇప్పటివరకు బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తూ వచ్చిన ఎన్నికల కమిషన్, ఇప్పుడు ఆర్ఎస్ఎస్/సంఘ్ పరివార్ ఎజెండాను అమలు పరచడంలో భాగస్వామిగా మారింది. దేశవ్యాప్తంగా విస్తరించాలని చూస్తున్న ప్రజాస్వామ్య హక్కులపై జరుగుతున్న ఈ దాడిని ఎంతమాత్రమూ అనుమతించరాదు. బిజెపి కూటమి భాగస్వాముల్లో తెలుగుదేశం పార్టీ వంటి కొన్ని పార్టీలు ఎస్ఐఆర్ గురించి తమ ఆందోళనలను ఇప్పటికే వెలిబుచ్చాయి. ఎన్నికల కమిషన్ చేపడుతున్న ఈ ప్రజాస్వామ్య విరుద్ధమైన ప్రక్రియకు వ్యతిరేకంగా ఆగస్టు 8న దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాల్సిందిగా సిపిఎం పిలుపిచ్చింది.

(పొలిట్‌బ్యూరో మరిన్ని నిర్ణయాలు 7వ పేజీలో)

లిక్కర్ కేసులో వైసిపి ఎంపి మిథున్‌రెడ్డి అరెస్ట్

- 5గంటల పాటు విచారణ అనంతరం ప్రకటించిన సిట్ అధికారులు
- మాజీ ఎక్సైజ్‌శాఖ మంత్రి నారాయణస్వామికి నోటీస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సంచలనంగా మారిన లిక్కర్ కేసులో వైసిపి రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. దాదాపుగా ఐదుగంటల పాటు శనివారం విచారించిన అనంతరం సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేస్తున్నట్లు సిట్ అధికారులు ప్రకటించారు. ఆయన్ను ఆదివారం ఉదయం 10.30 గంటలకు ఎసిబి కోర్టు జడ్జి ముందు హాజరుపరచనున్నారు. ఇదే కేసులో అప్పటి ఎక్సైజ్ శాఖ మంత్రి నారాయణస్వామి సోమవారం ఉదయం సిట్ అధికారుల ముందు విచారణకు హాజరుకావాలంటూ నోటీస్ అందజేశారు. కీలకమైన ఈ కేసులో పోలీసులు అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ కోసం ఎంపి హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఆ రెండు కోర్టులు ముందస్తు బెయిల్‌ను తిరస్కరించిన నేపథ్యంలో ఆయన శనివారం మధ్యాహ్నం విజయవాడలోని సిట్ అధికారులు ముందు హాజరయ్యారు. లిక్కర్ కేసులో మొత్తం 41మందిని నిందితులుగా చూపగా ఇందులో 40మంది పేర్లను పేర్కొన్న అధికారులు 41వ పేరును ఖాళీగా ఉంచినట్లు తెలిసింది. బహుశా అంతిమ లబ్ధిదారుని పేరు కోసమేమన్న ఖాళీగా ఉంచి ఉంటారేమోననే చర్చ నడుస్తోంది. లిక్కర్ కేసులో పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని సిట్ అధికారులు ఎ4గా చూపించారు. . ఈ కేసులో ఎంపి మిథున్‌రెడ్డి అత్యంత కీలకమైన వ్యక్తిగా దర్యాప్తు బృందాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు ముఖ్యంగా మద్యంపాలసీ తయారీ, మిథున్‌రెడ్డి కంపెనీలకు నిధుల మళ్లింపు, మద్యం డిస్టలరీస్ నుంచి ఎలా నగదును మిగతా 7లో

నేడు, రేపు మోస్తరు నుంచి భారీ వర్షాలు

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా ఆది, సోమవారాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ప్రజలు అప్రమత్తంగా ఉండటంతోపాటు పలు జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ శాఖ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ తెలిపారు. ఈ మేరకు ఆ శాఖ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈనెల 20న అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మిగతా జిల్లాల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ నెల 21న అల్లూరి సీతారామరాజు, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

15కల్లా రాష్ట్ర సచివాలయం ప్లాస్టిక్ రహితం

- పి-4 కింద వేల కుటుంబాల దత్తతకు సిద్ధం
- వెంకన్న చెంతకు 'హంద్రీ-నీవా' నీరు
- పారిశుధ్య కార్మికుల కృషితోనే అవార్డులు
- చెత్తను ఏరేసినట్లే నేరస్తులనూ ఊడ్చేయాలి
- 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

కపిలేశ్వరస్వామి ఆలయ పరిసరాలను పారిశుధ్య సిబ్బందితో కలిసి శుభ్రం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

'పారిశుధ్య కార్మికుల కృషితోనే అవార్డులొస్తున్నాయి. వారే నిజమైన సమాజ సేవకులు. ఆగస్టు 15కల్లా రాష్ట్ర సచివాలయాన్ని ప్లాస్టిక్ రహితంగా ప్రకటిస్తాం. చెత్తను ఏరేసినట్లే నేరస్తులనూ ఊడ్చేయాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. కేన్సర్‌కు కారణమవుతున్న ప్లాస్టిక్ వాడకాన్ని దశల వారీగా తగ్గిస్తామన్నారు. వేల కుటుంబాలను పి-4 పద్ధతిలో దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా మూడో శనివారం తిరుపతికి ఆయన విచ్చేశారు. ముందుగా రేణిగుంట విమానాశ్రయానికి వచ్చిన చంద్రబాబు అక్కడి నుంచి రోడ్డు మార్గంలో రేణిగుంట సమీపంలోని తూకివాకంలో ఇంటిగ్రేటెడ్ వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రానికి చేరుకున్నారు. అధికారులతో కలిసి పరిశీలించారు. ఆ తర్వాత తిరుపతిలోని కపిలేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ పారిశుధ్య సిబ్బందితో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. ఎంఆర్‌పల్లిలోని ఎఆర్ గ్రౌండ్‌లో ప్రజావేదిక సభలో ప్రసంగించారు. పర్యావరణాన్ని కాపాడుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. చెట్లు విరివిగా నాటాలన్నారు. జాతీయ స్థాయిలో రాష్ట్రానికి ఐదు స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డులు వచ్చాయంటే అదంతా పారిశుధ్య కార్మికుల కృషి ఫలితమేనని, వీరే నిజమైన సమాజ సేవకులని అభినందించారు. పర్యావరణానికి ప్లాస్టిక్ అతిపెద్ద భూతమని, ఈ భూతానికి ఎవరూ బలికాకూడదని అన్నారు. ప్లాస్టిక్ బదులుగా గుడ్డ సంచులు, మెటల్ స్ట్రాలు, కంపోస్టబుల్ ప్లేట్ల వాడకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్ర సచివాలయాన్ని ప్లాస్టిక్ రహితంగా మారుస్తామని, అక్టోబర్ రెండు కల్లా అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, డిసెంబర్ నాటికి రాష్ట్రమంతా దీనిని అమలు చేస్తామన్నారు. ప్రపంచంలో ఏదీ వేస్ట్ కాదని, ప్రతిదాని నుంచి సంపద సృష్టించవచ్చని వివరించారు. రాష్ట్రంలో పేరుకుపోయిన చెత్తను ఈ ఏడాది డిసెంబర్‌కు క్లియర్ చేస్తామన్నారు. త్వరలోనే ప్రాజెక్టులను పూర్తి చేసి హంద్రీ-నీవా మిగతా 7లో

జిఎం విత్తనాల కోసం అమెరికా పట్టు

- వాహన, స్టీల్‌పై సుంకాలు తగ్గించాలన్న భారత్
- ముగిసిన వాణిజ్య చర్చలు

వాషింగ్టన్ : తమ జన్యు మార్పిడి (జిఎం) విత్తనాలను భారత్‌లోకి అనుమతించాల్సిందేనన్న తన డిమాండ్ పట్ల అమెరికా పట్టువీడటం లేదు. పారిశ్రామిక, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు, పాల ఉత్పత్తులు, ఆపిల్స్, బాదం తదితర వాటిపై సుంకాలను తగ్గించాలని కోరుతోంది. వాషింగ్టన్‌లో భారత్ - అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం నాలుగు రోజుల పాటు జరిగిన ఐదో దశ చర్చలు ఈ నెల 17న ముగిశాయి. ఆగస్టు 1లోపు తాత్కాలిక వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకునే ఉద్దేశంతో ఈ సమావేశాలు జరిగాయి. భారత్ తరపున వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ అగర్వాల్ నేతృత్వం వహించారు. ఈ చర్చల్లో మొక్క జొన్న, సోయాబీన్‌లకు సంబంధించిన జన్యు మార్పిడి విత్తనాలను, పాలు, పాల ఉత్పత్తులు, జిఎం పశుగ్రాసాన్ని భారత్‌లోకి అనుమతించాలని అమెరికా ఒత్తిడి చేసినట్లు తెలుస్తోంది. ఆటోమొబైల్స్, స్పెషల్ కెమికల్స్, ఎక్విప్‌మెంట్ అండ్ టెక్నాలజీస్ అంశాలు చర్చకు వచ్చినట్లు రిపోర్టులు వస్తున్నాయి. భారత్ నుంచి అమెరికా దిగుమతి చేసుకుంటున్న స్టీల్‌పై వేస్తోన్న 50 శాతం, వాహనాలపై వేస్తోన్న 25 శాతం సుంకాలను రద్దు చేయాలని ఇండియా కోరుతుంది. టెక్స్‌టైల్స్, రత్నాలు, ఆభరణాలు, తోలు వస్తువులు, దుస్తులు, ప్లాస్టిక్స్, రొయ్యలు, నూనె గింజలు, ద్రాక్ష, అరటిపండ్ల వంటి ఉత్పత్తులపై సుంకాలను తగ్గించాలని డిమాండ్ చేసింది.

"ఈ దశ చర్చలు షెడ్యూల్ ప్రకారం ముగిశాయి. వ్యవసాయం, ఆటోమొబైల్స్‌లో సుంకాల తగ్గింపుపై దృష్టి సారించాం. రానున్న రోజుల్లో వర్చువల్ చర్చలు కొనసాగవచ్చు. భారత్‌పై ట్రంప్ పూర్తిగా సుంకాలను ఉపసంహరించుకోకపోవచ్చు. అయితే.. వియత్నాం, ఇండోనేషియా తరహాలో సుంకాల రేటును తగ్గించే అవకాశం ఉంది." అని ఓ అధికారి పేర్కొన్నారు.

వచ్చే అక్టోబర్ ముగింపు నాటికి మొదటి వాణిజ్య దశను పూర్తి చేయాలని ఇరు దేశాలు నిర్దేశించుకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ 2న భారత ఎగుమతులపై 26 శాతం టారిఫ్‌లు విధించారు. జులై 9 నాటికి తాత్కాలిక ఒప్పందం కుదరకపోవడంతో ఆ గడువును ఆగస్టు 1 వరకు పొడిగించారు. "భారత్‌తో త్వరలోనే వాణిజ్య ఒప్పందం కుదరనుంది. ఒప్పందంలో 30 శాతం, 25 శాతం, 20 శాతం టారిఫ్‌లను విధిస్తాం." అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పేర్కొన్నారు. ప్రస్తుత ఏడాది 2025 ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో అమెరికాకు భారత్ ఎగుమతులు 22.8 శాతం పెరిగి 25.51 బిలియన్ డాలర్లకు చేరాయి. అమెరికా నుంచి దిగుమతులు 11.68 శాతం పెరిగి 12.86 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

క్యూబాకు సంఘీభావంగా ఫుట్‌బాల్ టోర్నీ

- ఢిల్లీలో ఆగస్టు 2-3, 9-10 తేదీల్లో నిర్వహణ

7

అంగన్‌వాడీ కార్యకర్త తొలగింపు చెల్లదు

- హైకోర్టు కీలక తీర్పు

ప్రజాశక్తి-అమరావతి

అంగన్‌వాడీ కార్యకర్తను విధుల నుంచి చట్ట వ్యతిరేకంగా, సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా తొలగించారని హైకోర్టు తప్పు పట్టింది. పిటిషనర్ వాణ లక్ష్మికి ముందుగా షోకాజ్ నోటీసు ఇవ్వకుండా తొలగిస్తూ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ప్రాజెక్ట్ అధికారి 2013లో ఇచ్చిన ప్రొసీడింగ్స్ చెల్లవని తేల్చింది. ఆమెను వేధనకు గురిచేసినందుకు ఖర్చుల కింద రూ.25 వేలను నాలుగు వారాల్లోగా చెల్లించాలని ఆదేశించింది. శ్రీకాకుళంజిల్లా ఆమదాలవలస మండలం పొన్నంపేటకు చెందిన లక్ష్మి 2012 సెప్టెంబర్‌లో అంగన్‌వాడీ కార్యకర్తగా ఎంపికై, విధుల్లో చేరారు. ఆ తరువాత మూడు నెలలకు ఆమె తమ గ్రామస్తురాలు కాదని, ఆమె వయసు 35 ఏళ్లు దాటిందని పున్నంపేటకు చెందిన జి.శ్యామల, ఎస్. త్రినాథమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నోటీసు కూడా ఇవ్వకుండా ఉద్యోగం నుంచి తొలగిస్తూ సంబంధిత అధి కారి 2013 జనవరి 8న ఉత్తర్వులు ఇవ్వడాన్ని లక్ష్మి హైకోర్టులో సవాల్ చేశారు. నోటిఫికేషన్ జారీ నాటికి తన వయసు 35 ఏళ్లలోపేనని, ఆమె పున్నంపేట వాసేనని తహసీల్దార్ సర్టిఫికెట్ ఇచ్చారని ఆమె పేర్కొన్నారు.

ఐటిసి కంపెనీ స్టాక్ యార్డులో భారీ అగ్నిప్రమాదం

రూ.కోట్లలో ఆస్తి నష్టం

ప్రజాశక్తి- ఆనందపురం (విశాఖపట్నం)

విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం రామవరం-గండిగుండం రోడ్డులోని ఐటిసి కంపెనీ స్టాక్ యార్డులో శుక్రవారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో మొదలైన మంటలు వేగంగా వ్యాపించడంతో రూ.కోట్లలో ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. స్థానికులు, అధికారుల కథనం ప్రకారం... ఉప్పు, గోధుమలు, చాక్లెట్లు, సిగరెట్లు, అగరబత్తీలు వంటి నిత్యావసర వస్తువులు ఈ గోదాములో నిల్వ చేసి ఒడిశా తదితర రాష్ట్రాలకు సరఫరా చేస్తుంటారు. అగ్నిప్రమాదంతో ఆ సరుకులన్నీ కాలిపోయాయి. విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి జిల్లాల నుంచి పది అగ్నిమాపక వాహనాలు వచ్చి మంటల అదుపునకు తీవ్రంగా శ్రమించాయి. మంటలు అధికంగా వ్యాపించడంతో సహాయక చర్యలు ఆదివారం ఉదయం వరకూ కొనసాగాయి. గ్రామ సర్పంచ్ గంద్రెడ్డి శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బందికి సహకారం అందించారు. గోదాం మేనేజర్ విశాఖలో ఉండడంతో గేట్లు తెరవడం ఆలస్యమైంది. స్థానిక యువకులు గేట్లు తెరిచి మంటలను కొంతవరకు అదుపులోకి తెచ్చారు. ఈ స్థలం టిడిపి అవనిగడ్డ ఇన్‌ఛార్జి విక్రుతి శ్రీనివాసరావుకు చెందినది. నిర్వహణను కోల్‌కత్తాకు చెందిన బాబీ ఘోష్ సహా మరికొంతమంది చూస్తున్నట్టు సమాచారం. కంపెనీలో భద్రతా ప్రమాణాలు తక్కువగా ఉండడం, ఫైర్ సేఫ్టీ లేకపోవడం ప్రమాద తీవ్రతకు కారణమని అధికారులు తెలిపారు. కంపెనీలో గుట్కా, ఖైనీ, పాన్‌పరాగ్ తదితర నిషేధిత ఉత్పత్తులు భారీగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదస్థలాన్ని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అధికారులు పరిశీలించారు. కంపెనీ యాజమాన్యం పూర్తి స్థాయిలో వివరాలను అందించడం లేదు. ఇది స్టాక్ యార్డు కావడం, అర్ధరాత్రి ప్రమాదం జరగడం, ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టమూ జరగలేదు. సహాయక చర్యల్లో అగ్నిమాపక రీజనల్ డైరెక్టర్ నిరంజన్, డిఎఫ్ రేణుక, చిట్టివలస ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరాజు, ఆనందపురం సిఐ వాసునాయుడు, ఎస్ఐ సంతోష్ పాల్గొన్నారు.

ఐటిసి స్టాక్ కంపెనీలో ఎగిసి పడుతున్న మంటలు

దారుణ హత్యలు

- కడపలో భార్యను చంపి అడవిలో పడేసిన వైనం
- తిరుపతిలో భార్యను చంపి తానూ ఆత్మహత్య

ప్రజాశక్తి - చాపాడు, మంగళం

కట్టుకున్న భార్యలపై అనుమానంతో ఇద్దరు భర్తలు దారుణాలకు ఒడిగడ్డారు. వైఎస్ఆర్ కడప జిల్లాలో భార్యను హతమార్చి మృతదేహాన్ని అడవిలో పడేశాడు. తిరుపతిలో ఉద్యోగానికి వెళుతున్న తన భార్యను కాపు కాచి మారుణాయుధంతో దాడి చేశాడు. ఆపై తానూ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, మృతుల కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు... వైఎస్ఆర్ కడప జిల్లా చాపాడు మండలం పెద్ద చియ్యపాడు గ్రామంలో దంపతులు సుజాత (36), గోపాల్ నివసిస్తున్నారు. గోపాల్ వృత్తిరీత్యా బస్సు డ్రైవర్. తన భార్యపై అనుమానంతో పలుమార్లు గొడవపడ్డాడు. రెండు రోజుల క్రితం సుజాతను హత్య చేసి మృతదేహాన్ని గోనె సంచిలో తీసుకెళ్లి మైదుకురు మండలం పరిధిలోని ముద్దిరెడ్డిపల్లె అటవీ ప్రాంతంలో లోయలో పడేశాడు. అనంతరం పోలీసుల ఎదుట లొంగిపోయాడు. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

తిరుపతికి చెందిన ఉష (34)కు జీడి నెల్లూరుకు చెందిన ఎం.లోకేశ్వర్‌తో 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. అమర్‌రాజా బ్యాటరీస్ కంపెనీలో ఉష ఉద్యోగం చేస్తున్నారు. భార్యపై అనుమానంతో లోకేశ్వర్ చిత్రహింసలు పెట్టేవాడు. వేధింపులు తాళలేక గత నెల 29న తిరుమల నగర్‌లో అద్దెకు ఉంటున్న ఇంటి నుంచి కోళ్లఫారాల్లోని పుట్టింటికి వచ్చారు. శనివారం విధులకు వెళ్తుండగా కాపు కాచి ఉషను కత్తితో దాడి చేశాడు. అక్కడికక్కడే ఆమె మరణించారు. లోకేశ్వర్ కూడా అద్దెకుంటున్న ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దారుణ కేసుల్లో నిందితులకు బెయిల్ ఇవ్వలేం : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

యజమాని భార్యపై అత్యాచారయత్నం చేసి, ఆమె ప్రతిఘటించడంతో హత్య చేసి, మృతదేహంతో లైంగిక వాంఛ (నెక్రోఫిలియా) తీర్చుకున్నాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. పోలీసులు నమోదు చేసిన కేసు ప్రకారం... శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో ఒక వ్యక్తి 15 ఏళ్లుగా ఆస్పత్రి నిర్వహిస్తున్నారు. అందులో పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన నయాన్ బిశ్వాస్ కాంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. ఆస్పత్రి యజమాని ఇంట్లోనే నివాసం ఉంటున్నాడు. యజమాని భార్యపై ఈ ఏడాది జనవరి 1వ తేదీ తెల్లవారుజామున అత్యాచారానికి ప్రయత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో తలపై దారుణంగా కొట్టి హత్య చేశాడు. చీకట్లోనే ఆమె మతదేహాన్ని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి నెక్రోఫిలియాకు పాల్పడ్డాడు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కావలి వన్ టౌన్ పోలీసులు నయాన్ బిస్వాస్‌ను అరెస్టు చేసి, జైలుకు పంపారు. పోలీసులు చార్జిషీటు దాఖలు చేసినప్పటికీ జైల్లోనే ఉంచారని, తనకు బెయిల్ ఇవ్వాలని నయాన్ బిస్వాస్ హైకోర్టులో వేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ఇటీవల తీర్పు వెలువరించారు. కేసు వివరాలను పరిశీలిస్తే ముందస్తు ప్రణాళిక ప్రకారమే నేరానికి పాల్పడినట్టు ప్రాథమికంగా స్పష్టం అవుతోందన్నారు. తీవ్రమైన నేర ప్రవృత్తి ఉంటేనే నెక్రోఫిలియాకు పాల్పడతారని, ఇలాంటి నిందితులు జైల్లోనే ఉండాలని, బయటకు వస్తే వేరే వాళ్లకు, సమాజానికి ఎంతమాత్రం శ్రేయోదాయకం కాదని హెచ్చరించారు. అందుకే నిందితుడి బెయిల్ పిటిషన్‌ను కొట్టేస్తున్నట్లు తీర్పులో పేర్కొన్నారు.

పార్లమెంట్‌లో కేంద్రాన్ని ప్రశ్నించండి

- పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఈ పార్లమెంట్ సమావేశాల్లోనైనా రాష్ట్ర హక్కులపై కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీలు నిలదీయాలని పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ఎత్తు కుదింపు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ తదితర అంశాలపై కేంద్రాన్ని ప్రశ్నించాలని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విభజన చట్టం ప్రకారం రాష్ట్ర హక్కులపై గళం విప్పకుండా, బిజెపి అక్రమ బిల్లులకు తల ఊపుతున్నారని తెలిపారు. రాష్ట్రానికి చెందిన 25 మంది లోక్ సభ సభ్యులు, 11 మంది రాజ్యసభ సభ్యులు ప్రధాని మోడీ చేతిలో రబ్బర్ స్టాంప్‌లుగా మారిపోయారని పేర్కొన్నారు.

పోరాడితేనే విజయం

- సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలి : వి. శ్రీనివాసరావు
- కొనసాగుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

కార్మికులకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న వి. శ్రీనివాసరావు

ప్రజాశక్తి - యంత్రాంగం

వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె ఏడవ రోజుకు చేరుకుంది. నెల్లూరులో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మెకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మద్దతు తెలిపారు. కార్మికులు ఐక్యంగా పోరాడితే విజయం తప్పక సాధించి తీరుతారని, అంతిమ విజయం కార్మికులదేనని ఆయన తెలిపారు. సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల పోరాటానికి సిపిఎం ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. గాంధీ బొమ్మ సెంటర్ నుంచి పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహం మీదుగా గాంధీబొమ్మ సెంటర్ వరకూ ర్యాలీ చేశారు. కార్మికులనుద్దేశించి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తదితరులు ప్రసంగించారు. ఏడురోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా వారి సమస్యలను పరిష్కరించకుండా ఉత్సవాలల్లో పురపాలక శాఖ మంత్రి నారాయణ పాల్గొనడం విచారకరమన్నారు. జిఒ నంబర్ 36 ప్రకారం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని, కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాలు చాకిరీ చేయించుకుని... 60 సంవత్సరాలు నిండాయనే నెపంతో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా కార్మికులను నిలిపివేయడం చట్టవ్యతిరేకమన్నారు. కార్మికులకు గ్రాట్యూటీ, పెన్షన్, వారసులకు ఉద్యోగాలు తదితర కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో జిఒ 279 ప్రకారం కార్మికుల పనులను కాంట్రాక్టర్లకు ఇచ్చేందుకు సిద్ధమైనప్పుడు కార్మికులు ఐక్యంగా పోరాటం చేశారని గుర్తు చేశారు. మరలా వాటిని తీసుకువచ్చి టెండర్లు పిలవడం మంచి పద్ధతి కాదని, తక్షణమే టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ల కింద బానిసలుగా కార్మికులను మార్చే ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు.

తిరుపతి జిల్లా నాయుడుపేట పురవీధుల్లో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. సమ్మెకాలపు ఒప్పందాలకు జీవోలివ్వాలని నినాదాలు చేశారు. సూళ్లూరుపేటలో మున్సిపల్ కార్యాలయం వద్ద చెవిలో పువ్వులు పెట్టుకుని, మోకాళ్లపై నిల్చుని వినూత్న రీతిలో కార్మికులు నిరసన తెలిపారు. విజయనగరం జిల్లా పాలకొండలో వేపాకులు తింటూ కార్మికులు నిరసన తెలియజేశారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో మున్సిపల్ కార్యాలయం నుంచి మెరక వీధి అంబేద్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ కోనసీమలో కార్మికులు నిరసన తెలిపారు. విజయవాడ ధర్నా చౌక్‌లో ఆందోళన చేపట్టారు. నందిగామలో కళ్లకు గంతలు కట్టుకుని మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

ఏలూరు జిల్లా నూజివీడులో చెవిలో గులాబీ పూలు పెట్టుకుని నిరసన తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరంలో ఆయా మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. అనంతపురం, గుత్తి, రాయదుర్గం, తాడిపత్రి, ధర్మవరం, పుట్టపర్తి, హిందూపురం తదితర మున్సిపాలిటీల్లో కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు.

ఇకపై అలా చేయను

- కార్మికులకు మున్సిపల్ కమిషనర్ క్షమాపణలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మున్సిపల్ కార్మికులు నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేయడంపై మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, సిఐటియు జిల్లా కార్యదర్శి జోక్యంతో శనివారం వివాదం పరిష్కారమైంది. మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి బూతులు తిట్టారంటూ మున్సిపల్ కార్మికులు, దంపతులు కొండలరావు, పైడమ్మ నిద్ర మాత్రలు మింగి శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. వారు ప్రస్తుతం నూజివీడు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారికి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ రంగంలోకి దిగి ఘటనపై మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డితో చర్చించారు. నాణ్యమైన పని చేయించే క్రమంలో తాను దూషించిన మాట వాస్తవమేనని, ఇకపై అలాంటి పరిస్థితులు తలెత్తవని హామీ ఇస్తూ బాధితులకు మున్సిపల్ కమిషనర్ క్షమాపణ చెప్పారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ కార్మికులతో అధికారి హోదాలో పనులు చేయించుకోవచ్చని, దూషిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ కార్మికులకు ప్రభుత్వం, కౌన్సిల్ తరపున క్షమాపణ చెప్పారు. కార్మికులను అధికారులు దూషిస్తే సహించే ప్రసక్తి లేదన్నారు. కార్మికులకు జరిగిన అన్యాయంపై చర్యలు తీసుకుంటామని, కార్మికులకు అండగా ఉంటానని మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కొలుసు పార్థసారధి హామీ ఇచ్చారని వైస్ చైర్మన్ తెలిపారు. ఈ నేపథ్యంలో చికిత్స పొందుతున్న కార్మికులను కమిషనర్ పరామర్శించారు.

21న సిడిపిఒ కార్యాలయాల వద్ద ధర్నాలు

- ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి- భీమవరం

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 21న సిడిపిఒ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ తెలిపారు. ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పని భారాన్ని తగ్గించాలని, ప్రీ స్కూల్స్ బలోపేతానికి చర్యలు చేపట్టాలని తదితర డిమాండ్లతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. అంగన్‌వాడీలు, అంగన్‌వాడీ లబ్ధిదారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో అంగన్‌వాడీల జిల్లా విస్తృత స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షులు కె.ఝాన్సీలక్ష్మి అధ్యక్షతన శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన సుబ్బరావమ్మ మాట్లాడుతూ 42 రోజుల సమ్మె వీరోచిత పోరాటమని, అనేక జిఒలను సాధించుకోగలిగామని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, అన్ని యాప్‌లనూ కలిపి ఒకే యాప్‌గా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి డి.కల్యాణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.

భూములు లాక్కుంటున్నారు!

- కార్పొరేట్లకు లబ్ధి ... రైతులకు తీవ్ర అన్యాయం
- నేడు నంద్యాలలో రాష్ట్ర భూ సదస్సు

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

గత ఎన్నికల్లో భారీ మెజారిటీతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో రైతుల నుండి భూమిని లాక్కుంటోంది! కార్పొరేట్లకు లబ్ధి చేయడమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ ప్రక్రియ సాగుతోంది. గ్రామ సభలు నిర్వహించడం, చర్చించడం, ఆమోదించడం వంటి చట్టబద్ధ చర్యలేమి లేకుండా ఈ చర్యలు సాగుతుండటం గమనార్హం. సోలార్, గ్రీన్ ఎనర్జీ పేరుతో రాయలసీమలోని నంద్యాల జిల్లాలో 25 వేల ఎకరాలు, కర్నూలు జిల్లాలో 20 వేల ఎకరాలు, అనంతపురం జిల్లాలో 50 వేల ఎకరాలు అప్పగించింది. అందులో గుత్తి ప్రాంతంలోనే 17 వేల ఎకరాలు కట్టబెట్టింది. శ్రీసత్యసాయి జిల్లాలో 52 వేల ఎకరాలు అప్పగించింది. ఎస్‌పి కుంట ప్రాంతంలో 10,600 ఎకరాలు, మడకశిరలో 20 వేల ఎకరాలు, రొద్దం మండలంలో 6,500 ఎకరాలు, పరిశ్రమల కోసం హిందూపురం, లేపాక్షి ప్రాంతంలో 2,100 ఎకరాలు బలవంతంగా లాక్కొంది. కడప జిల్లాలో 20 వేల ఎకరాలకుపైగా వివిధ ప్రైవేట్ కార్పొరేట్ విద్యుత్ సంస్థలకు కట్టబెట్టింది. 30 సంవత్సరాల ఒప్పందంతో ఎకరాకు రూ.31 వేల లీజు ఇచ్చే విధంగా లేదా ఎకరాకు రూ.ఐదు లక్షల ఖరీదుతో భూములు కొనుగోలు చేసేందుకు ప్రైవేట్ కంపెనీలకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో విమానాశ్రయం కోసం 2,500 ఎకరాలను బలవంతంగా సేకరిస్తోంది. నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గం కరేడు గ్రామంలో రైతులకు సంబంధించిన రెండు పంటలు పండే సారవంతమైన 8,458 ఎకరాల వ్యవసాయ భూములను ఇండోసోల్ సంస్థకు కేటాయించింది. ప్రతిపక్షంలో ఉండగా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇదే సంస్థకు రామాయపట్నం దగ్గర భూములు కేటాయిస్తే తీవ్రంగా వ్యతిరేకించిన టిడిపి ఇప్పుడు అదే సంస్థకు అడ్డగోలుగా వేల ఎకరాల భూములను కేటాయిస్తోంది. శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో 16 గ్రామాల్లో కార్గో ఎయిర్ పోర్ట్ పేరుతో 1,400 ఎకరాలను సేకరించేందుకు బలవంతపు చర్యలు చేపట్టింది. విజయనగరం జిల్లా ఎస్.కోట, వేపాడ మండలాల్లో అల్యూమినియం ఫ్యాక్టరీ, హైడ్రో పవర్ ప్రాజెక్టు కోసం 1,600 ఎకరాల భూములను లాక్కొంటోంది. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో బల్క్ డ్రగ్స్ ఫార్మా పరిశ్రమలు, మిట్టల్ స్టీల్ ప్లాంట్ కోసం పది వేల ఎకరాల భూమిని కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేసింది. అల్లూరు జిల్లా అనంతగిరిలో గిరిజన చట్టాలను ఉల్లంఘించి అదాని హైడ్రో పవర్ ప్రాజెక్టుల కోసం ఏడు వేల ఎకరాల భూమిని సేకరించేందుకు పూనుకుంది. జాతీయ రహదారులు, రైల్వే లైన్లు, గ్యాస్ పైపులైన్లు, సోలార్, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమల నిర్మాణం పేరుతో ఇలా రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది ఎకరాల రైతుల భూములను ప్రైవేటు కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం చేస్తోన్న ప్రయత్నాలను రైతు సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. బలవంతపు భూ సేకరణను వ్యతిరేకిస్తూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో నంద్యాలలో ఆదివారం రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నారు. ఇందులో రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకరరెడ్డి, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జాతీయ అధ్యక్షులు సుంకర రాజేంద్ర ప్రసాద్ పాల్గొననున్నారు. ఈ సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఓ ప్రకటనలో కోరింది.

ప్రభుత్వ చర్యలను తిప్పికొట్టాలి

కార్పొరేట్ కంపెనీల విషయంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో రోజుల వ్యవధిలోనే లక్షల ఎకరాల ప్రభుత్వ భూములను, రైతుల వ్యవసాయ భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే విషయంలో ప్రభుత్వం రాకెట్ వేగంతో పని చేస్తోంది. బలవంతపు భూ సేకరణను రైతాంగం ఐక్యంగా ప్రతిఘటించాలి. ప్రభుత్వ చర్యలను తిప్పికొట్టి భూములను కాపాడుకోవాలి. కార్పొరేట్ కంపెనీలకు భూ పందారానికి వ్యతిరేకంగా సామాన్య, పేద, మధ్య తరగతి రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం గురించి చర్చించేందుకు, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు నంద్యాలలో రాష్ట్ర భూ సదస్సు నిర్వహిస్తున్నాము. భూ సమస్యలతో బాధపడుతున్న రైతాంగం ఈ సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలి. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ఉద్యమంలో భాగస్వాములు కావాలి.

- కె.ప్రభాకర్ రెడ్డి,
ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

తలసేమియాపై అవగాహన రన్

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

తలసేమియా రన్‌ను ప్రారంభిస్తున్న ఎన్‌టిఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి, ఒలింపిక్ పతాక విజేత కరణం మల్లేశ్వరి

ఎన్‌టిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యాన విశాఖపట్నం ఆర్‌కె.బీచ్ రోడ్డులో తలసేమియాపై అవగాహన రన్ నిర్వహించారు. ఈ రన్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి, ఎన్‌టిఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ప్రారంభించారు. ఒలింపిక్ పతాక విజేత కరణం మల్లేశ్వరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంగీత దర్శకుడు ఎస్ఎస్.తమన్, హోం మంత్రి అనిత, ఎన్‌టిఆర్ ట్రస్ట్ సిఇఒ కె.రాజేంద్రకుమార్ తదితర ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు. నగరవాసులు ఉత్సాహంగా రన్‌లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అంతర్జాతీయ క్రీడాకారులను సత్కరించారు. అనంతరం గ్రాండ్ మ్యూజికల్ నైట్ నిర్వహించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ తలసేమియాపై అవగాహన కల్పించేందుకు ఈ రన్ నిర్వహించామని చెప్పారు. తలసేమియాతో బాధపడుతున్న చిన్న పిల్లల్ని చూసినప్పటి నుంచి ఈ ప్రయాణం మొదలుపెట్టామని, ఈ ప్రయాణంలో మొదటగా విజయవాడలో మ్యూజికల్ నైట్ నిర్వహించామని తెలిపారు. తమ ట్రస్ట్ ద్వారా ఇప్పటివరకు ఎనిమిది లక్షల మందికి పైగా రక్తాన్ని అందించామని చెప్పారు. 15 వేలకుపైగా ఆరోగ్య శిబిరాలు, సంజీవిని ఫ్రీ క్లినిక్ ద్వారా లక్షలాది మందికి వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. కరణం మల్లేశ్వరి మాట్లాడుతూ.. ఈ వ్యాధి గురించి అవగాహనకు రన్ చేయడం ఆనందంగా ఉందన్నారు. తలసేమియా బాధితులకు ప్రయోజనం కలిగేలా అందరి సహాయ సహకారాలు అవసరమన్నారు. ఎస్ఎస్.తమన్ మాట్లాడుతూ, తలసేమియా రన్‌లో భాగం కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ ట్రస్ట్ సిఇఒ కె.రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

ఎపి సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఆక్వాటిక్ పోటీలు ప్రారంభం

- క్రీడా సదుపాయాల కల్పనకు దాతలు సహకరించాలి: శాప్ చైర్మన్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

ఎపి సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఆక్వాటిక్ పదవ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు విశాఖపట్నం ఆక్వాటిక్ స్పోర్ట్స్ కాంప్లెక్సులో పోటీలను నిర్వహించనున్నారు. తొలిరోజు బాలుర వంద మీటర్ల విభాగంలో ఏలూరు జిల్లాకు చెందిన బి.స్వామినాయుడు, 200 మీటర్ల విభాగంలో అనంతపురం జిల్లాకు చెందిన ఎస్.కార్తికేయ, 400 మీటర్ల విభాగంలో కాకినాడకు చెందిన కె.దర్శిల్, 1500 మీటర్ల విభాగంలో విశాఖపట్నం జిల్లాకు చెందిన జి.యాస్మిత్ బంగారు పతకాలు సాధించారు. బాలికలకు సంబంధించి వంద మీటర్ల విభాగంలో కృష్ణా జిల్లాకు చెందిన వై.పార్థవి, 200 మీటర్ల విభాగంలో గుంటూరు జిల్లాకు చెందిన బి.భవ్యశ్రీ, 400 మీటర్ల విభాగంలో కృష్ణా జిల్లాకు చెందిన ఎం.తాన్విశ్రీయ బంగారు పతకాలు సాధించారు. ఈ పోటీలను శాప్ డైరెక్టర్లు, ఆక్వాటిక్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పిజివిఆర్.నాయుడు (గణబాబు) ప్రారంభించారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ.. క్రీడాకారులను ఇబ్బందులకు గురిచేసిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పి-3, పి-4 విధానంలో క్రీడలను అభివృద్ధి చేసేందుకు పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, దాతలు ముందుకొచ్చి క్రీడాసదుపాయాల కల్పనకు సహకరించాలని కోరారు.

పరిశ్రమలు, ఉద్యోగాలు ఎక్కడ?

- కార్పొరేట్ శక్తులకు భూములు కట్టబెడుతున్న ప్రభుత్వం
- పార్టీ శ్రేణులు ప్రజలకు చేరువ కావాలి : వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-నెల్లూరు

పరిశ్రమలు వస్తున్నాయని... ఉద్యోగాలిచ్చామని... ఉపాధి కల్పించామని టిడిపి కూటమి ప్రభుత్వం చెబుతోందని, ఎక్కడ పరిశ్రమలు పెట్టారు, ఎంతమందికి ఉద్యోగాలిచ్చారో చెప్పాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరిగిన పార్టీ వర్క్‌షాపులో మాట్లాడారు. నెల్లూరు జిల్లాలో 50 వేల ఎకరాల భూమిని కార్పొరేట్ శక్తులకు అప్పగించారన్నారు. ఎన్ని ప్రాంతాల్లో పరిశ్రమలు నెలకొల్పారని, ఎంతమంది నిరుద్యోగులకు ఉపాధి చూపించారని, ఎంతమందికి పునరావాసం చూపించారని ప్రశ్నించారు. ప్రభుత్వం ఒక శ్వేతపత్రం విడుదల చేసి, అప్పుడు అభివృద్ధి గురించి మాట్లాడాలన్నారు. అభివృద్ధి అంటే మానవాభివృద్ధిని, ప్రతి ఒక్కరికీ పోషకాహారం అందాలని, చేసేందుకు ఉద్యోగం, ఉండేందుకు ఇల్లు ఇలా.. అన్ని ఉంటే అభివృద్ధి చెందినట్లు అవుతుందని వివరించారు. నాలుగు రోడ్లు, రెండు ఫ్లైఓవర్లు వస్తే అభివృద్ధి చెందినట్లు కాదన్నారు. దేశ సంపదను మరో ప్రాంతానికి తరలించేందుకు ఇవి ఉపయోగపడతాయే కానీ, ప్రజలు అభివృద్ధి చెందేందుకు దోహదపడవని పేర్కొన్నారు. ఇది ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించాల్సిన ఆవశ్యకత కమ్యూనిస్టులపై ఎంతైనా ఉందని తెలిపారు. అభివృద్ధి పేరుతో మోడీ, చంద్రబాబునాయుడు చెబుతున్న మాయమాటలను, వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు అన్ని విధాలుగా దోపిడీకి, అణచివేతకు గురవుతున్నారని తెలిపారు. భూస్వామ్యవర్గానికి, కార్పొరేట్లకు మధ్య విడదీయలేనంతగా బంధం ఏర్పడిందన్నారు. పారిశ్రామిక క్లస్టర్లు, ఇండస్ట్రియల్ కారిడార్స్ వంటి వాటిలో కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. ఈ రెండు ప్రధాన శక్తుల బంధం బలపడినందున కమ్యూనిస్టులు మరింత శక్తి పెంచుకోవాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. గ్రామీణ ప్రాంతంలో ప్రతి ఇల్లూ రుణబాధలు ఎదుర్కొంటోందని తెలిపారు. అప్పులు తీర్చేందుకు కార్మికులు మారుతున్నారని వివరించారు. ప్రజల సమస్యలపై పార్టీ శ్రేణులు పోరాడి వారికి చేరువ కావాలని కోరారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల కలిగే నష్టాన్ని తెలిసే విధంగా రూపొందించిన కరపత్రాలను, స్టిక్కర్లను ప్రజలందరికీ అందజేయాలన్నారు. వర్క్‌షాపులో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఎంవిఎస్ శర్మ

జాతీయోద్యమమే రాజ్యాంగానికి పునాది

- మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

ప్రజాశక్తి-కాకినాడ

బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జాతీయోద్యమం పునాదిగా భారత రాజ్యాంగం ఏర్పడిందని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ అన్నారు. 'భారత రాజ్యాంగం-సెక్యులరిజం, సోషలిజం' అనే అంశంపై కాకినాడ జిల్లా కేంద్రంలోని యుటిఎఫ్ హోమ్‌లో రఘుపతి వెంకటరత్నం నాయుడు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ... 600 పైగా సంస్థానాలు, వందల మత ఆచారాలు, పలురకాల భాషలు, వేల సంఖ్యలో కులాలు కలిగిన దేశంలో ప్రజలందరూ ఉమ్మడి ఆకాంక్షతో పోరాడిన ఫలితంగా స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. లౌకికవాదం అంటే రాజ్యం, మత కార్యకలాపాల్లో జోక్యం చేసుకోరాదని, సోషలిజం అంటే అసమానతలు తగ్గాలన్నారు. స్వావలంబన, ఫెడరలిజం, సామాజిక న్యాయం రాజ్యాంగంలో కీలకంగా ఉన్నాయన్నారు. సెక్యులరిజం, సోషలిజం ఎమర్జెన్సీ సమయంలో రాజ్యాంగ సవరణ ద్వారా వచ్చాయని, వాటిని తొలగించాలని ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తోందన్నారు. దేశం ఎదుర్కొంటున్న అవిద్య, అనారోగ్యం, ఆకలి, ఉపాధి లేమి, మహిళలపై వేధింపులు వంటి సమస్యలు పరిష్కారం కావాలని కోరారు. అణగారిన వర్గాల గురించే కాక మహిళా సమానత్వం కోసం అంబేద్కర్ పరితపించి, తన కేంద్ర మంత్రి పదవికే రాజీనామా చేశారని చెప్పారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై వేస్తున్న విద్యుత్ ఛార్జీలు, ఇతర భారాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షులు జి.బేబిరాణి, పలువురు ప్రజా సంఘాల కార్యకర్తలు, నగర పౌరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్‌టిసి స్థలాలను ప్రైవేట్ సంస్థలకు కేటాయించొద్దు

- ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ పాత బస్టాండు గవర్నర్‌పేట డిపో-2 స్థలాలను బహుళ జాతి సంస్థలకు షాపింగ్‌మాల్స్ కోసం ఇచ్చే ప్రతిపాదనలను ప్రభుత్వం విరమించుకోవాలని ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఎస్‌డబ్ల్యుఎఫ్ గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలానీ బాషా, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ సుందరయ్య, ఎం.అయ్యప్పరెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గవర్నర్‌పేట డిపోను లూలూ అంతర్జాతీయ వాణిజ్య సంస్థకు ఇస్తున్నట్లు పత్రికల్లో వార్తలు చూసి ఆందోళనకు గురయ్యామన్నారు. ప్రయాణికులు, నగర ప్రజలు, ప్రజాసంఘాల సహకారంతో గవర్నర్‌పేట డిపో-2ను కాపాడుకుంటామని ఎస్‌డబ్ల్యుఎఫ్ పేర్కొంది. లూలూ కంపెనీ కోసం ఆర్‌టిసి డిపోను మరొక ప్రాంతానికి తరలించాలని ప్రభుత్వం నిర్ణయించడం విచారకరమన్నారు. ఈ నిర్ణయం ప్రజలు, ప్రయాణికుల ప్రయోజనాలకు, ఆకాంక్షలకు విరుద్ధమని తెలిపారు.


జయంత్‌ను అభినందిస్తున్న కళాశాల సెక్రెటరీ, ప్రిన్సిపల్

ఆర్‌విఆర్ జెసి కళాశాల విద్యార్థికి జాతీయస్థాయి అవార్డు

ప్రజాశక్తి-గుంటూరు

యువ ఆవిష్కర్తలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో తమ కళాశాల విద్యార్థికి ప్రతిష్టాత్మక అవార్డు లభించిందని గుంటూరు జిల్లా ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజనీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ కె.జగదీష్ తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ గణాంక శాఖ, మై గవర్నమెంట్ సంయుక్తంగా నిర్వహించిన డేటా విజువలైజేషన్ హ్యాకథాన్ ఆన్‌లైన్ పోటీల్లో తమ కళాశాలలో డేటా సైన్స్ విభాగంలో తృతీయ సంవత్సరం చదువుతున్న పి.జయంత్ అందించిన ప్రాజెక్టు నాలుగో స్థానంలో నిలిచి కేంద్ర ప్రభుత్వం నుండి అవార్డుతోపాటు రూ.20 వేలు నగదు అందుకున్నట్లు చెప్పారు. అవార్డు పొందిన జయంత్‌ను కళాశాల సిబ్బంది శనివారం అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో తమ కళాశాలకు అరుదైన గౌరవం దక్కడం ఆనందంగా ఉందని కళాశాల సెక్రటరీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, డేటా సైన్స్ విభాగాధిపతి ఎం.వి.పి చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

రోజాపై భానుప్రకాష్ వ్యాఖ్యలు హేయం

- వైసిపి అధ్యక్షులు జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మాజీ మంత్రి ఆర్‌కె రోజాపై టిడిపి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చేసిన వ్యాఖ్యలు అత్యంత హేయమని వైసిపి అధ్యక్షులు జగన్ పేర్కొన్నారు. ప్రభుత్వ తప్పిదాలను ఎత్తి చూపుతూ గట్టిగా మాట్లాడుతున్నందుకు, ప్రశ్నిస్తున్నందుకు ఓర్చుకోలేక రోజాపై అసభ్యకర వ్యాఖ్యలు చేశారని తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో పోస్ట్ చేశారు. విమర్శించే మహిళల గొంతు నొక్కాలనే ఉద్దేశంతోనే ఇలా చేశారని తెలిపారు. ఏడాది కాలంలో అనేక మంది మహిళలను వారు దారుణంగా వేధించారని పేర్కొన్నారు. దీనిపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా పోలీసులు రోజాపైనే సందేహాలు వ్యక్తం చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ ఎంత దారుణంగా మారిందో, టిడిపి వారిని రక్షించేందుకు ఎలా వ్యవహరిస్తున్నారో ఈ ఘటన ఉదాహరణని తెలిపారు. మాజీ మంత్రి విడదల రజని, కృష్ణా జిల్లా జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఉప్పాల హారికతోపాటు వైసిపికి చెందిన పలువురు నాయకుల కుటుంబ సభ్యులను అవమానకరంగా మాట్లాడిన ఘటనలు అనేకం జరుగుతున్నాయని వివరించారు.

ఎంఎస్‌ఎంఇకి ప్రాధాన్యత ఇవ్వండి

ప్రభుత్వానికి ఎపి ఛాంబర్స్ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎంఎస్‌ఎంఇలు చాలా వరకూ ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం వాటికి ప్రాధాన్యత ఇచ్చి ఆదుకోవాలని ఎపి ఛాంబర్స్ కోరింది. ఈ మేరకు ఛాంబర్స్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.భాస్కరరావు, బి.రాజశేఖర్ శనివారం ప్రకటన విడుదల చేశారు. ఎంఎస్‌ఎంఇ రంగాన్ని ఆదుకునేందుకు ఆర్థికాభివృద్ధి టాస్కుఫోర్స్ చేసిన సూచనలను స్వాగతిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ రంగం దేశానికి వెన్నెముకని, అత్యధిక ఉపాధి కల్పించే రంగమని పేర్కొన్నారు. గత ఆరు ఏడు సంవత్సరాలుగా కోవిడ్ మహమ్మారి, ఆర్థిక మందగమనం, ప్రపంచ సంక్షోభం వల్ల అనేక సమస్యలు ఎదుర్కొంటోందని తెలిపారు. టెక్స్‌టైల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఫెర్రో అల్లాయ్, ఫౌండరీలు, గ్రానైట్స్ వంటి ఉప రంగాలకు చెందిన అనేక యూనిట్లు దివాళా అంచున ఉన్నాయని తెలిపారు. దీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహకాలను విడుదల చేయాలని, భవిష్యత్‌లోనూ ప్రోత్సాహకాలను సకాలంలో విడుదల చేసేలా చూడాలని కోరారు. రాష్ట్రంలో ఉపాధి కల్పన జరగాలంటే ఎంఎస్‌ఎంఈ ద్వారానే సాధ్యమని వివరించారు.

'మిట్టల్'కు అదనపు భూసేకరణ చేపట్టొద్దు

- రైతుల ర్యాలీ

ప్రజాశక్తి -నక్కపల్లి (అనకాపల్లి జిల్లా)

భూసేకరణ వ్యతిరేకిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ కాగిత గ్రామంలో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు అదనపు భూసేకరణను వ్యతిరేకిస్తూ అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం కాగిత గ్రామానికి చెందిన రైతులు శనివారం ఆందోళన చేశారు. సర్పంచ్ పోతంశెట్టి రాజేష్ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. భూసేకరణను వ్యతిరేకిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, వైసిపి నేత, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ సంఘీభావం తెలిపి, ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. తహశీల్దార్ నరసింహమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. మిట్టల్, నిప్పన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కోసం 2వ ఫేజ్‌లో అదనంగా భూసేకరణ చేపడితే అడ్డుకుంటామని స్పష్టం చేశారు. గ్రామంలో సర్వే నెంబర్ 162లో 8 ఎకరాల 20 సెంట్ల భూమిని 40 కుటుంబాలు సుమారు 60 సంవత్సరాల నుండి వరి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. సర్వే నెంబర్ 178, 181, 183లలో ఉన్న భూమిలో 80 కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని చెప్పారు. సర్వే నెంబర్ 181లో గల భూమికి కొంతమందికి డి పట్టాలు కూడా మంజూరు చేశారన్నారు. ఈ భూములకు సంబంధించి ఎ1 నోటీసు జారీ చేశారని, వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని, పశువుల మేపుకుంటూ ఉపాధి పొందుతున్నామని, అలాంటి భూములను తీసుకుంటే రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఒక మహిళ తమ భూములు తీసుకోవద్దంటూ తహశీల్దార్ కాళ్లు పట్టుకొని వేడుకున్నారు. సిపిఎం నేత అప్పలరాజు, వైసిపి నేత వీసం రామకృష్ణ మాట్లాడుతూ వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం, మిట్టల్, నిప్పన్ స్టీల్ ప్లాంట్ కోసం ఇప్పటికే 2200 ఎకరాలు భూమిని ప్రభుత్వం కేటాయించిందని, మరలా ఇప్పుడు 2వ ఫేజ్‌లో కాగిత, వేంపాడు, డిఎల్.పురం, నెల్లిపూడి రెవెన్యూ పరిధిలో మరో 3800 ఎకరాల వరకు భూసేకరణ చేపట్టేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారని, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

'లూలూ'కు ఆర్‌టిసి స్థలాన్నిచ్చే ప్రతిపాదన ఉపసంహరించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు

ప్రజాశక్తి - పెదకూరపాడు (పల్నాడు జిల్లా)

లూలూ మాల్‌కు విజయవాడ ఆర్‌టిసి పాత బస్టాండ్ స్థలాన్ని అప్పగించే ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని సిపిఎం కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.400 కోట్లకుపైగా విలువైన విజయవాడ పాత బస్టాండ్, ఇతర ఆర్‌టిసి స్థలాలను బడా, బహుళ జాతి కంపెనీ అయిన లూలూ కంపెనీకి మాల్ నిర్మాణం కోసం కేటాయించడానికి ప్రభుత్వ ప్రతిపాదనలు సిద్ధం చేయడం శోచనీయమన్నారు. ఆర్‌టిసి సంస్థను నాశనం చేసేందుకు విలువైన స్థలాలను బడా కంపెనీలకు టిడిపి కూటమి ప్రభుత్వం కట్టబెట్టడం తగదని తెలిపారు. ఇప్పటికే రెండు ఆర్‌టిసి డిపోలు నడుస్తున్న ఈ స్థలాన్ని లూలూ కంపెనీకి ధారాదత్తం చేయడం అంటే ఆర్‌టిసి సంస్థను, ప్రజా రవాణాను దెబ్బతీయటమేనని పేర్కొన్నారు. ప్రభుత్వరంగ సంస్థల భూములను ప్రైవేటు కంపెనీలకు అప్పగించడం దారుణమన్నారు. రిలయన్స్, మెట్రో, డీమార్ట్, వాల్ మార్ట్, తదితర బడా కంపెనీలు రిటైల్ వర్తక రంగంలోకి ప్రవేశించడంతో చిన్నా, మధ్యతరగతి వ్యాపారులు కోలుకోలేని దెబ్బతిన్నారని తెలిపారు. అనేక చిన్న సంస్థలు మూతపడ్డాయన్నారు. ఇప్పటికే సంక్షోభంలో ఉన్న చిన్న వర్తకులు లూలూ మాల్ ఏర్పాటు ద్వారా మరింత దెబ్బతింటారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేయాలని, విలువైన ఆర్‌టిసి స్థలాన్ని లూలూ కంపెనీకి ధారాదత్తం చేసే ప్రతిపాదనలు ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి పాత బస్టాండ్ స్థలాన్ని రవాణా, ప్రజా ఉపయోగ కార్యక్రమాలకే వినియోగించాలని కోరారు. ఆర్‌టిసి స్థలాన్ని లూలూ కంపెనీకి కట్టబెడితే నగర ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని, వారి సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలోని రైతులకు నీటి విడుదల విధానాన్ని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత రెండు నెలలుగా వర్షాభావం వల్ల పంటలు సాగు కాలేదని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలకు ఉచితంగా విత్తనాలు అందించాలని, పంటలు వేసి నష్టపోయిన రైతులు కూడా పరిహారం ఇవ్వాలని కోరారు.

కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

జనవరిలో అమరావతికి క్వాంటమ్ కంప్యూటర్

- ఆర్థికాభివృద్ధిలో సిఎల పాత్ర కీలకం
- 'స్ఫూర్తి' మెగా కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర విద్య, ఐటి శాఖ మంత్రి లోకేష్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని ప్రాంతంలో జనవరి నాటికి క్వాంటామ్ కంప్యూటర్ ఏర్పాటు అవుతుందని రాష్ట్ర విద్య, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. గుంటూరు బండ్లమూడి గార్డెన్స్‌లో ఐసిఎఐ గుంటూరు చాప్టర్ ఆధ్వర్యాన "స్ఫూర్తి" పేరుతో శనివారం నిర్వహించిన మెగా సిఏ విద్యార్థుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్వాంటమ్‌తో అమరావతి రూపురేఖలు మారనున్నాయన్నారు. సౌత్ ఆసియాలోనే మొట్టమొదటి క్వాంటమ్ కంప్యూటర్ జనవరిలో అమరావతిలో ఆవిష్కృతం కాబోతోందని తెలిపారు. రాష్ట్రాభివృద్ధిలో చార్టెడ్ అకౌంటెంట్ కీలక భూమిక పోషించాలన్నారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఎఐ) భారతదేశ మేధోశక్తికి వెన్నెముక లాంటిదని పేర్కొన్నారు. ఐసిఎఐ స్థాపించి 76 సంవత్సరాలు నిండినా భారతదేశంలో అతిపెద్ద సంస్థగానే కాకుండా.. ప్రపంచంలోనే అతిపెద్ద అకౌంటింగ్ పవర్‌హౌస్‌గా ఉందని తెలిపారు. ఐసిఎఐ ప్రపంచంలోనే అత్యంత విశ్వసనీయ సంస్థగా గుర్తింపు పొందిందన్నారు. ప్రపంచంలో ఫోరెన్సిక్ అకౌంటింగ్ ప్రమాణాలతో పని చేస్తోందని తెలిపారు. ఐసిఎఐ ద్వారా పది లక్షల మందికిపైగా చార్టర్డ్ అకౌంటింగ్ విద్యను అభ్యసిస్తున్నారని, ప్రతి ఏటా రెండు లక్షల మంది పరీక్షలు రాస్తున్నారని గుర్తు చేశారు. పాలనా వ్యవస్థలో బడ్జెట్ ఆమోదం ఉన్న ప్రతి ప్రభుత్వ ఫైల్‌కు ఆడిటర్ల ఆమోద ముద్ర అవసరం. వ్యవస్థపై నమ్మకం కోసం చార్టర్డ్ అకౌంటెంట్‌పై ఆధారపడతాం. సిఎలు కేవలం సంఖ్యా విశ్లేషకులు మాత్రమే కాదు, వారు ఆర్థిక వద్ధి చోదకులు. వారు వ్యాపారాలకు మూలధనాన్ని సేకరించడానికి, ఉద్యోగాలను సష్టించడానికి సహాయం చేస్తారన్నారు. ఆర్థికాభివద్ధిలో సిఎల పాత్ర కీలకమని తెలిపారు.

లిక్కర్ స్కాంలో మాజీ డిప్యూటీ సిఎంకు నోటీసులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

రాష్ట్రంలో సంచలనం రేకెత్తిస్తున్న లిక్కర్ స్కామ్‌లో ఎక్సైజ్ శాఖ, మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామికి సిట్ అధికారులు శనివారం నోటీసులు అందజేశారు. ఈ కేసుకు సంబంధించి సోమవారం విచారణకు హాజరుకావాలని నోటీసులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఏ తప్పు చేయలేదని, ఇలాంటి అక్రమ కేసులో తనను ఇరికించాలనుకోవడం సరైనది కాదని, న్యాయబద్ధంగా విచారణకు హాజరవుతానని చెప్పారు.

'హైడ్రోపవర్' ఒప్పందాన్ని విరమించుకోవాలి

- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి- అనంతగిరి (అల్లూరి జిల్లా)

బురదగెడ్డలో గిరిజనులతో మాట్లాడుతున్న కిల్లో సురేంద్ర

గిరిజనుల మనుగడను దెబ్బతీసే హైడ్రోపవర్ ప్రాజెక్ట్‌కు రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాన్ని తక్షణమే విరమించుకోవాలని, జిఒ 51ను రద్దు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం గుమ్మకోట పంచాయతీ పరిధి గుజ్జెల్లి గ్రామాన్ని సంఘం సభ్యులు శనివారం సందర్శించారు. గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి బురదగెడ్డ గ్రామం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ... ఆదివాసుల హక్కులు, చట్టాలకు తీవ్ర నష్టం కలిగిస్తున్న అనంతగిరి పెదకోట, చిట్టంపాడు, గుజ్జెల్లిలో అదాని ఎనర్జీ, నవయుగ ప్రయివేట్ కంపెనీలతో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి చేపట్టే సర్వే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే గిరిజన సంప్రదాయ ఆయుధాలతో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం జడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు మాట్లాడుతూ... అదాని, అంబాని సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకొని, చీకటి జిఒలను తెచ్చి గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం అనంతగిరి మండల ఉపాధ్యక్షులు జె.వెంకటరమణ, పంచాయతీ నాయకులు ఆర్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాతా సుఖీభవ' లో పేరులేని రైతులు

23వ తేదీలోపు అర్జీలు సమర్పించాలి

- వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అర్హులై ఉండి అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారుల జాబితాలో పేరు లేని రైతులు ఈ నెల 23లోపు సంబంధిత రైతు సేవా కేంద్రంలో అర్జీలు సమర్పించాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. అర్హులైన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఆర్థిక సాయం అందాలన్నది ముఖ్యమంత్రి ఆకాంక్ష అని శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ నంబరు 95523 00009కు మెసేజ్ చేసి ఆధార్ నంబరు నమోదు చేయడంతో అర్హత వివరాలు తెలుసుకోవచ్చున్నారు. లబ్ధిదారుల జాబితాలో రైతులు వారి పేరును తనిఖీ చేసుకోవడాన్ని సులభతరం చేసేందుకు వ్యవ సాయ శాఖ టోల్ ఫ్రీ నెంబరు, వెబ్‌సైట్ అడ్రస్‌లను అందుబాటులో ఉంచామన్నారు. అన్నదాతా సుఖీభవ పోర్టల్ annadathasukhibhava.ap.gov.in లో 'స్టేటస్ చెక్' పై క్లిక్ చేసి, ఆధార్ నంబరును నమోదు చేయడంతో వివరాలు తెలుసుకోవచ్చని అన్నారు. టోల్ ఫ్రీ నంబరు 155251 నంబరుకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటలలోపు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చున్నారు. రైతుల ఫిర్యాదుల స్వీకరణకు వీలుగా అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో గ్రీవెన్స్ మాడ్యూల్ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో ఫిర్యాదు చేయాలని భావిస్తే సంబంధిత రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ సహాయకుల లాగిన్‌లో ఫిర్యాదుల స్వీకరణకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐఎఎస్‌ల శిక్షణకు అనుమతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని పలువురు ఐఎఎస్ అధికారులు శిక్షణా తరగతులకు హాజరయ్యేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు సాధారణ పరిపాలనా శాఖ (పొలిటికల్) ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మిడ్ కెరీర్ ట్రైనింగ్‌లో భాగంగా ముస్సోరీలోని ఎల్‌బిఎస్‌ఎన్‌ఎఎలో రాష్ట్రంలోని ఎనిమిది మంది ఐఎఎస్‌లకు ఈ నెల 23 నుంచి వచ్చే నెల 16 వరకూ శిక్షణ ఇస్తారు. శిక్షణా తరగతులకు హాజరయ్యే ఐఎఎస్‌లలో నారాయణ భరత్ గుప్తా, ఎ.మల్లికార్జున, వి.ప్రసన్న వెంకటేష్, ఎం.వేణుగోపాల్ రెడ్డి, మనజీర్ జిలానీ, కెవిఎన్ చక్రధరబాబు, పిఎస్ గిరీష్, డికె బాలాజీ ఉన్నారు.

నిరాశపర్చిన హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్

- పెరిగిన మొండి బాకీలు
- క్యూ1 లాభాల్లో తగ్గుదల

న్యూఢిల్లీ : దిగ్గజ ప్రయివేటు రంగ విత్త సంస్థ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఆర్థిక ఫలితాలు నిరాశపర్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 1.31 శాతం తగ్గుదలతో రూ.16,258 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.16,475 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇదే సమయంలో బ్యాంక్ మొత్తం ఆదాయం 83,701 కోట్లుగా నమోదు కాగా.. గడిచిన క్యూ1లో ఏకంగా రూ.99,200 కోట్ల ఆదాయాన్ని సాధించింది. క్రితం క్యూ1లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ మొత్తం వ్యయం రూ.63,467 కోట్లకు చేరింది. 2024-25 ఇదే క్యూ1లో రూ.59,817 కోట్ల వ్యయాలు చోటు చేసుకున్నాయి.

గడిచిన త్రైమాసికంలో మొండి బాకీల కోసం రూ.14,442 కోట్లు కేటాయించింది. గతేడాది ఇదే త్రైమాసికంలోని రూ.2,602 కోట్ల కేటాయింపులతో పోల్చితే భారీగా పెంచాల్సింది. 2024 జూన్ ముగింపు నాటికి 0.47 శాతంగా ఉన్న స్థూల నిరర్థక ఆస్తులు.. 2025 జూన్ 30 నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 1.4 శాతానికి పెరిగాయి. స్థూల అడ్వాన్సులు 6.7 శాతం పెరిగి రూ.26.53 లక్షల కోట్లకు, డిపాజిట్లు 16.2 శాతం వృద్ధితో రూ.27.64 లక్షల కోట్లకు చేరాయి.

ఐసిఐసిఐ బ్యాంక్ లాభాల్లో 16 శాతం వృద్ధి

దేశంలోనే రెండో అతిపెద్ద ప్రయివేటు రంగ విత్త సంస్థ ఐసిఐసిఐ బ్యాంక్ నికర లాభాలు పెరిగాయి. 2025-26 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 15.5 శాతం వృద్ధితో రూ.12,768 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.11,059 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.19,553 కోట్లుగా ఉన్న నికర వడ్డీ ఆదాయం.. గడిచిన క్యూ1లో 10.6 శాతం పెరిగి రూ.21,635 కోట్లకు చేరింది. ఏడాదికేడాదితో పోల్చితే బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 2.15 శాతం నుంచి 1.67 శాతానికి తగ్గాయి.

యెస్ బ్యాంక్‌కు ఎన్‌ఐఐ మద్దతు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 జూన్‌తో ముగిసిన ప్రథమ త్రైమాసికం (క్యూ1)లో యెస్ బ్యాంక్ నికర లాభాలు 59 శాతం పెరిగి రూ.801 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.502 కోట్ల లాభాలు నమోదు చేసింది. కాగా.. గడిచిన క్యూ1లో ఈ బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్‌ఐఐ) 5.7 శాతం పెరిగి రూ.2,371.5 కోట్లకు చేరింది. బ్యాంక్ స్థూల ఎన్‌పిఎలు 1.6 శాతం, నికర ఎన్‌పిఎలు 0.3 శాతంగా నమోదయ్యాయి.

మాజీ మంత్రి రజనికి నోటీసులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత నెల 18న పల్నాడు జిల్లా పర్యటనను పురస్కరించుకొని పోలీసుల ఆంక్షలు ఉల్లఘించారన్న ఆరోపణలపై విచారణకు రావాలని మాజీ మంత్రి విడదల రజనికి సత్తెనపల్లి పోలీసులు శనివారం నోటీసులు జారీ చేశారు. జగన్ పర్యటన సందర్భంగా నిబంధనలు ఉల్లఘించి జన సమీకరణ చేశారని రజనీతోపాటు పలువురు జిల్లా నాయకులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలతో సహా మొత్తం 118 మందిపై కేసులు నమోదు చేసిన పోలీసులు ఇప్పటికే పలువురిని విచారించారు. తాజాగా ఆమెకు నోటీసులు. జారీ చేశారు. ఈ నెల 20న విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఇప్పటికే వైసిపి నాయకులు అంబటి రాంబాబు, లేళ్ల అప్పిరెడ్డి, పేర్ని నాని, గోపిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తదితరులు విచారణకు హాజరైన విషయం తెలిసిందే.

రిలయన్స్ పవర్‌కు రూ.44.68 కోట్ల లాభాలు

న్యూఢిల్లీ : అనీల్ అంబానీకి చెందిన రిలయన్స్ పవర్ 2025-26 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో రూ.44.68 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.98.16 కోట్ల నష్టాలు చవి చూసింది. గడిచిన క్యూ1లో కంపెనీ రెవెన్యూ 5.35 శాతం తగ్గి రూ.1,885 కోట్లుగా నమోదయ్యింది. 2025 జూన్ 30 నాటికి రూ.16,431 కోట్ల నికర విలువను కలిగి ఉన్నట్లు రిలయన్స్ పవర్ వెల్లడించింది.

నిఫ్టీ 26,889కి చేరొచ్చు : పిఎల్ క్యాపిటల్

ముంబయి : ప్రస్తుత ఏడాది డిసెంబర్ ముగింపు నాటికి నిఫ్టీ 26,889 పాయింట్లకు చేరొచ్చని బ్రోకరేజీ సంస్థ పిఎల్ క్యాపిటల్ అంచనా వేసింది. "నిఫ్టీ 12 నెలల లక్ష్యాన్ని 26,889కి పెంచాము. ఇది 15 ఏళ్ల సగటు పిఇ 18.5 రెట్లతో పోల్చితే 2.5 శాతం తగ్గుదల. ఆర్‌బిఐ ఇటీవల తగ్గించిన రెపోరేటు, నగదు నిల్వల నిష్పత్తి రుణాల వృద్ధికి మద్దతును అందించనున్నాయి." అని పిఎల్ క్యాపిటల్ డైరెక్టర్ రీసెర్చ్ మనీష్ అగర్వాల్ పేర్కొన్నారు.

మానవ అక్రమ రవాణాపై న్యాయ ప్రక్రియ వేగవంతం

- ప్రాసిక్యూషన్ విభాగం డైరెక్టర్ బైరా రామకోటేశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మానవ అక్రమ రవాణా కేసుల్లో సాక్ష్యాల్లోని లోపాలను తొలగించి న్యాయ ప్రక్రియ వేగవంతం చేయాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ప్రాసిక్యూషన్ విభాగం డైరెక్టర్ భైరా రామకోటేశ్వరరావు సూచించారు. దోషులకు శిక్షలు పడేట్లు చూడటం తోపాటు బాధితులకు న్యాయబద్ధంగా పునరావాసం కల్పించడంలో ప్రాసిక్యూటర్ల పాత్ర కీలకమని అన్నారు. ఎపి ప్రాసిక్యూషన్ విభాగం, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ సంయుక్తంగా నిర్వహించిన మనుషుల అక్రమ రవాణా, సంబంధిత కార్మిక వ్యవస్థ నిరోధక చట్టం 1976పై శనివారం విజయవాడలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితుల న్యాయమైన హక్కులకు కవచంలా నిలిచే బలమైన వ్యవస్థగా ప్రాసిక్యూషన్ ఏర్పడాలని అన్నారు. కేసుల విజయం కంటే బాధితుల పట్ల గౌరవంతో వ్యవహరిస్తూ, న్యాయం అందించడమే నిజమైన విజయమని అన్నారు. ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ స్టేట్ ప్రోగ్రామ్ డైరెక్టర్ క్లెమెంట్ డేవిడ్ మాట్లాడుతూ బాధితుని పక్షాన గళమెత్తే ప్రాసిక్యూటర్లే సమాజ మార్పునకు మార్గదర్శకులని అన్నారు. ఈ శిక్షణలతో మానవతా దృక్పథం బలపడాలని చెప్పారు. జీవన జ్వాలా అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.తేనేమొళి మాట్లాడుతూ బంధిత కార్మికురాలిగా తాను ఎదుర్కొన్న బాధలను వివరించి న్యాయం ఆలస్యం కాకుండా బాధితులకు గౌరవంతో న్యాయం చేయాల్సిన బాధ్యత పబ్లిక్ ప్రాసిక్యూటర్లదేనని ఆమె స్పష్టం చేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి డిప్యూటీ డైరెక్టర్స్ ఎంకె విజయలక్ష్మి, బర్కత్ ఆలీఖాన్, నక్క శారదమణి పాల్గొన్నారు.

మత్తు టాబ్లెట్లు స్వాధీనం

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖపట్నం జగదాంబ జంక్షన్‌లో ఉన్న శ్రీ అయ్యప్ప మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్‌పై శనివారం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యాన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఆకస్మికంగా దాడులు నిర్వహించారు.

మెడికల్ షాపులో పలు రకాల మత్తు టాబ్లెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిపి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ దాడులు చేశారు. ఆల్‌ప్రాజోలమ్ 420 టాబ్లెట్లు, ఆల్ ప్రో లాబ్ టాబ్లెట్లు 50 స్వాధీనం చేసుకున్నట్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఇవి మత్తు టాబ్లెట్లని, మెడికల్ షాపుపై కేసు నమోదు చేశామని ఆయన చెప్పారు. ఈ దాడుల్లో సిటీ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కె.రమణాజీ, ఎం.భాగ్యలక్ష్మి, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ లాభాల్లో 12 శాతం వృద్ధి

హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 12 శాతం వృద్ధితో రూ.4,116 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో 3,679 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.30,874 కోట్లుగా ఉన్న ఆదాయం.. గడిచిన క్యూ1లో రూ.31,791 కోట్లకు పెరిగింది. వడ్డీ ఆదాయం 27,296 కోట్లకు చేరింది. 2024-25 క్యూ1లో వడ్డీ ఆదాయం రూ.26,364 కోట్లుగా చోటు చేసుకుంది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు క్రమంగా మెరుగుపడుతూ.. గడిచిన త్రైమాసికంలో 3.52 శాతానికి తగ్గాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో 4.54 శాతం స్థూల ఎన్‌పిఎలు నమోదయ్యాయి. నికర నిరర్థక ఆస్తులు 0.90 శాతం నుంచి 0.62 శాతానికి తగ్గాయి. మొండి బాకీల కోసం కేటాయింపులు 1,1,53 కోట్లకు తగ్గాయి. 2024-25 ఇదే జూన్ త్రైమాసికంలో మొండి బాకీల కోసం రూ.1,651 కోట్ల కేటాయింపులు చేసింది.

సెంట్రల్ బ్యాంక్ లాభాల్లో 33 శాతం పెరుగుదల

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో సెంట్రల్ బ్యాంక్ నికర లాభాలు 33 శాతం పెరిగి రూ.1,169 కోట్లకు చేరాయి. ముఖ్యంగా కీలక ఆదాయం పెరగడంతో పాటుగా, మొండి బాకీలు తగ్గడంతో మెరుగైన ఫలితాలను ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.880 కోట్ల లాభాలను నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.9,500 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. గడిచిన క్యూ1లో రూ.10,374 కోట్లకు చేరింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 4.54 శాతం నుంచి 3.13 శాతానికి పరిమితమయ్యాయి. నికర నిరర్థక ఆస్తులు కూడా 0.73 శాతం నుంచి 0.40 శాతానికి దిగివచ్చాయి.



సంపాదకీయం

మామిడి చిగురు తిని మత్తెక్కి కూసే కోకిల గానం గమ్మత్తుగా వుంటుంది. 'మామిడి చెట్టు పెరట్లో వుంటే ఆ ఇంటి పెద్దకొడుకు వున్నట్లే..' అని పెద్దలు చెబుతారు. మామిడి చెట్టును చూస్తే జీవితం కనబడుతుంది. 'లేత వగరు పిందె... యవ్వనం/ పులుపు.. మధ్య వయస్సులోని బింకం/ పండ్ల రసం.. వయస్సుతో వచ్చే అనుభవాల మాధుర్య సారం/ దీనిని పొగడ నా తరమా..' అంటాడో కవి. అన్ని వయసుల వారిని అలరించి, పలకరించి కడుపు నింపే అమృత వృక్షం మామిడి. అందుకే అంటాడు ప్రముఖ హిందీ కవి గుల్జార్.. 'మామిడి పండు అంటే ఒక తీయని అనుభవం మాత్రమే కాదు, చిన్ననాటి అనుభూతి, మధుర జ్ఞాపకాలు కూడా' అని. మామిడిలో తీపి, పులుపు, అరుదైన సుగంధం వంటి భావ ప్రతీకలతో పాటు, శరీరాన్ని శీతలపరిచే ఔషధం, మనసును తీపిగా మార్చే అనుభవం వుందని ఆయుర్వేదం చెబుతుంది. మామిడిని ఉష్ణమండల వాతావరణాలలో పండిస్తారు. ప్రపంచంలోని మామిడి సరఫరాలో దాదాపు సగం భారతదేశం నుంచే ఎగుమతి అవుతుంది. 5వేల సంవత్సరాల క్రితం నుంచే దేశంలో మామిడి సాగు చేస్తున్నారని చరిత్ర చెబుతోంది. వాణిజ్య రకాలు సహా మొత్తం 1500 రకాల మామిడిని పండిస్తారు. ఇవి మన సంస్కృతిలో భాగం అయిపోయాయి. మామిడి రుచి, దాని మాధుర్యాన్ని, ఆరోగ్య ప్రయోజనాలను తలచుకుంటూ.. ప్రతి ఏడాది జులై 22న జాతీయ మామిడి దినోత్సవం జరుపుకుంటారు.

రైతు కల !

'పాటలే తప్ప జీవితాలే వినిపించవు ఈ దేశంలో' అంటాడు మహాకవి శ్రీశ్రీ. రైతు పాట వినిపించదు. అతని విలాపం తప్ప. రైతు బతకడం సమాజానికి అవసరం. కానీ, మరణించాకే రైతుకు గుర్తింపు. ఇది మామిడి రైతుల విషాదగాథ కూడా. 'మామిడి ఫలంలో తియ్యటి కవిత్వం దాగి వుంది' అంటారో కవి. కానీ, మామిడిలోని మాధుర్యం రైతుల జీవితంలో కనబడదు. రాష్ట్రంలో మొత్తం 12 లక్షల ఎకరాల్లో మామిడి సాగవుతుండగా, ఒక్క చిత్తూరు జిల్లాలోనే లక్ష ఎకరాల వరకూ రైతులు తోతాపురి రకం సాగు చేస్తున్నారు. నూజివీడు మామిడికి ప్రత్యేక గుర్తింపు వుంది. గత నాలుగేళ్లుగా నష్టాల్లో వున్న రైతులకు ఈ ఏడాది మామిడి దిగుబడి ఆశాజనకంగా మారింది. ఉత్పత్తి పెరగడంతో కిలో రూ.2, రూ.3 ధరకే పరిమితం చేసి మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులు సిండికేట్‌గా ఏర్పడి రైతులను దోపిడీ చేస్తున్నారు. నోరూరించే పచ్చళ్ల దగ్గర నుంచి జ్యూస్‌లు, జామ్‌ల వరకు కార్పొరేట్ కంపెనీలు పెద్దఎత్తున వ్యాపారం చేస్తున్నాయి. రైతుల పట్ల కనికరం లేకుండా ప్రభుత్వం పరిశ్రమలకు ఊడిగం చేస్తోంది. రైతులకు కిలో రూ.12 చొప్పున ధర ఇవ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలు అమలు కావడం లేదు. సిండికేట్‌గా మారిన వ్యాపారులు రూ.4కు మించి కొనకుండా రైతులను నిలువునా ముంచుతున్నారు. పరిశ్రమల గుత్తాధిపత్యం నుండి రైతులను ఆదుకోవడానికి మార్కెటింగ్ ఏజెన్సీల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, కేంద్రం ఇచ్చే సబ్సిడీ మొత్తాన్ని నేరుగా రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

తోతాపురి రకం మామిడి కిలో రూ.2లకే అడుగుతుండటంతో కాయలను తోటల్లోనే వదిలేస్తున్నారు. ఆశ చావని మరికొందరు రైతులు పల్ప్ పరిశ్రమలకు, మండీలకు తరలిస్తున్నారు. అక్కడ కూడా అదే ధర చెబుతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పంటను రోడ్డు పాలుచేసి, చమర్చిన కళ్లతో ఇల్లు చేరుతున్నారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అయినా దక్కేలా చర్యలు తీసుకోకపోతే... మామిడి రైతుల ఆత్మహత్యలను కూడా రాష్ట్రం చూడాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. సాంకేతికతతో వ్యవసాయాన్ని కొత్త పుంతలు తొక్కిస్తామని చెబుతోన్న రాష్ట్ర ప్రభుత్వం.. సంప్రదాయకంగా వస్తోన్న పంటలను పక్కనపెట్టి, లాభసాటిగా వుండే తోటలను పెంచమని సలహా ఇస్తోంది. ఒక్క మామిడికే కాదు.. పామాయిల్, కోకో, పొగాకు, పసుపు, మిర్చి వంటి పంటలకూ ధరలేక రైతులు రోడ్డెక్కుతున్నారు. ప్రభుత్వం రైతుల సమస్యపై స్పందించాలి. రైతులను ఆదుకోవాలి. మనం తినే ప్రతి మామిడికాయ వెనుక ఒక రైతు కల వుంటుంది.. ఒక ఆశ వుంటుంది. ఆ కలను చెరపకుండా, ఆశను చంపకుండా చూడటమే.. నిజమైన బాధ్యత. అదే.. మామిడి జాతీయ దినోత్సవానికి నిజమైన అర్థం.

మహనీయుల మాట

శ్రామిక మహిళా విముక్తి పోరాటం
అనేది బూర్జువా మహిళలు...
తమ పురుషులకు వ్యతిరేకంగా
చేసే పోరాటం లాంటిది కాదు.
దానికి మారుగా ఆమె తన వర్గానికి
చెందిన పురుషులతో కలిసి...
మొత్తం పెట్టుబడిదారీ వర్గానికి
వ్యతిరేకంగా ఉమ్మడి
పోరాటం చేయాలి.

- క్లారా జెట్కిన్,
జర్మన్ మార్క్సిస్ట్ సిద్ధాంతకర్త.

Clara Zetkin

రిటైర్మెంట్ కథనాల వెనక రాజకీయ పాచిక?

ప్రస్తుతం

తెలకపల్లి రవి

అన్నివేళలా అందరి చూపు తమ మీద ఉండేట్టు చూసుకోవటం, అదే సమయంలో తమ అసలైన వ్యూహాలను మరుగుపరిచి అప్రధానమైన చర్చలు ముందుకు తోయటం సంఘపరివార్‌కు వెన్నతో పెట్టిన విద్య. అవసరమైన ప్రచారం చేసుకోవటంతో పాటు వ్యతిరేక ప్రచారం లేకుండా చూసుకోవడానికిది పనికి వస్తుంది. సెప్టెంబరు 17తో నరేంద్ర మోడీకి 75 ఏళ్లు నిండుతాయి గనుక ప్రధాని బాధ్యతల నుంచి తప్పిస్తారనే ఒక కథనం ముందుకు రావడానికి అదే కారణం. మీడియా కట్టుకథలని ఆరోపించడానికి వీలు లేకుండా స్వయంగా ఆర్.ఎస్.ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్ ఈ చర్చ తీసుకొచ్చారు. దీనిపైన కావాలని మాట్లాడే వారు కొందరైతే, నిజంగానే ఏదో జరగబోతుంది అని స్పందించేవారు మరికొందరు. వాస్తవానికి ఈ చర్చ కొత్తదేమీ కాదు. ఇంకా చెప్పాలంటే మోడీకి సంబంధించింది మాత్రమే కూడా కాదు. ఆయన కన్నా వారం రోజుల ముందే సెప్టెంబర్ 11వ తేదీకే మోహన్ భగవత్‌కు 75 వస్తాయి. నరేంద్ర మోడీని దించి వేయడం జరుగుతుందనుకుంటే అప్పుడు ముందు ఆయన దిగిపోవాల్సి ఉంటుంది. మరి ఆ ఊసే ఎక్కడా వినిపించడం లేదు. 2004 ఎన్నికల ముందు అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు ఆర్.ఎస్.ఎస్ అధినేతగా ఉన్న కె.ఎస్.సుదర్శన్, ఎల్.కె అద్వానీ, మురళీ మనోహర్ జోషి లాంటి వాళ్ళందరూ ఆయన దిగిపోవాలని చెబుతుండేవారు. చివరకు వాజ్‌పేయి భరించలేక "నేను బాగా పని చేసే స్థితిలోనే ఉన్నాను. పదవీ విరమణ ప్రసక్తి లేదని" కుండ బద్దలు కొట్టారు. 2004లో ఓటమి తర్వాత అద్వానీ పాకిస్తాన్‌లో జిన్నాకు కితాబునిచ్చాడని పక్కన పెట్టడం, మళ్లీ తప్పనిసరై 2009లో ప్రధాని అభ్యర్థిగా ప్రకటించడం చూశాం. మరో ఐదేళ్ల తర్వాత 2013-2014లో అభ్యర్థిగా ప్రకటించటం ఎంత ఆర్భాటంగా జరిగిందో దేశమంతా చూసింది. రామ రథయాత్ర ద్వారా బిజెపి బలం అమాంతంగా పెరగడానికి, మొదటిసారి కేంద్రంలో అధికారంలోకి రావడానికి బీజం వేసిన అద్వానీని ఒక ఓటమితో పక్కన పెట్టడం ఆర్.ఎస్.ఎస్ కు తెలియకుండా మోడీ ఒక్కరే చేసే విషయం కాదు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న మోడీకి అంబానీల నుంచి అమెరికాలో మాడిసన్ స్క్వేర్ వరకు బ్రహ్మరథం పట్టడం వెనుక చాలా శక్తులు పనిచేశాయి. మత రాజకీయ సంస్థలు, కార్పొరేట్ సామ్రాజ్యాలదే అందులో కీలక పాత్ర. వారి అంచనాలకు, వ్యూహాలకు తగినట్టే మోడీ పదేళ్ల పాలనలో అత్యధిక వరాలు కట్టబెట్టారు. హిందుత్వ శక్తుల ప్రాబల్యాన్ని కొత్త ఎత్తులకు తీసుకుపోయారు. బడా మీడియా వత్తాసుతో ఎప్పటికప్పుడు సరికొత్త చిట్కాలు, మాయోపాయాలు ప్రయోగిస్తూ ప్రాంతీయ పార్టీలను గుప్పిట్లో పెట్టుకుని కపట రాజకీయాలు సాగించగలిగారు. ఇలాంటి నమ్మకమైన నాయకుడ్ని ఆర్.ఎస్.ఎస్ కానీ కార్పొరేట్ వర్గాలు కానీ అంత తేలిగ్గా వదులుకుంటాయా?



ఎన్ని ఎత్తులు వేసినా దేశ ప్రజలు మోడీకి మూడోసారి మెజారిటీ ఇవ్వడానికి తిరస్కరించారు. కానీ బీహార్‌లో నితీశ్ కుమార్, ఎ.పి లో చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ వంటి వారి వత్తాసుతో ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగారు. మళ్లీ పుంజుకోవడానికి విద్వేష రాజకీయాలను రగిలించే ప్రయత్నాలు పెంచారు. రెండు మాసాల కిందట పహల్గాం ఉగ్రవాద ఘాతుకం తర్వాత సాగిన పరిణామాలు, ఆపరేషన్ సిందూర్ అస్తవ్యస్త పర్యవసానాలు బి.జె.పి-ఎన్.డి.ఎ ప్రభుత్వాన్ని పూర్తిగా ఇరకాటంలో పెట్టాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విపరీత పోకడలకు తల వంచటం, ఇజ్రాయిల్ మారణకాండపై మౌన ముద్ర దాల్చడం భారతదేశ ప్రతిష్టను భంగపరిచాయి. ఇలాంటి పరిస్థితుల్లో మరోకసారి అధికారంలోకి రావడం అటుంచి ఉన్నదాన్ని కాపాడుకోవడం, ఎన్నికలు జరిగే కీలక రాష్ట్రాల్లో గెలవడం కూడా పెనుసవాలుగా మారాయి. ఈ సంకట పరిస్థితి నుంచి కాపాడుకోవడానికి విసిరిన ఓ అస్త్రమే 75 ఏళ్ల రిటైర్మెంట్ ప్రహసనమా?

ఎందుకీ నాటకం?

కొందరిని అంత కాలం, అందర్నీ కొంత కాలం మాయ చేయవచ్చు గాని అందర్నీ ఎల్లకాలం ఎవరూ మోసగించలేరనేది సామెత. ఈ పదకొండేళ్ల పాలనలోనూ మోడీ 'మన్ కీ బాత్' ఏంటో సామాన్యులకు కూడా స్పష్టంగా తెలిసిపోయింది. జాతీయ సమైక్యత, మత సామరస్యం, దేశ సార్వభౌమత్వం కాపాడుకోవాలన్న మెలకువ పెరిగింది. లౌకిక ప్రతిపక్షాలు కూడా కొంతవరకు కళ్ళు తెరవగలిగాయి. 2024 మే ఎన్నికల నాటికి ఆయన ప్రభావం మసకబారిన విషయం స్పష్టమవడంతో విపరీతంగా డబ్బు కుమ్మరించి, అహోరాత్రులు ప్రచారం సాగించి పట్టు నిలబెట్టుకోవాలని పాకులాడారు. బిజెపి అధ్యక్షుడిగా ఉన్న జె.పి.నడ్డా ఆ ఊపులోనే తమ పార్టీ ఇక ఎంత మాత్రం ఆర్.ఎస్.ఎస్ అదుపులో లేదని, స్వతంత్రంగా గెలవగలమనీ ఘనంగా చెప్పారు. అయినా దానిపై మోహన్ భగవత్ లాంటివారు పెద్దగా స్పందించింది లేదు. వెనక్కు తిరిగి చూస్తే ఇదంతా ఒక వ్యూహం అని స్పష్టం అవుతుంది. నిజంగా బిజెపి స్వతంత్రమైంది అని అనుకున్న వారు ఓటేస్తే మూడోసారి అధికారం దక్కుతుంది అనే పాచిక మాత్రమే అది. ఎన్నికల ప్రక్రియ పైనా ఎన్నో అనుమానాలు తలెత్తాయి. ఇలాంటి ఎన్ని ఎత్తులు వేసినా దేశ ప్రజలు మోడీకి మూడోసారి మెజారిటీ ఇవ్వడానికి తిరస్కరించారు. కానీ బీహార్‌లో నితీశ్ కుమార్, ఏపీలో చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ వంటి వారి వత్తాసుతో ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగారు. మళ్లీ పుంజుకోవడానికి విద్వేష రాజకీయాలను రగిలించే ప్రయత్నాలు పెంచారు. రెండు మాసాల కిందట పహల్గాం ఉగ్రవాద ఘాతుకం తర్వాత సాగిన పరిణామాలు, ఆపరేషన్ సిందూర్ అస్తవ్యస్త పర్యవసానాలు బి.జె.పి-ఎన్.డి.ఎ ప్రభుత్వాన్ని పూర్తిగా ఇరకాటంలో పెట్టాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విపరీత పోకడలకు తల వంచటం, ఇజ్రాయిల్ మారణకాండపై మౌన ముద్ర దాల్చడం భారతదేశ ప్రతిష్టను భంగపరిచాయి. ఇలాంటి పరిస్థితుల్లో మరొకసారి అధికారంలోకి రావడం అటుంచి ఉన్నదాన్ని కాపాడుకోవడం, ఎన్నికలు జరిగే కీలక రాష్ట్రాల్లో గెలవడం కూడా పెనుసవాలుగా మారాయి. ఈ సంకట పరిస్థితి నుంచి కాపాడుకోవడానికి విసిరిన ఓ అస్త్రమే 75 ఏళ్ల రిటైర్మెంట్ ప్రహసనమా?

ముందే మొదలైంది...

2024 మే ఎన్నికలకు ముందే మహారాష్ట్రలో ఇది మొదలైంది. 2025 సెప్టెంబర్ 16 నరేంద్ర మోడీ అధికారంలో కొనసాగే చివరి రోజు అని ఒక పోస్ట్ వైరల్‌గా నడిచింది. ఆ మాట చెప్పినవారు శివసేన ఎంపీ సంజయ్ రౌత్. 75 ఏళ్ల వయసు దాటితే సీనియర్లు కీలక పదవుల్లో నుంచి తప్పుకొని మార్గదర్శక మండల్‌లో ఉండి సలహాలు ఇవ్వాలనీ ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షాలు అప్పట్లో ప్రతిపాదించారు. మరి ఆయనకూ అదే వయసు వస్తుంది. మూడు మాసాల కిందట నరేంద్ర మోడీ మొదటి సారిగా ప్రధాని హోదాలో నాగపూర్ లోని ఆర్.ఎస్.ఎస్ కేంద్ర కార్యాలయాన్ని సందర్శించటం ఈ గండం నుంచి తప్పించుకోవడానికని కూడా శివసేన సంజయ్ రౌత్ వంటి వారు ఆరోపించారు. అంటే నిజంగానే వారి ఉభయుల మధ్య ఏదో వివాదం నడుస్తుంది అన్న భ్రమ కొనసాగించడానికి వేసిన ఎత్తుగడ అన్న మాట. కానీ మరోవైపున మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ మాత్రం మోడీ 2029 తర్వాత కూడా తమకు నాయకత్వం అందిస్తారని గొప్పగా ప్రకటించారు. తండ్రి బతికుండగానే ఆయన వారసత్వం గురించి చర్చించడం సంస్కారం కాదని కూడా ముఖ్యమంత్రి చెప్పడం గమనించదగ్గది. ఆపరేషన్ సిందూర్ లాంటి పరిణామాలు ఆ తర్వాత జరిగినవే కనుక మళ్లీ సరికొత్త నష్ట నివారణ చర్యలు అవసరమని సంఘ పరివార్ భావించింది. మోహన్ భగవత్ పరోక్ష వ్యాఖ్యలు తత్ఫలితమే.

కథలూ ఖండనలూ

ఇప్పుడు మనం తాజా చర్చకు వద్దాం. ఆర్.ఎస్.ఎస్ వ్యవస్థాపకుడైన హెగ్డేవార్ సమకాలికుడు మూరోపంత్ పింగ్లే సంస్మరణ సభలో మోహన్ భగవత్ మాట్లాడుతూ ఆయన 75 ఏళ్ల తర్వాత పదవులలో ఉండరాదనే సూత్రానికి గట్టిగా కట్టుబడ్డారని చెప్పారు. 75 ఏళ్ల వ్యక్తికి ఒక శాలువా ఇచ్చి సత్కరిస్తే ఇక మీరు గౌరవంగా తప్పుకోమని అర్థం చేసుకోవాలని చమత్కరించారు. మోహన్ భగవత్ మాటలను ప్రధానమంత్రికి అన్వయించినదిగా చాలా మీడియా సంస్థలు వ్యాఖ్యానించాయి నిజంగా అదే చిత్తశుద్ధితో చెప్పాలనుకుంటే మోడీ కన్నా వారం ముందే ఆయన దిగిపోవాలి. మరి తన గురించి ఎందుకు చెప్పుకోలేదు? మీడియాలో వ్యాఖ్యల తర్వాత మళ్లీ అదే దేవేంద్ర ఫడ్నవిస్ మోడీనే ప్రధాని పదవిలో కొనసాగుతారని చెబుతున్నారు. మోడీ స్వయంగా ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తూ ఆపరేషన్ సిందూర్‌కు బీహార్ స్ఫూర్తినిచ్చిందని చెప్పడం చూస్తే అంతా రాజకీయమేనని అర్థమైపోతుంది. దేశ భద్రతకు సంబంధించిన అంశం కూడా తన ఎన్నికల ప్రచారంతో ముడి పెట్టడం బిజెపికే చెల్లింది. దేశంలో మోడీ అధికారంలోకి వచ్చినా 2015, 2020 రెండు సార్లు బీహార్ ప్రజలు జె.డి.యు-ఆర్.జె.డి కూటమినే గెలిపించారు. రెండుసార్లు కూడా నితీష్ కుమార్ రాజకీయంగా రంగు మార్చి బిజెపికి అవకాశం ఇచ్చారు. కేవలం మోడీ ఎత్తులు, పైఎత్తులే విజయం గ్యారెంటీ చేయవని చెప్పడానికి బీహార్ కన్నా నిదర్శనం మరొకటి ఉండదు. అలాంటి బీహార్‌లో మూడోసారి ఎన్నికల పోరాటం ముందు ఒక కృత్రిమ వాతావరణం కోసమే ఈ 75 ఏళ్ల పంచాయతీనా?

అధ్యక్ష ఎన్నిక కోసమా?

కాంగ్రెస్‌లో వలె తాము బయటికి పోట్లాడుకోమని బిజెపి వారు చెప్పుకునే గొప్ప. కాని సంఘ పరివార్‌లో విభేదాలు లేవని కాదు. ముందు చెప్పుకున్న అద్వానీ-వాజ్‌పేయి నుంచి ఇప్పటి యు.పి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, కేంద్రంలోని శివరాజ్ సింగ్ చౌహాన్, అమిత్ షా, నితిన్ గడ్కరీ...ఇలా చాలా మంది పోటీదారులే వున్నారు. గత రెండు సంవత్సరాలుగా బిజెపి కి పూర్తి స్థాయి అధ్యక్ష ఎన్నిక జరిగింది లేదంటే అదే కారణం. ఏవో ఎన్నికలు, రాజకీయ కారణాలను చూపించి జె.పి నడ్డానే పొడిగిస్తున్నారు. ప్రధానిగా మోడీ ప్రభ మసకబారిపోయినా పదవీ కాలం ముగిసే దాకా కదిలించలేరు కనుక కనీసం అధ్యక్ష పదవిలోనైనా తమ వారిని కూర్చోబెట్టాలని వివిధ వర్గాలు మల్లగుల్లాలు పడుతున్నాయి. అధ్యక్ష పదవి కోసం పేర్లు వదలడం, ఆ తర్వాత మహిళలే ఉంటారు అన్న ఊహాగానాలు మొత్తం ఇందులో భాగమే. ఎవరూ ఊహించని వ్యక్తి నాయకత్వం చేపడతారని కూడా కొన్ని వర్గాలు చెబుతున్నాయి. అంటే, ప్రధాని రిటైర్మెంట్ చర్చ నడిపించి కనీసం కోరుకున్న అధ్యక్షుడినైనా నియమించుకోవడానికి సంఘ్ పెద్దలు తంటాలు పడుతున్నారన్నమాట. మోడీ జనాకర్షణ పని చేయడం లేదనేది నిజం అయినప్పటికీ ఆమాత్రం ఉన్నవారు ఇక దొరకరని, పైగా మతపరమైన విభజనలు పెరిగిపోయాక మరింత తీవ్రమైన వ్యూహాలను చేపట్టడానికి ఆయన అవసరమని పరివార్ పెద్దలు భావిస్తున్నారని అంటారు. ఆ పైన కార్పొరేట్ ఒత్తిళ్లు. ఈ మొత్తం ప్రహసనం ఎలా పరిసమాప్తం అవుతుందో చూద్దాం. మోడీ శక్తికి తిరుగులేనట్టు దాని ముందు తల వంచాల్సిందే అన్నట్టు కోతలు కోసిన వారు, తప్పు అంచనాలు వేసిన వారు కూడా ఈ మల్లగుల్లాల నుంచి పాఠాలు నేర్చుకుంటారని ఆశించాలి.

మోడీ జనాకర్షణ పని చేయడం లేదనేది నిజం అయినప్పటికీ ఆమాత్రం ఉన్నవారు ఇక దొరకరని, పైగా మతపరమైన విభజనలు పెరిగిపోయాక మరింత తీవ్రమైన వ్యూహాలను చేపట్టడానికి ఆయన అవసరమని పరివార్ పెద్దలు భావిస్తున్నారని అంటారు. ఆ పైన కార్పొరేట్ ఒత్తిళ్లు. ఈ మొత్తం ప్రహసనం ఎలా పరిసమాప్తం అవుతుందో చూద్దాం. మోడీ శక్తికి తిరుగులేనట్టు దాని ముందు తల వంచాల్సిందే అన్నట్టు కోతలు కోసిన వారు, తప్పు అంచనాలు వేసిన వారు కూడా ఈ మల్లగుల్లాల నుంచి పాఠాలు నేర్చుకుంటారని ఆశించాలి.

విశ్లేషణ

సంజయ్ రాయ్

ఉపాధి కల్పన ప్రోత్సాహక పథకం

లాభాలు కార్పొరేట్లకు, భారాలు ప్రజలకు

కేంద్ర కేబినెట్ ఎంప్లాయ్‌మెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ (ఇ.ఎల్.ఐ)ను ఆమోదించింది. అందుకోసం రూ. 99,446 కోట్ల ఖర్చును కూడా ఆమోదించింది. ఈ స్కీము అమలైతే రాబోయే రెండేళ్ళలో 3.5 కోట్ల ఉద్యోగాలు అదనంగా వస్తాయని ప్రకటించింది. వాటిలో 1.92 కోట్ల మంది లబ్ధిదారులు వారి జీవితాల్లో మొదటిసారి ఉద్యోగాలు పొందనున్నారని తెలిపింది. 2025 ఆగస్టు 1వ తేదీ నుండి 2027 జులై 31వ తేదీ మధ్య కాలంలో కల్పించబోయే ఉద్యోగాలకు ఈ పథకం వర్తిస్తుంది. అంటే ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కల్పనకు దాదాపు ఒక లక్ష కోట్ల రూపాయల ప్రజాధనాన్ని సబ్సిడీగా ముట్టజెప్పడానికి ప్రభుత్వం సిద్ధపడుతోంది. ప్రైవేటు యజమానులకు కట్టబెట్టే బదులు ప్రభుత్వమే తన స్వంత ఉపాధి కల్పన పథకాల ద్వారా ఆ ధనాన్ని ఎందుకు వెచ్చించకూడదు? ఇప్పటికే ఉత్పాదక ప్రోత్సాహక పథకాల ద్వారా యజమానులకు ఇన్సెంటివ్‌లు అందుతూనే వున్నాయి. ఇవి కాక పన్ను చెల్లింపుల నుండి మినహాయింపులు ఇస్తున్నారు. కొత్త వ్యాపారాలలో పెట్టుబడులకు ప్రోత్సాహకాలు ఇస్తున్నారు ఇప్పుడు ఇ.ఎల్.ఐ ద్వారా ఉద్యోగాల కల్పన కోసం కూడా వారికి ఎందుకు ముట్టజెప్తున్నారు? వాస్తవం ఏమంటే, గత పదిహేనేళ్ళ కాలంలో వాస్తవంగా సరుకుల ఉత్పత్తి రంగంలో పెట్టుబడులు తగ్గిపోతున్నాయి కాని కార్పొరేట్ల లాభాలు మాత్రం బాగా పెరిగిపోతూనే వున్నాయి. కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చడం కోసం వారిపై విధించాల్సిన పన్నులను ప్రభుత్వం వదిలివేసుకుంటోంది. అది చాలదన్నట్టు ఇప్పుడు వాళ్ళు చేయబోయే ఉత్పత్తికి ముందుగా ఇ.ఎల్.ఐ స్కీముతో మరిన్ని లాభాలు కట్టబెడుతోంది.

తమ ఉద్యోగులకు చెల్లించవలసిన జీతాల నిమిత్తం కార్పొరేట్లకు ప్రభుత్వం సబ్సిడీ అందించడం అనేది కేవలం ఒక ఖాతా నుండి వనరులను మరొక ఖాతాకు మళ్ళించడంగా పరిగణించకూడదు. ఇది సమిష్టి ప్రయోజనాల కోసం వెచ్చించవలసిన సొమ్మును వ్యక్తిగత లాభాల కోసం దారి మళ్ళించడమే. పెట్టుబడిదారుడి దృష్టిలో ఉద్యోగాలు ఇవ్వడం అనేది ఉత్పత్తి క్రమంలో ఒక భాగం మాత్రమే. ఉద్యోగుల జీతాలను కూడా ఉత్పత్తి ఖర్చులో కలిపి లెక్కిస్తాడు. తనకు లాభం వస్తుందంటేనే పెట్టుబడులు పెడతాడు తప్ప సమాజసేవ కోసం కాదు. అదే ప్రభుత్వం చేపట్టే ఉపాధి కల్పన కార్యక్రమాలైతే ఉపాధి కల్పనే వాటి ప్రధాన లక్ష్యం. అందుకోసం ప్రజోపయోగకరంగా ఉండే పనులను ఆ కార్యక్రమాల ద్వారా చేపడతారు. ఒక స్కూలు భవనాన్ని రిపేరు చేయడమో, ఒక చెరువు పూడిక తీయడమో జరిగితే అవి ప్రజలకు ఉపయోగపడతాయి. ప్రభుత్వం చేపట్టే ఉపాధి కల్పన కార్యక్రమాలు మానవ వనరులను ఉపయోగంలోకి తెచ్చుకుని ప్రజలకు ఉపయోగకరంగా ఉండే పనులను చేస్తాయి. ఆ పనులను చేసినందుకు ఆ కార్మికులకు వేతనాలు చెల్లిస్తారు. అదే ప్రైవేటు రంగం లక్ష్యం కేవలం లాభార్జనే. ఉత్పత్తి చేసిన సరుకులను అమ్ముకుని లాభాలు తెచ్చుకోవడమే. అలా వచ్చిన లాభాలు ఆ యజమాని జేబులోకే పోతాయి. అందుచేత ఉద్యోగాలు కల్పించినందుకు అయ్యే ఖర్చు భారాన్ని ప్రభుత్వం కూడా పంచుకోడానికి తయారవడం అంటే ప్రైవేటు లాభాల కోసం సాగే ఉత్పత్తి ఖర్చును సమాజం మీద రుద్దడమే.

ప్రభుత్వ ఉపాధి పథకాలను ఎందుకు విస్తరించకూడదు?

ఇ.ఎల్.ఐ స్కీము పార్ట్ 'ఎ' ప్రకారం యజమాని కల్పించే ప్రతీ అదనపు ఉద్యోగానికీ ఆ ఉద్యోగికి మొదటి నెల జీతంలో రూ.15,000 ప్రభుత్వం భరిస్తుంది. పార్ట్ 'బి' ప్రకారం నెలకు రూ. ఒక లక్ష వరకూ జీతం వచ్చే ఉద్యోగాలకు సంబంధించి ప్రతీ నెలా రూ.3000 చొప్పున రెండేళ్ళపాటు ప్రభుత్వం యజమానికి సబ్సిడీ ఇస్తుంది. కనీసం ఆరు నెలల పాటు ఆ ఉద్యోగం కొనసాగితే చాలు. సరుకుల ఉత్పత్తి రంగానికి ఈ ప్రోత్సాహాలు మూడవ, నాలుగవ సంవత్సరానికి కూడా వర్తిస్తాయి. అంటే తాను కల్పించే ప్రతీ ఒక అదనపు ఉద్యోగానికీ యజమానికి రెండేళ్ళ కాలంలో రూ.72,000 లభిస్తాయి. అదే సరుకుల ఉత్పత్తి రంగంలోనైతే నాలుగేళ్ళ కాలంలో రూ.1,44,000 లభిస్తాయి. ప్రతీ అదనపు ఉద్యోగానికీ ఆ ఉద్యోగికి లభించేది రూ.15,000. కాని యజమానికి మాత్రం రూ.72,000 లేదా రూ.1,44,000 ముడతాయి !

ఈ స్కీము ఫలితంగా అదనంగా వచ్చే ఉద్యోగాలు పెద్దగా ఉండవు కాని ఇప్పుడున్న ఉద్యోగస్తులలో ఎక్కువ మందికి వేతనాలు తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఇంకోపక్క యజమానులకు లాభాలు పెరిగిపోతాయి. అదే ప్రభుత్వమే ఉద్యోగాల కల్పన పథకాలను అమలు చేస్తే అవి తప్పకుండా అదనపు ఉద్యోగాలను కల్పిస్తాయి.

ఇప్పుడు యజమాని ఒక కార్మికుడికి నెలకు రూ.21,000 చెల్లిస్తున్నచోట ఇకముందు అతడు రూ.18,000 చెల్లిస్తాడు. తక్కిన రూ.3000 ప్రభుత్వం చెల్లిస్తుంది. దీని వలన ఇప్పటిదాకా ఆరుగురికి చెల్లించిన జీతంతో ఇకముందు ఏడుగురిని నియమించుకోవచ్చు. అంటే అదనంగా కార్మికుల శక్తిని ఉపయోగించి టర్నోవరు పెంచుకోవచ్చు. అదీ యజమానికి లాభమే.

ఇప్పుడు అత్యధిక ఉద్యోగాలు కాంట్రాక్టు విధానంలో కల్పిస్తున్నారు. ఆ కాంట్రాక్టరుకు ఇంతవరకూ ఒక్కో వర్కర్ కోసం రూ.21,000 చెల్లిస్తున్నారు. ఇకముందు రూ.18,000 మాత్రమే చెల్లిస్తాడు (తాను నేరుగా నియమించినవారికి చెల్లిస్తున్నది అంతే కాబట్టి). దాని ఫలితంగా కాంట్రాక్టు పద్ధతిలో నియమించబడినవారికి ఇకమీదట జీతాలు తగ్గుతాయి. వారికి ప్రభుత్వ సబ్సిడీ వర్తించదు.

ఏ యజమాని అయినా తాను ఉత్పత్తి చేయబోయే సరుకులకు మార్కెట్‌లో డిమాండ్ తగినంత ఉంటుందనుకున్నప్పుడే పెట్టుబడి పెట్టడానికి సిద్ధపడతాడు తప్ప ప్రభుత్వం ఇచ్చే రూ.3000 సబ్సిడీ కోసం తాను రూ.18000 ఒక్కో వర్కర్‌కీ ఊరికే ఖర్చు చేయడు కదా. అందుచేత ఈ స్కీము ఫలితంగా అదనంగా వచ్చే ఉద్యోగాలు పెద్దగా ఉండవు కాని ఇప్పుడున్న ఉద్యోగస్తులలో ఎక్కువ మందికి వేతనాలు తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఇంకోపక్క యజమానులకు లాభాలు పెరిగిపోతాయి. అదే ప్రభుత్వమే ఉద్యోగాల కల్పన పథకాలను అమలు చేస్తే అవి తప్పకుండా అదనపు ఉద్యోగాలను కల్పిస్తాయి. అంతేగాక లేబర్ మార్కెట్‌లో కార్మికుల అవసరం పెరుగుతుంది. దాని వలన గ్రామీణ కార్మికుల వేతనాలు కూడా పెరుగుతాయి.

ఉత్పత్తి ఖర్చు భారాన్ని సమాజం మీద మోపడం

కార్పొరేట్లు స్వంతంగా చేసిన అప్పుల్ని చెల్లు వేసే బాధ్యత అంతకంతకూ ఈ పెట్టుబడిదారీ ప్రభుత్వం తన మీద వేసుకుంటోంది. మరోపక్క కార్మిక శక్తి నిరంతరాయంగా పెట్టుబడిదారులకు అందుబాటులో ఉంచే బాధ్యతను మాత్రం సమాజంపై మోపుతోంది. కార్మిక హక్కుల్ని, వారికి వర్తించే సంక్షేమ పథకాలని, ఓవర్‌టైం చెల్లింపు నిబంధనలను ఎంతలా నీరుగార్చుతున్నారంటే అవి ఇప్పుడు హక్కులుగా కాక, అరుదుగా లభించే వరాల్లా మారిపోతున్నాయి. నిబంధనలను తన ఇష్టం వచ్చిన రీతిలో మార్చుకునే స్వేచ్ఛ యజమానికి రానురానూ పెరుగుతోంది. అంటే కార్మికులను కొల్లగొట్టే విషయంలో యజమానికి ఎట్టి ఆంక్షలూ ఉండకూడదు. అతడికి అవసరమైన కార్మిక శక్తిని ఎట్టి ఆటంకమూ లేకుండా సరఫరా చేసే బాధ్యత మాత్రం సమాజానిది. ఆ కార్మికులు, వారి కుటుంబాలు ప్రాణాలతో మిగిలి వుండేందుకు అవసరమైన ఖర్చును సైతం ప్రభుత్వమే సంక్షేమ పథకాల రూపంలో భరించాలి తప్ప యజమాని బాధ్యత ఏమీ ఉండదు.

ప్రభుత్వ నిర్వహణకు అవసరమైన ధనాన్ని సేకరించడానికి ప్రత్యక్ష, పరోక్ష పన్నులను విధించడం ప్రధానమార్గం. ఎక్కువ సంపద, ఆదాయం ఉన్నవారిమీద ఆ సంపదను బట్టి, ఆదాయాన్ని బట్టి వేసేది ప్రత్యక్ష పన్ను. దానిని మాత్రం ఎప్పటికప్పుడు తగ్గించుకుంటూ వస్తున్నారు. అదే ప్రజలు చేసే ఖర్చు మీద విధించే పరోక్ష పన్నులను మాత్రం ఎప్పుడు బడితే అప్పుడు పెంచుకుంటూ పోతున్నారు. అంటే పాలనాభారం ప్రజల మీద మోపుతూ, పాలనా సౌకర్యాలు కార్పొరేట్లకు కల్పిస్తున్నారు. ఇప్పుడు ఇ.ఎల్.ఐ స్కీము ద్వారా ఆ కార్పొరేట్లు భరించవలసిన ఉత్పత్తి ఖర్చును కూడా ప్రజలే భరించే పరిస్థితి కల్పిస్తున్నారు !

ప్రభుత్వం చేపట్టే ఉపాధి కల్పన కార్యక్రమాలు మానవ వనరులను ఉపయోగంలోకి తెచ్చుకుని ప్రజలకు ఉపయోగకరంగా ఉండే పనులను చేస్తాయి. ఆ పనులను చేసినందుకు ఆ కార్మికులకు వేతనాలు చెల్లిస్తారు. అదే ప్రైవేటు రంగం లక్ష్యం కేవలం లాభార్జనే. ఉత్పత్తి చేసిన సరుకులను అమ్ముకుని లాభాలు తెచ్చుకోవడమే. అలా వచ్చిన లాభాలు ఆ యజమాని జేబులోకే పోతాయి. అందుచేత ఉద్యోగాలు కల్పించినందుకు అయ్యే ఖర్చు భారాన్ని ప్రభుత్వం కూడా పంచుకోడానికి తయారవడం అంటే ప్రైవేటు లాభాల కోసం సాగే ఉత్పత్తి ఖర్చును సమాజం మీద రుద్దడమే.

(స్వేచ్ఛానుసరణ)

ల్యాండింగ్ సమస్యతో గాల్లో చక్కర్లు

- బెంబేలెత్తిన ఇండిగో ప్రయాణికులు

నాగ్‌పూర్ : ఇండిగో విమానం ల్యాండింగ్ విషయంలో సమస్య తలెత్తడంతో ప్రయాణికులంతా బెంబేలెత్తిన వైనం శనివారం ఉదయం జరిగింది. ముంబయి నుంచి నాగ్‌పూర్‌కు వచ్చిన ఇండిగో విమానం, నాగ్‌పూర్ ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్‌కి ప్రయత్నించే సమయంలో రన్‌వే మార్గం స్పష్టంగా కనిపించలేదు. దీంతో పైలట్ అప్రమత్తమై, విమానాన్ని తిరిగి గాల్లోకి తీసుకెళ్లారు. దాదాపు 15 నిమిషాల పాటు విమానం గాల్లోనే చక్కర్లు కొట్టడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళన చెందారు. ఆ తరువాత పైలట్ విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేయగలిగారు. విజిబిలిటీ తగ్గిపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. అయినప్పటికీ, పైలట్ రెండో ప్రయత్నంలో విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేయగలిగారని అన్నారు.

'గరీబ్‌రథ్'లో మంటలు

జైపూర్ : రైల్వే భద్రత పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన కారణంగా పదేపదే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. శనివారం రాజస్థాన్ రాష్ట్రం అజ్మీర్ రైల్వే డివిజన్‌లోని సెంద్రస్టేషన్‌లో గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజిన్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. రైలు బోగీల్లో పొగలు వ్యాపించడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

ఖరీఫ్ కష్టాలు..!

- సాగునీటి కోసం రోడ్డెక్కుతున్న రైతులు
- కృష్ణా ఆయకట్టులో బీటలు వారుతున్న నారుమళ్లు
- దాదాపు 30 వేల ఎకరాల్లో సాగుపై రైతుల్లో తీవ్ర ఆందోళన
- మందకొడిగా కౌలుకార్డుల జారీ, రుణాల అందజేత

యలమంచిలి మండలంలో ఎండుతున్న పొలాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ సాగులో అన్నదాత అష్టకష్టాలు పడుతున్నాడు. సాగునీటి కోసం రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిన దుస్థితి దాపురించింది. వానలు లేక, సాగు నీరందక ఖరీఫ్ సాగు రైతులకు కత్తి మీద సాములా మారింది. ముఖ్యంగా ఏలూరు జిల్లాలోని కృష్ణా డెల్టా ఆయకట్టుకు సాగు నీరందక రైతులు పడుతున్న పాట్లు వర్ణనాతీతం.

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఏలూరు జిల్లాలో 2.22 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. ఇప్పటి వరకూ 47 వేల ఎకరాల్లో నాట్లు వేశారు. పశ్చిమలో 2.15 లక్షల ఎకరాల్లో వరిసాగుకు రైతులు సన్నద్ధమవ్వగా, 50 వేల ఎకరాల్లో నాట్లు పూర్తయినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. వానలు కురవకపోవడంతో సాగునీటి కోసం రైతులు పడుతున్న అవస్థలు చెప్పలేనివిగా మారాయి. డెల్టా ప్రాంతంలో సైతం సాగునీరు సక్రమంగా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయిల్ ఇంజిన్లతో నీరు తోడుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దెందులూరు, ఏలూరు నియోజకవర్గాల పరిధిలో దాదాపు 30 వేల ఎకరాల మేర కృష్ణా ఆయకట్టు ఉంది. కృష్ణా కాలువ ద్వారా సాగునీరు రాకపోవడంతో ఈ రెండు నియోజకవర్గాల్లో ఖరీఫ్ సాగుకు వేసిన నారుమడులన్నీ బీటలు వారుతున్నాయి. దీంతో తమకు సాగునీరు అందించాలంటూ రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. గోదావరి నుంచి వచ్చే నీటిని కృష్ణా ఆయకట్టుకు తరలించే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ఆలోచించాలని రైతులు కోరుతున్నారు. పట్టిసీమ నుంచి కృష్ణాకు నీటిని తరలిస్తున్నా జిల్లాలోని కృష్ణా ఆయకట్టుకు మాత్రం సాగునీరు అందించని పరిస్థితి ఏర్పడింది. ఖరీప్ సాగు ఆదిలోనే ఈ విధంగా ఉంటే ముందు పరిస్థితి ఏమిటనే భయం అన్నదాతను వెంటాడుతోంది. డెల్టా ప్రాంతంలోనూ సాగునీరు కోసం రైతులు ఆయిల్ ఇంజిన్లు వాడాల్సి రావడంతో ఖర్చు తడిసి మోపెడవుతోంది. దీంతో సాగు పెట్టుబడి పెరిగిపోతుంది. ఎండల తీవ్రతకు నాట్లు సైతం దెబ్బతింటుండటంతో రైతులు తీవ్ర వేదనకు గురవుతున్నారు.

మందకొడిగా కౌలుకార్డుల జారీ, రుణాలు అందజేత

రెండు జిల్లాల్లో మూడు లక్షల మందికిపైగా కౌలురైతులు ఉన్నట్లు అధికారిక లెక్కలే చెబుతున్నాయి. అయినప్పటికీ కౌలుకార్డుల జారీకి సంబంధించి తీసుకున్న టార్గెట్లు మాత్రం రెండు జిల్లాల్లో తక్కువగా ఉన్నాయి. ఏలూరు జిల్లాలో 75 వేలు కౌలుకార్డులు జారీ చేయాలని టార్గెట్ తీసుకోగా, ఇప్పటి వరకూ 42 వేల కార్డులు జారీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో 87 వేల కౌలుకార్డులు జారీ చేయాలని టార్గెట్ తీసుకోగా 60 వేల కార్డులు వరకూ జారీ చేసినట్లు తెలిసింది. రుణాల మంజూరు మరింత మందకొడిగా సాగుతోంది. ఏలూరు జిల్లాలో కౌలురైతులకు రూ.375 కోట్లు పంట రుణాలుగా ఇవ్వాలని టార్గెట్ నిర్ణయించగా, ఇప్పటి వరకూ రూ.8 కోట్లు మాత్రమే అందించారు. పశ్చిమగోదావరి జిల్లాలో కౌలురైతుల రుణాల మంజూరు పరిస్థితి నామమాత్రంగానే ఉంది. దీంతో కౌలురైతులు ఖరీఫ్ పెట్టుబడుల కోసం నానాతంటాలు పడుతున్నారు. నాట్లు నాటిన రైతులు కూలీలకు, ట్రాక్టర్ దమ్ముకు ఇచ్చేందుకు సొమ్ములు లేక ప్రయివేటు వడ్డీ వ్యాపారుల నుంచి అప్పులు తెచ్చి వ్యవసాయ సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కౌలురైతులకు బ్యాంకుల నుంచి పంటరుణాలు అందించేలా ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అంతా కోరుతున్నారు. కార్డుల జారీ త్వరితగతిన పూర్తిచేసి రుణాలు అందిస్తేనే కౌలురైతులకు మేలు జరిగే పరిస్థితి ఉంది. లేకపోతే కౌలురైతులు ప్రయివేటు వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లో నలిగిపోక తప్పదు.

ఉక్రెయిన్‌పై విరుచుకుపడిన రష్యా

- కీవ్ తదితర ప్రాంతాలపై డ్రోన్లు, క్షిపణులతో ఆపరేషన్
- ఉక్రెయిన్‌కు ఆస్ట్రేలియా ఆయుధాలు

కీవ్ : అమెరికా, పశ్చిమ దేశాల అండదండలతో ఒంటికాలిపై లేస్తున్న ఉక్రెయిన్‌పై రష్యా మరోమారు సైనిక ఆపరేషన్‌కు ఉపక్రమించింది. రష్యా అధ్యక్షుడి భవనం క్రెమ్లిన్ కాల్పుల విరమణ కోసం ఒకవైపు మంతనాలు సాగిస్తుండగా.. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే ఉసిగొల్పుతూ పరిస్థితిని ఉద్రిక్తంగా మారుస్తున్న సంగతి తెలిసిందే. రష్యా సైనికులు వినియోగించే తాగునీటిలో విషప్రయోగం చేయడంతో పలువురు మరణించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో... కీవ్ సహా పలు ప్రాంతాల్లో రష్యా సైనిక బలగాలు విరుచుకుపడ్డాయని ఉక్రెయిన్ సైనికాధికారులు తెలిపారు. కీవ్‌పై 300కు పైగా డ్రోన్లు, 30 పైగా క్షిపణులతో దాడులు జరిగినట్లు వారు పేర్కొన్నారు. ఈ దాడిలో అనేక నివాస భవనాలు, ఆస్పత్రులు, వాహనాలు ధ్వంసమయ్యాయని, పలువురు గాయపడ్డారని తెలిపారు. రష్యన్ దళాలు ఉక్రెయిన్‌లోని ఒడెసా నగరంపై 20కి పైగా డ్రోన్లు, పదుల సంఖ్యలో క్షిపణులు ప్రయోగించడంతో ఒకరు ప్రాణాలు కోల్పోగా.. పలువురు తీవ్ర గాయాలపాలైనట్లు ఆ దేశాధ్యక్షుడు జెలెన్స్కీ పేర్కొన్నారు. ఉక్రెయిన్‌కు ఆస్ట్రేలియా కూడా ఆయుధాలు సమకూరుస్తోంది. ఇందులో భాగంగా శనివారం కీవ్‌కు ఎం1ఎ1 అబ్రమ్స్ యుద్ధ ట్యాంకులను అందజేసింది.

ఐదు యుద్ధ విమానాలను కూల్చేశారు

- భారత్ - పాక్ ఘర్షణలపై ట్రంప్ వ్యాఖ్యలు

వాషింగ్టన్ : ఈ ఏడాది మే నెలలో చోటుచేసుకున్న భారత్ - పాక్ ఘర్షణల్లో 'ఐదు యుద్ధ విమానాలను కూల్చేశారు' అని అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం వ్యాఖ్యానించారు. అయితే, ఏ దేశం ఎన్ని యుద్ధ విమానాలను నష్టపోయిందో ఆయన చెప్పలేదు. శుక్రవారం రాత్రి వైట్ హౌస్‌లో రిపబ్లికన్ సెనేటర్లతో విందు సందర్భంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు అంతర్జాతీయ మీడియా సంస్థలు తమ కథనాల్లో పేర్కొన్నాయి. పాకిస్తాన్ కూడా గతంలో భారత్‌కు చెందిన 'ఐదు యుద్ధ విమానాలను కూల్చివేశాం' అని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. అయితే ఆ వాదనలను భారత చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ గతంలోనే పూర్తిగా ఖండించారు.

మరోవైపు భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణ జరిగేలా చేశామంటూ కూడా ట్రంప్ పదేపదే చెబుతూ వస్తున్నారు. భారత్, పాకిస్తాన్‌లతో వాణిజ్యాన్ని నిలిపివేస్తామంటూ బెదిరించామని, ఆ తర్వాతే రెండు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయని కూడా ఓ సందర్భంలో ట్రంప్ చెప్పుకొచ్చారు. అమెరికా ప్రకటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మౌనంగా ఉంటూ రావడంపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే.

జనాల మీదకు దూసుకెళ్లిన కారు

- లాస్ ఏంజిల్స్‌లో 20 మందికి గాయాలు

న్యూయార్క్ : అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌కు చెందిన ఈస్ హాలీవుడ్‌లో గుర్తు తెలియని వాహనం జనాల మీదకు దూసుకెళ్లింది. శనివారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘటనలో 20 మంది గాయపడ్డారు. అర్ధరాత్రి దాటిన తర్వాత రెండు గంటల సమయంలో ఇది చోటుచేసుకుంది. క్షతగాత్రుల్లో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని స్థానిక అధికారులు తెలిపారు.

Union Bank of India — అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ, 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎ.పి.-520001, Email: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

RULE 6 (2)/8 (6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002

ఋణగ్రహీతలు : 1) మెస్సర్స్ రంజిత కాటన్ ట్రేడర్స్ తరపున యజమానురాలు : శ్రీమతి ...

ఆస్తి నెం.4 : తేది.21.09.2017 నాటి డాక్యుమెంట్ నెం.1728/2008 ప్రకారం గుంటూరు, ఏటుకూరు గ్రామ పంచాయితీ, అనంతవరప్పాడు రోడ్డు దగ్గర, బొంతపాడు రోడ్డు, డి.నెం.405/ఎ మరియు 405/బి నందు **శ్రీ పావులూరి హనుమంతరావుకు** చెందిన ఎ.0.475 సెంట్లు లేదా 2299 చ.గ.ల విస్తీర్ణముగల ఇండస్ట్రియల్ స్థలమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు:** కొల్లా వెంకటప్పయ్యకు చెందిన ఆస్తి, **దక్షిణం:** నంబూరి వెంకటప్పయ్యకు చెందిన ఆస్తి, **పడమర:** బొంతపాడు డొంక, **ఉత్తరం:** మన్నవ హిమబిందుకు చెందిన ఆస్తి.

స్థలం : విజయవాడ, తేది : 14-07-2025 సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

रजिस्ट्री सं. डी.एल.- 33004/99 REGD. No. D. L.-33004/99

भारत का राजपत्र
The Gazette of India

सी.जी.-डी.एल.-अ.-14072025-264624
CG-DL-E-14072025-264624

असाधारण
EXTRAORDINARY
भाग II—खण्ड 3—उप-खण्ड (ii)
PART II—Section 3—Sub-section (ii)
प्राधिकार से प्रकाशित
PUBLISHED BY AUTHORITY

सं. 3043] नई दिल्ली, शुक्रवार, जुलाई 11, 2025/आषाढ़ 20, 1947
No. 3043] NEW DELHI, FRIDAY, JULY 11, 2025/ASHADHA 20, 1947

రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ

నోటిఫికేషన్

న్యూఢిల్లీ, జూలై 11, 2025

S.O. 3113(E) -జాతీయ రహదారుల చట్టం, 1956(48 అఫ్ 1956) లోని సబ్ - సెక్షన్ (1) (1956 యొక్క 48) (ఇక పై పేర్కొన్న చట్టంగా సూచిస్తారు) ద్వారా అందించబడిన అధికారాలను అమలు చేయడంలో, కేంద్ర ప్రభుత్వం, ప్రజా ప్రయోజనాల కోసం సంతృప్తి చెందిన తర్వాత, దిగువ షెడ్యూల్లో ఇవ్వబడిన క్లుప్త వివరణ ప్రకారం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ఎన్టీఆర్ జిల్లా జక్కంపూడి అనే గ్రామం(ల)లో కి.మీ. 306.650 నుండి కి.మీ. 309.909 వరకు ఉన్న భూభాగం జాతీయ రహదారుల నిర్మాణం (విస్తరించడం/నాలుగు వరుసలు మొదలైనవి), నిర్వహణ, మేనేజ్ మెంట్ మరియు ఆపరేషన్ కోసం అవసరమని, అటువంటి భూమిని స్వాధీనం చేసుకునే ఉద్దేశాన్ని ఇందుమూలంగా ప్రకటించారు.

సదరు భూమిపై ఆసక్తి ఉన్న ఎవరైనా, అధికారిక గెజిట్ లో ఈ నోటిఫికేషన్ ప్రచురించబడిన తేదీ నుండి ఇరవై ఒక్క రోజులలోపు. పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 3Cలోని సబ్- సెక్షన్ (1) కింద పేర్కొన్న ప్రయోజనార్థం సదరు భూమిని ఉపయోగించడం పట్ల అభ్యంతరం ను తెలియచేయవచ్చును.

BUILDING A NATION, NOT JUST ROADS

Canara Bank — ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీసు, డి.నెం. 54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మి అవెన్యూ, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ-520008, ఫోన్: 8331011695, ఇ-మెయిల్: armvij@canarabank.com

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (MANAPPURAM HOME FINANCE LTD.)
గతంలో మణప్పురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్
సిఐఎన్ : U65923K12010PIC039179, యూనిట్ నం.301 నుండి 315, ఎ వింగ్, కనకియ వాల్ స్ట్రీట్, అందేరి-కుర్ల రోడ్, అందేరి తూర్పు, ముంబై- 400093.

డిమాండ్ నోటీసు

ఏదైతే, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇకపై "ఎమ్ఎహెచ్ఓఎఫ్ఐఎన్"గా పిలువబడుతుంది) యొక్క అధీకృత అధికారి IV/470A(పాతది)W/638A(కొత్తది) మణప్పురం హౌస్ వలపడ్ త్రిస్సూర్, కేరళ 680567 మా నమోదిత కార్యాలయం ఉంది మరియు వివిధ ప్రదేశాలలో దీని శాఖా కార్యాలయాలు ఉన్నాయి, కంపెనీల యాక్ట్ 1956 క్రింద నమోదు చేయబడిన కంపెనీ మరియు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002 (ఇకపై యాక్ట్ గా సూచించబడుతుంది) యొక్క సెక్షన్ 2 యొక్క సబ్ సెక్షన్ (1) యొక్క క్లాజ్ (ఎమ్) యొక్క సబ్ క్లాజ్ (4) అర్థం ఆర్థిక సంస్థ నం.ఎస్.ఓ.3466 (ఇ)తో చదువుతూ నిర్మాణం మరియు / లేదా నివాస యూనిట్ల కొనుగోలు కోసం అడ్వాన్సింగ్ లోన్‌ల వ్యాపారాన్ని నిర్వహిస్తోంది మరియు దిగువ కాలమ్ నం. 2లో పేర్కొన్న విధంగా రుణగ్రహీత / సహ రుణగ్రహీతలు ఎమ్ఎహెచ్ఓఎఫ్ఐఎన్ నుండి రుణం పొందినట్లు పేర్కొన్న చార్ట్ తేది 18 డిసెంబర్, 2015న గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఆర్థిక సేవల విభాగం, ఆర్థిక మంత్రిత్వ శాఖ, న్యూ ఢిల్లీ ద్వారా జారీ చేయబడింది మరియు ఏదైతే సెక్యూర్డ్ క్రెడిటార్ గా ఉన్న ఎమ్ఎహెచ్ఓఎఫ్ఎన్ సర్ఫేసీ యాక్ట్ క్రింద, సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 2తో చదువుతూ సదరు యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద అతనికి అందించిన అధికారాలను వినియోగించుకుంటూ నోటీసు తేది నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొన్న మొత్తంతో పాటు దానిపై తదుపరి వడ్డీతో చెల్లించమని రుణగ్రహీత/సహ రుణగ్రహీతలను పిలుస్తూ డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది. అయితే వివిధ కారణాల వల్ల కొందరికి నోటీసులు అందజేయలేదు. దానితో పాటు క్రింద పేర్కొనబడిన రుణగ్రహీతల సమాచారం యొక్క ప్రయోజనాల కొరకు ఈ పబ్లిక్ నోటీసు ద్వారా పేర్కొన్న రుణగ్రహీతలకు తెలియజేయబడుతోంది.

క్ర. సం	రుణగ్రహీత/సహ-రుణగ్రహీతల పేరు/ఎల్ఎఎన్/శాఖ	సృష్టించబడిన వడ్డీ విషయంలో సెక్యూర్డ్ అస్సెట్ వివరణ	ఎన్‌పిఎ తేది	నోటీసు పంపిన తేది మరియు బకాయి మొత్తం
1	చందోలు రామ వెంకట శిరీష, నాగదేశీ విజయబాబు, నాగదేశీ కిరణ్ కుమార్/ MHL00310012871/ విజయవాడ	కృష్ణాజిల్లా, గన్నవరం సబ్ రిజిస్ట్రీ, గన్నవరం మండలం, కేసరపల్లి గ్రామ పంచాయతీ ఏరియా, కేసరపల్లి గ్రామం, ఆర్.ఎస్.నం.242/10, డో.నం.6-126, మూల్యాంకనం నం.830 విస్తీర్ణం 84.7 చ.గ.లు. రెసిడెన్షియల్ సైట్ కలిగి ఉన్న దక్షిణం వైపు ఎసిసి షీట్ షెడ్, పి.ఓ. కేసరపల్లి, కృష్ణ, ఆంధ్రప్రదేశ్, పిన్ : 521102. తూర్పు : 2 గ.లు. వెడల్పు ఉమ్మడి మార్గం, పడమర : నాగదేశీ విజయ బాబు ఆస్తి, దక్షిణం: శింగవరపు సుధారాణి ఆస్తి, ఉత్తరం : చీలిజోజి ఆస్తి.	20-06-2025	21-06-2025 & Rs.669178/-

గమనిక, ఈ నోటీసును ప్రచురించిన 60 రోజులలోపు సంబంధిత రుణగ్రహీత / సహ-రుణగ్రహీతకు వ్యతిరేకంగా ఇక్కడ చూపిన మొత్తం బకాయి మొత్తాన్ని చెల్లించవలసిందిగా వారిని పిలుస్తూ పైన పేర్కొన్న విధంగా రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలకు నోటీసు ఇవ్వడమైనది. సంబంధిత రుణగ్రహీత/సహ-రుణగ్రహీత తదుపరి వడ్డీతో పాటు మొత్తం బకాయి మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైతే, పైన వివరించిన విధంగా చట్టం మరియు ఇక్కడ రూపొందించిన నియమాల క్రింద సూచించబడిన ఇతర పద్ధతులలో నోటీసు సర్వీస్ కొరకు ఆస్తులపై సెక్యూరిటీ ఇంట్రస్ట్ అమలు చేయడం కోసం ఎమ్ఎహెచ్ఓఎఫ్ఐఎన్ సెక్షన్13(4) ని తీసుకోవలసి ఉంటుంది. సర్ఫేసీ చట్టంలోని సెక్షన్ 13(8)లో వివరించిన విధంగా విక్రయం, పబ్లిక్ వేలం లేదా ప్రైవేట్ ఒప్పందం ద్వారా బదిలీ చేయడానికి నోటీసును ప్రచురించే తేదీకి ముందు ఏ సమయంలోనైనా ఎమ్ఎహెచ్ఓఎఫ్ఐఎన్ ద్వారా అయ్యే ఖర్చులు, ఛార్జీలు మరియు ఖర్చులతో పాటు చెల్లించాల్సిన మొత్తం మొత్తాన్ని చెల్లించిన తర్వాత పేర్కొన్న తనఖా రీడీమ్ చేయబడుతుందని మీరు గమనించాలి. సర్ఫేసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13 (13) ప్రకారం, మీరు సెక్యూర్డ్ అసెట్స్‌ను ఏ పద్ధతిలోనైనా అమ్మకం, లీజు లేదా మరే ఇతర పద్ధతిలో బదిలీ చేయకుండా మరియు/ లేదా వ్యవహరించకుండా నిరోధించబడ్డారని గుర్తుంచుకోగలరు.

తేది : 20.07.2025, ప్రదేశం : కృష్ణ సం/- అధీకృత అధికారి , మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

HDFC BANK LTD. (HDFC BANK — We understand your world)
రిజిష్టర్డు ఆఫీసు: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్‌మార్గ్, లోయర్ పరేల్ (వెస్ట్) ముంబై, మహారాష్ట్ర-400013.
బ్రాంచ్ ఆఫీసు: 50-96-5, ఫ్లాట్ నెం.175, సీతమ్మధార, ఓల్డ్ ఎస్‌బిహెచ్ ఎదురుగా, విశాఖపట్నం-530 013.

స్పీడ్ పోస్ట్/ ఇ-మెయిల్

Letter No.HDFC/DFSO/13(2)/20-06/1 Dated: 20-06-2025

వీరికి,
1) మెసర్స్ కాలా సీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రతినిధియైన దీని డైరెక్టర్, శ్రీ ఈశ్వరరావు విజ్జురోతి, డి.నెం.2-1-22/1, 1వ అంతస్తు గణేష్ క్యాంటీన్, జెపి రోడ్, భీమవరం-534 202. ప.గో.జిల్లా.
2) శ్రీ ఈశ్వరరావు విజ్జురోతి, తండ్రి/శ్రీ సీతా రాములు విజ్జురోతి, ఫ్లాట్ నెం.511, ది ల్యాండ్‌మార్క్ అపార్ట్‌మెంట్, రాయలం, భీమవరం-534 208.
3) శ్రీ ప్రతాప్ కొల్లి, తండ్రి సురేంద్ర బాబు కొల్లి, డి.నెం.49-3-102, గాంధీజీ కాలనీ, గుణదల, విజయవాడ, కృష్ణా జిల్లా -520004.
డియర్ సర్/మేడమ్,
రిఫరెన్స్: మెసర్స్ కాలా సీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా క్రెడిట్ సౌకర్యం లభిస్తుంది.
విషయం: సెక్యూరిటైజేషన్ మరియు ఫైనాన్షియల్ అసెట్స్ రీకన్‌స్ట్రక్షన్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్ -2002 (సర్ఫేసి చట్టం, 2002) లోని సెక్షన్ 13(2) క్రింద నోటీసు.

1) మేము **హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్,** బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ పరేల్, ముంబై-400 013లో రిజిష్టర్డు ఆఫీసును కలిగి ఉన్నాము మరియు ఇతర ప్రదేశాలలో దాని బ్రాంచ్ ఆఫీస్: 50-96-5, ఫ్లాట్ నెం.175, సీతమ్మధార, ఓల్డ్ ఎస్‌బిహెచ్ ఎదురుగా, విశాఖపట్నం - 530 013 వద్ద ఉంది, పైన పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 13(2) ప్రకారం, సర్ఫేసి చట్టం, 2002 &సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాలు, 2002 నిబంధనల ప్రకారం నియమించబడిన దాని అధీకృత అధికారి ద్వారా సెక్యూర్డ్ క్రెడిటర్ హోదాలో ఈ నోటీసును ఇందుమూలంగా జారీ చేస్తున్నాము.
2) మీ అభ్యర్థన మరియు సందర్భాల ఆధారంగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ (ఇకపై "బ్యాంక్" అని సూచిస్తారు) మీ ద్వారా ప్రాతినిధ్యం వహించే చిరునామాదారు నంబర్ 2 మరియు 3 దాని డైరెక్టర్లు/గ్యారంటర్లుగా (ఇకపై "రుణగ్రహీత" అని సూచిస్తారు) రూ.300 లక్షల క్రెడిట్/ఆర్థిక సౌకర్యాలను చిరునామాదారు నంబర్ 1కి మంజూరు చేసిన మంజూరు లేఖలను దయచేసి చూడండి. క్రెడిట్/ఆర్థిక సౌకర్యాలు తరువాత కాలానుగుణంగా పునరుద్ధరించబడ్డాయి (ఇకపై సమిష్టిగా "క్రెడిట్ సౌకర్యం/లు" అని పిలుస్తారు).
3) రుణగ్రహీతకు మంజూరు చేయబడిన క్రెడిట్ సౌకర్యాల వివరాలు బకాయిలతో పాటు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

క్ర.సం.	రుణ స్వభావం	లిమిట్	31.05.2025 నాటికి బాకీపడినవి
1	ODAP-MFRS (A/c 50200084181585)	300.00 Lakhs	3,13,92,557.73
	మొత్తం	300.00 Lakhs	3,13,92,557.73

4) మీరు చిరునామాదారు నెం.1 రుణగ్రహీతగా మీ చిరునామాదారు నెం.2 మరియు 3 ద్వారా డైరెక్టర్లు/హామీదారులుగా 2గా ప్రాతినిధ్యం వహిస్తున్నారు, పైన పేర్కొన్న ఆంక్షలయొక్క మీ సంబంధిత సామర్థ్యాలలో నిబంధనలు మరియు షరతులను అంగీకరించారు మరియు మీరు బ్యాంకుతో వివిధ ఒప్పందాలను కుదుర్చుకుని అమలు చేశారు, వడ్డీ, లిక్విడేటెడ్ నష్టాలు, రుసుములు, వేతనం, ఖర్చులు, ఛార్జీలు, ఖర్చులుమరియు ఇతర మొత్తాన్ని చెల్లించడానికి మరియు నిబంధనలు మరియు మంజూరు మరియు సౌకర్య పత్రాల ప్రకారం గడువు తేదీలలో అసలు మొత్తాన్ని తిరిగి చెల్లించడానికి కూడా అంగీకరిస్తున్నారు.
5) క్రెడిట్ సౌకర్యం యొక్క తిరిగిచెల్లింపుకు సంబంధించి మీ బాధ్యతల పనితీరు, వడ్డీ, లిక్విడేటెడ్ నష్టాలు, రుసుములు, పారితోషికం, ఖర్చులు, ఛార్జీలు, ఖర్చులు మరియు ఇతర డబ్బులు మరియు బ్యాంకుకు చెల్లించాల్సిన అన్ని ఇతర మొత్తాలు, మీరు చిరునామాదారుడు నం. 2 సృష్టించిన ఆస్తులను తనఖా పెట్టడం ద్వారా మరియు పైన పేర్కొన్న చిరునామాదారుడు నెం.1 నుండి 3 వరకు బ్యాంకు పేరున సృష్టించబడిన మీ షరతులు లేని మరియు మార్చలేని వ్యక్తిగత హామీల ద్వారా సురక్షితం చేయబడతాయి.
6) పైన పేర్కొన్న క్రెడిట్ సౌకర్యాలు స్థిరాస్తుల యొక్క సమానమైన తనఖాతో సహా, ఇక్కడ "షెడ్యూల్" (ఇకపై "షెడ్యూల్"గా సూచించబడతాయి)గా పేర్కొన్న ఆస్తులతో సహా సురక్షితం చేయబడతాయి.

షెడ్యూల్

అనుషంగిక సెక్యూరిటీ: స్థిరాస్తుల బ్యాంకుకు సంబంధిత యజమానులు ("తనఖాదారులు") టైటిల్ డీడ్‌లను డిపాజిట్ చేయడం ద్వారా ...

17) పైన పేర్కొన్న బకాయిల రికవరీ కోసం మాకు ఉన్న ఏవైనా ఇతర హక్కులు లేదా పరిష్కారాలను అలాగే మీరు చెల్లించాల్సిన మరియు చెల్లించాల్సిన మొత్తాలకు సంబంధించి మరిన్ని డిమాండ్లు చేసే మా హక్కును ఈ డిమాండ్ నోటీసు నుండి మినహాయించరాదని కూడా మేము మీకు సలహా ఇస్తున్నాము.
18) సెక్షన్ 13(4) కింద దాని చర్య ప్రక్రియలో బ్యాంక్ భరించే అన్ని ఖర్చు ఛార్జీలు, ఖర్చులు మరియు దానికి సంబంధించిన యాదృచ్ఛికమైనవి చట్టం కింద సూచించిన విధంగా మీ నుండి తిరిగి పొందవచ్చని దయచేసి గమనించండి.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ కోసం.
అధీకృత అధికారి
మరిన్ని వివరణలు మరియు కమ్యూనికేషన్ కోసం దయచేసి సంప్రదించండి: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్, డిపార్ట్‌మెంట్ ఫర్ స్పెషల్ ఆపరేషన్స్, 50-96-5, 2వ అంతస్తు, ఫ్లాట్ నెం.175, సీతమ్మధార, ఓల్డ్ ఎస్‌బిఐ ఎదురుగా, విశాఖపట్నం-530 013

లాంఛనప్రాయ స్వాధీనతా ప్రకటన

ICICI Bank — **బ్రాంచ్ ఆఫీసు:** ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రీ టవర్, బొమ్మనహల్లి హొసూర్ మెయిన్ రోడ్, బెంగళూరు-560068.

ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదవగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొన్న మొత్తంను తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ దిగువ పేర్కొన్న రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసులు జారీచేయబడినవి.
రుణగ్రహీత పొందిన బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ-పేర్కొన్న తేదీలలో సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదవదగిన సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలతో క్రింది సంతకందారు దిగువ వివరించిన ఆస్తిని లాంఛనప్రాయంగా స్వాధీనం చేసుకొన్నారు. ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, సదరు ఆస్తితో లావాదేవీలు జరపరాదని మరియు ఏదేని లావాదేవీలు జరుపదలచిన వారు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ వారికి చెల్లించుటకు లోబడి జరుపుకోవచ్చును.

క్ర. సం.	రుణగ్రహీత(ల) పేరు/ రుణ ఖాతా నెంబర్	ఆస్తి వివరణ/ లాంఛనప్రాయ స్వాధీనతా తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తం (రూ.)	బ్రాంచ్ పేరు
1.	చల్లగుల్ల రఘునాథ్ చౌదరి/ చల్లగుల్ల రోహిణి/ LBVJW00005987592/ LBVJW00006052054	అనుబంధం "ఏ" (సెక్యూర్డ్ ఆస్తి వివరాలు) షెడ్యూల్: కృష్ణా జిల్లా, పామర్రు సబ్-రిజిస్ట్రార్ ఆఫీసు, పామర్రు మండలం, రామర్రు గ్రామ పంచాయతీ ప్రాంతం, పామర్రు గ్రామం, పంచాయతీ ప్రాంతం, పామర్రు గ్రామం, పైన పేర్కొన్న విధంగా మాకు బదిలీ చేయబడింది మరియు స్వాధీనంలో ఉంది, ఈ రోజు మీకు అమ్మిన మరియు అప్పగించబడిన ఆస్తి, పామర్రు రీ సర్వే నెం.303-3ఎ ఎక 0.36 సెంట్లు, రీసర్వే నెం.303-3బి ఎక0.16 సెంట్లు, రీసర్వే నెం.303-4బి ఎక 1.23 సెంట్లు, రీసర్వే నెం.303-4సి ఎక 0.33 1/2 సెంట్లు, రీసర్వే నెం.304-1 ఎక 2.00 సెంట్లు, ఈ ఎక 0.33 సెంట్లు, రీసర్వే నెం.304-2 ఎక 1.81 సెంట్లు, మొత్తం ఏరియా ఈ 6 సర్వే నెంబర్లలోని 4.22 1/2 సెంట్లు, డోర్ నెం.1-132 శ్రీపురం ఎ.పి.సి.ఆర్.డి.ఎ, ఎల్.పి.నెం.32/2015/విజేఏ ప్లాన్, ఫ్లాట్ నెం.45 యొక్క 377.6 చ.గ.లు. స్థిరాస్తి ఖాళీ భూమి మరియు దాని సరిహద్దులు: 1వ ...	11.02.2025 Rs. 29,08,605.42/-	విజయవాడ

సిజెగా ప్రమాణ స్వీకారం చేస్తున్న జస్టిస్ ఎకె సింగ్

తెలంగాణ హైకోర్టు సిజెగా జస్టిస్ ఎకె సింగ్ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ ప్రమాణ స్వీకారం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని రాజ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సుజయ్ పాల్ కలకత్తా హైకోర్టుకు బదిలీ అయ్యారు. జస్టిస్ సింగ్ తెలంగాణ హైకోర్టుకు బదిలీ అయ్యే ముందు త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి ఛైర్మన్ గుత్త సుఖేందర్‌రెడ్డి, మంత్రులు, అధికారులు హాజరయ్యారు.

డిజిటల్ గ్రోత్ ఇంజన్లుగా నగరాలు

- ఐటెక్ సిటీలో ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ కార్యాలయం ప్రారంభం: మంత్రి లోకేష్

ప్రజాశక్తి - గన్నవరం (కృష్ణా జిల్లా)

రాష్ట్రంలోని ప్రతి నగరం డిజిటల్ గ్రోత్ ఇంజన్లుగా ఎదగాలని కోరుకుంటున్నామని విద్య, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. వైద్య సాంకేతికత, సేవల రంగంలో ప్రపంచ వ్యాప్తంగా పేరుగాంచిన ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ సంస్థ కృష్ణా జిల్లా గన్నవరం సమీపంలోని కేసరపల్లి మేధా హైటెక్ సిటీ భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ అంతర్జాతీయ ఐటి రంగంలో మన రాష్ట్రం ఎదుగుతున్న తీరుకు ఇది నిదర్శనంగా నిలుస్తోందన్నారు. కొద్ది మందితో ప్రారంభమైన ఈ సంస్థ ప్రస్తుతం 3500 మందికిపైగా ఉద్యోగులను కలిగి ఉందన్నారు. ఇది డిజిటల్ సాధికారతకు నాంది అని పేర్కొన్నారు. ప్రారంభ దశలోనే ఎక్లాట్ సంస్థ 300 ఉద్యోగాలు కల్పించడం సంతోషంగా ఉందన్నారు. ఏడాదిలో వెయ్యి ఉద్యోగాలకు విస్తరించాలనే లక్ష్యాన్ని పెట్టుకుందని తెలిపారు. విశాఖపట్నంను ప్రపంచ స్థాయి ఐటి కేంద్రంగా అభివద్ధి చేస్తామని, తిరుపతి, కాకినాడ, అనంతపురం, రాజమహేంద్రవరం, కర్నూలు, నెల్లూరు వంటి నగరాలు కూడా డిజిటల్ వద్ధికి హబ్‌లుగా మారాలని ఆకాంక్షించారు. ఆసియాలోనే మొదటి 156 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ అమరావతిలో ఏర్పాటవుతుందని తెలిపారు. ఉత్తరాంధ్రలో ఫార్మాను, గోదావరి జిల్లాల్లో ఆక్వాను అభివద్ధి చేస్తామని చెప్పారు. ఉత్తరాంధ్రకు ఇండియాలోనే అతిపెద్ద స్టీల్ కంపెనీ ఆర్సెల్లర్ మిట్టల్ రానుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ సంస్థ వ్యవస్థాపకులు, సిఇఒ కార్తీక్ పొల్సాని, సిఒఒ స్నేహ పొల్సాని, ఇండియా వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ గుర్రం, మోహిత్ శ్రీవాస్తవ, విజయవాడ బ్రాంచ్ డిజిఎం సురేష్ రెడ్డి, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, వర్ల కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

ఐటెక్ సిటీలో ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నారా లోకేష్

ఉపాధ్యాయులకు అంతర్ జిల్లాల బదిలీలు

- ఆప్టా డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయుల అంతర్ జిల్లాల బదిలీలకు అవకాశం కల్పించాలని ఎపి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రాష్ట్రంలో అనేక మంది ఉపాధ్యాయులు అంతర్ జిల్లాల బదిలీల కోసం ఎదురుచూస్తున్నారని సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎజిఎస్ గణపతిరావు, కె.ప్రకాశరావు శనివారం విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు లేఖ రాశారు. ఉపాధ్యాయుల బదిలీల కోసం చట్టం చేసి, ఉపాధ్యాయ సంఘాల సమన్వయంతో, సమర్థులైన అధికారులతో బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసినందుకు ప్రభుత్వానికి అభినందలు తెలిపారు.

స్పెషలిస్ట్ బ్యాటర్‌గా పంత్..?

నాల్గో టెస్ట్‌కు కీపింగ్ బాధ్యతల నుంచి దూరం

మాంచెస్టర్: నాల్గో టెస్ట్‌కు రిషబ్ పంత్‌ను స్పెషలిస్ట్ బ్యాటర్‌గా తుదిజట్టులోకి తీసుకునే అవకాశాల్ని జట్టు మేనేజ్‌మెంట్ పరిశీలిస్తోంది. మూడో టెస్ట్‌లో గాయపడ్డ పంత్.. కీపింగ్ బాధ్యతలకు దూరంగా ఉన్నా.. బ్యాటింగ్‌లో రాణించి 74పరుగులు చేశాడు. మరోవైపు పేసర్ జస్ప్రీత్ బుమ్రా విషయమై జట్టు మేనేజ్‌మెంట్ ఇప్పటికే గందరగోళంలో ఉండగా.. తాజాగా మరో తలనొప్పి తయారైంది. 4వ టెస్ట్ ప్రారంభానికి ముందు రిషబ్ పంత్‌ను ఏ విధంగా ఉపయోగించుకోవాలనే విషయమై జట్టు మేనేజ్‌మెంట్ మల్లగుల్లాలు పడుతోంది. లార్డ్స్ టెస్ట్‌లో అతని వేలికి తీవ్ర గాయం కావడంతో కీపింగ్ బాధ్యతలను ధృవ్ జురెల్ అందుకున్నాడు. కానీ రెండు ఇన్నింగ్స్‌లోనూ బ్యాటింగ్‌ను పంత్ మాత్రమే చేయాల్సి వచ్చింది. ముఖ్యంగా రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగి తీవ్ర ఇబ్బందులు పడ్డాడు. తొలి ఇన్నింగ్స్‌లో గాయంతోనే బ్యాటింగ్ చేస్తూ.. బంతి పలుమార్లు అతని వేలికి తగులుతుండడంతో ఫిజియోను పిలిచి చికిత్స తీసుకుంటూ మరీ అర్ధసెంచరీతో రాణించాడు. కానీ రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 9 పరుగులే చేసి పెవీలియన్‌కు చేరాడు. మూడో టెస్ట్‌ను మాత్రమే పరిగణనలోకి తీసుకోకుండా ఈ సిరీస్‌లో పంత్ అద్భుత ఫామ్‌లో ఉండడం భారత్‌కు కలిసొచ్చే అంశం. తొలి టెస్ట్ రెండు ఇన్నింగ్స్‌లోనూ సెంచరీతో రాణించిన పంత్... రెండో టెస్ట్ రెండో ఇన్నింగ్స్, మూడో టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లలో అర్ధసెంచరీ టీమిండియాను ఆదుకున్నాడు. దీంతో అతడిని రెగ్యులర్ బ్యాటర్‌గా తుది జట్టులోకి ఎంపిక చేస్తే ఎలా ఉంటుంది? అనే విషయమై జట్టు మేనేజ్‌మెంట్ యోచిస్తోంది. నాల్గో టెస్ట్ ప్రారంభం నాటికి అతడు 100% ఫిట్‌నెస్ సాధించడం కష్టమని సమాచారం. మరోవైపు పంత్ స్థానంలో జురెల్ కీపింగ్ బాధ్యతలను నిర్వర్తించినా.. అనుభవ రాహిత్యం అతనిలో స్పష్టంగా కనిపించింది. ఐసిసి నిబంధనల ప్రకారం తుది జట్టులో ఉన్న మరో ఆటగాడితో కీపింగ్ బాధ్యతలు అప్పగించాల్సి ఉన్నా.. తుదిజట్టులో లేని మరో ప్లేయర్‌కు రెగ్యులర్ వికెట్ కీపింగ్ బాధ్యతలకు ఆతిథ్యజట్టు అనుమతి ఇచ్చింది. అది ఒకరకంగా భారతజట్టుకు లభించిన అవకాశమే అయినా.. ఆ టెస్టులో టీమిండియా 22 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. దీంతో నాల్గో టెస్ట్‌కు అలాగే కొనసాగించడం కుదురదు కాబట్టి దీంతో రెగ్యులర్ వికెట్ కీపర్‌గా మరొకరిని తుదిజట్టులోకి ఎంపిక చేయాల్సి ఉంది.

అధ్యాపకుల వేధింపులు తట్టుకోలేక విద్యార్థిని ఆత్మహత్య

నోయిడా : అధ్యాపకుల వేధింపులు తట్టుకోలేక విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన గ్రేటర్ నోయిడాలో జరిగింది. పోలీసుల కథనం మేరకు .... నోయిడాలోని శారదా విశ్వవిద్యాలయంలో ఓ విద్యార్థిని బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సర్జన్ రెండో సంవత్సరం చదువుతుంది. గత శుక్రవారం రాత్రి ఆమె క్యాంపస్‌లోని బాలికల హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకోగా, తోటి విద్యార్థులు సమాచారం ఇవ్వడంతో వెంటనే సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. మతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. గదిలో ఒక సూసైడ్ నోట్ దొరికింది. అందులో డెంటల్ విభాగంలోని ఒక మహిళా లెక్చరర్, మరో అధ్యాపకుడు కలిసి విద్యార్థినిని మానసికంగా వేధించారని ఆమె ఆరోపించింది. వెంటనే ఆ ఇద్దరినీ పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు కొనసాగుతుంది. విద్యార్థిని ఆత్మహత్య యూనివర్సిటీలో సంచలనం రేపింది. నిందితులపై కఠినచర్యలు తీసుకోవాలంటూ ... అక్కడి విద్యార్థులు ఆందోళనకు దిగారు. పోలీసులు వారికి నచ్చచెప్పి నిరసనలను విరమింపజేశారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని నోయిడా పోలీసు అధికారి ఒకరు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడామని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

స్పీడ్ పోస్ట్‌లో పాస్ సర్టిఫికెట్లు

- సార్వత్రిక విద్యాపీఠం డైరెక్టర్ నరసింహారావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి సార్వత్రిక విద్యా పీఠం నిర్వహించిన ఎస్‌ఎస్‌ఇ, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులందరికీ స్పీడ్ పోస్ట్‌లో ఉత్తీర్ణత ధ్రువీకరణ పత్రాలు పంపిస్తామని సార్వత్రిక విద్యా పీఠం డైరెక్టర్ ఆర్.నరసింహారావు తెలిపారు. ఆన్‌లైన్ అడ్మిషన్ల సమయంలో అభ్యర్థులు సమర్పించిన చిరునామాలకు ఉత్తీర్ణత ధ్రువీకరణ, మైగ్రేషన్ కం ట్రాన్స్‌ఫర్ పత్రాలు పంపనున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల సౌకర్యార్థం ట్రాకింగ్, స్పీడ్ పోస్ట్ నెంబరు, ఉత్తీర్ణత ధ్రువీకరణ పత్రం పంపిన చిరునామా ఎపి ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ వివరాలను వెబ్‌సైట్ నుంచి పొందవచ్చన్నారు.

పవన్‌తో ఇది మూడో సినిమా : ఎఎం రత్నం

"హరి హర వీరమల్లు' సినిమా 17వ శతాబ్దం నేపథ్యంలో జరిగే కథ ఇది. బయట ప్రచారం జరుగుతున్నట్టుగా ఇది నిజ జీవిత కథ కాదు. ఓ కల్పిత పాత్రను తీసుకొని, దాని చుట్టూ కథ అల్లాము. వీరుడిని సూచించేలా వీరమల్లు అని పెట్టాము. నేను 'భారతీయుడు' సహా ఎన్నో భారీ చిత్రాలను నిర్మించా. నా సినీ జీవితంలో ఇంత సుదీర్ఘ ప్రయాణం చేసిన సినిమా ఇదే. దానికి ఎన్నో కారణాలున్నాయి. ఇది పవన్ కళ్యాణ్ డేట్స్ ఇచ్చినంత మాత్రాన వెంటనే పూర్తి చేయగలిగే సాధారణ చిత్రం కాదు. అత్యంత భారీ చిత్రం. సెట్స్, గ్రాఫిక్స్‌తో ముడిపడిన చారిత్రక కథ. అందుకే ఆలస్యమైంది. బాగా ఆలస్యమవవడంతో సినిమా ఎలా ఉంటుందోననే అనుమానాలు కొందరు వ్యక్తం చేశారు. అయితే ట్రైలర్‌తో అందరి అనుమానాలు పటాపంచలయ్యాయి. నేను నిర్మించిన సినిమాల్లో 90 శాతానికి పైగా విజయం సాధించాయి. ఆ అనుభవంతో చెప్తున్నా. 'హరి హర వీరమల్లు' ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. సినిమాని రెండు భాగాలుగా తెరకెక్కించాలని ముందే అనుకోలేదు. సినిమా అనేది వినోదంతో పాటు, సందేశాన్ని అందించాలనేది నా భావన. నేను రూపొందించిన ఎక్కువ శాతం సినిమాలు అలాగే ఉంటాయి. వీరమల్లు చారిత్రక నేపథ్యమున్న కథ. ఇలాంటి గొప్ప కథలో సందేశం ఉంటే.. ఎక్కువమందికి చేరువ అవుతుందని భావించాము. అలా చర్చల్లో కథ స్పాన్ పెరిగింది. ఈనెల 24న తెలుగు రాష్ట్రాల్లో ప్రీమియర్స్ నుంచి షోలు వేయాలని మేము భావించాం. కానీ అభిమానులు ముందురోజు రాత్రి నుంచే షోలు వేయాలని కోరుతున్నారు. వారి కోరిక మేరకు 23 రాత్రి నుంచి షోలు వేసే ఆలోచనలో ఉన్నాం.

ఖుషి, బంగారం తర్వాత పవన్ కళ్యాణ్‌తో నేను చేసిన మూడో చిత్రమిది. పేరుకి మూడు సినిమాలే కానీ.. మా మధ్య 25 సంవత్సరాల అనుబంధం ఉంది' అని నిర్మాత ఎఎం రత్నం చెప్పారు. మెగా సూర్య ప్రొడక్షన్ పతాకంపై ఎ. దయాకర్‌రావు భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కించారు. పవన్ కళ్యాణ్ సరసన నిధి అగర్వాల్ కథానాయిక. ఎ.ఎం. జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకులు. బాబీ డియోల్ ముఖ్య పాత్రలో నటించారు. సోమవారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించబోతున్నారు. ఈ సినిమాకు నిర్మాతగా వ్యవహరించిన ఎ.ఎం. రత్నం మీడియాతో పై విధంగా మాట్లాడారు.

'దేశం కోసం మనలో ఒక్కడు'ను ఆదరించాలి



'ఆపరేషన్ సిందూర్'లో మన దేశం కోసం వీరోచితంగా పోరాడి ప్రాణాలొడ్డిన మురళీ నాయక్ సాహసాన్ని స్ఫూర్తిగా తీసుకుని తెరకెక్కించిన చిత్రం "దేశం కోసం మనలో ఒక్కడు" అద్భుతంగా ఉందని ప్రముఖ నిర్మాతలు తుమ్మలపల్లి రామసత్యనారాయణ, డి.ఎస్ రావు, గిడుగు కాంతి కృష్ణ, గట్టు రామచంద్రరావు, అక్కినేని శ్రీధర్, ధీరజ అప్పాజీ, జూనియర్ రాజశేఖర్ అన్నారు. గోపివర్మ తెరకెక్కించిన ఈ ఇండిపెండెంట్ చిత్రాన్ని ప్రసాద్ (బాబి) నిర్మించారు. కోటేశ్వరరావు, రాజశేఖర్, కష్ణవేణి, నాగరాజు, శ్వేత, సింధు, నాగబాబు, జ్యోతి, రాజు తదితరులు నటించారు. ఈ చిత్రాన్ని హైద్రాబాద్ ప్రసాద్ ల్యాబ్‌లో శనివారం పలువురు ప్రముఖుల సమక్షంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ పెట్టిన పెట్టుబడిలో ఒక్క రూపాయి కూడా వెనక్కి వచ్చే అవకాశం లేదని తెలిసి కూడా, దేశం కోసం త్యాగం చేసిన మురళీ నాయక్‌పై అమితమైన ఆరాధనతో ఈ చిత్ర నిర్మాణానికి ముందుకొచ్చిన నిర్మాత ప్రసాద్, దర్శకుడు గోపివర్మలను అభినందించారు. గోపివర్మ మాట్లాడుతూ దేశం కోసం మనలో ఒక్కడు" సీక్వెల్ కూడా ప్లాన్ చేస్తున్నామని, తన దర్శకత్వంలో మొదలైన 'రాయలసీమ ప్రేమకథ' ఇప్పటికే రెండు షెడ్యూళ్లు పూర్తి చేసుకుందని వివరించారు. ఇంత గొప్ప చిత్రం నిర్మించే అవకాశం రావడం పట్ల నిర్మాత ప్రసాద్ (బాబి) సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఎడిటర్ ఎంఎన్‌ఆర్, సినిమాటోగ్రఫీ వెంకీ కనకాల, సంగీతం హర్ష ప్రవీణ్, నిర్మాత ప్రసాద్ (బాబి), కథ - స్క్రీన్ ప్లే - సంభాషణలు - దర్శకత్వం గోపివర్మ.

'రాజు గాని సవాల్' కోసం ఎదురు చూస్తున్నాం

డింపుల్ హయతి, రాశీసింగ్

"రాజు గాని సవాల్' మూవీ ట్రైలర్, సాంగ్స్ చాలా బాగున్నాయి. నేను కెరీర్ ప్రారంభించిన కొత్తలో కలిసిన సినిమా మీద ప్రేమ ఉన్న ముగ్గురు వ్యక్తులు బాపిరాజు, సునీల్ కుమార్‌రెడ్డి, రవీందర్‌రెడ్డిలు ఈ అమ్మాయి బాగుంటుందని నాకు మొదటి సినిమా అవకాశం ఇచ్చారు ఈ ముగ్గురు. బాపిరాజు గారు సినిమాను సినిమాను రూపొందించడమే కాదు ప్రేక్షకుల దగ్గరకు రీచ్ అయ్యేలా చేస్తారు. "రాజు గాని సవాల్' సినిమా సినిమా టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్ చెబుతున్నా. ఈ మూవీ రిలీజ్ కోసం నేనూ ఎదురుచూస్తున్నా' అని కథానాయికలు డింపుల్ హయతి, రాశీసింగ్ అన్నారు. లెలిజాల రవీందర్, రితికా చక్రవర్తి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రాజు గాని సవాల్'. ఈ చిత్రాన్ని లెలిజాల కమల ప్రజాపతి సమర్పణలో, ఎల్ఆర్ ప్రొడక్షన్ బ్యానర్‌పై లెలిజాల రవీందర్ నిర్మిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. రక్షా బంధన్ పండుగ సందర్భంగా ఆగస్టు 8న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ని కథానాయికలు డింపుల్ హయతి, రాశీ సింగ్ విడుదల చేసి మాట్లాడారు. తెలుగు ఫిలిం ఛాంబర్ అధ్యక్షులు భరత్ భూషణ్; నిర్మాతలు దామోదర ప్రసాద్, తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, ప్రసన్నకుమార్, గీత రచయిత గోరటి వెంకన్న, నటుడు డాక్టర్ భద్రం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

बैंक ऑफ महाराष्ट्र Bank of Maharashtra ONE FAMILY ONE BANK (A Government of India Undertaking)
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర
జోనల్ ఆఫీస్, విజయవాడ
1వ అంతస్థు, ఇన్ఫినిటీ ప్లాజా, డి.నెం.59ఎ-21-7/3, హై స్కూల్ రోడ్డు, పటమట, విజయవాడ, ఆం.ప్ర-520007. ఫోన్:0866-2431225. ఈ-మెయిల్:zmvijayawada@mahabank.co.in
AX76/Vijayawada/SARFAESI/2025-26 Date: 18/07/2025
(రూల్ 8 (1)) స్వాధీనత ప్రకటన
[illegible]
CERSAI ఐడి.: 200078354881
తేది : 18-07-2025 ప్రదేశం : విజయవాడ
సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, విజయవాడ జోన్.

बैंक ऑफ महाराष्ट्र Bank of Maharashtra ONE FAMILY ONE BANK (A Government of India Undertaking)
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర
జోనల్ ఆఫీస్, విజయవాడ
AX76/Vijayawada/SARFAESI/2025-26 Date: 18/07/2025
(రూల్ 8 (1)) స్వాధీనత ప్రకటన
[illegible]
CERSAI ఐడి.: 200043692545
తేది : 18-07-2025 ప్రదేశం : విజయవాడ
సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, విజయవాడ జోన్.

IDBI BANK
మచిలీపట్నం బ్రాంచ్, డి.నెం. 11/305-308, సి ఎస్టేట్, శివాలయం స్ట్రీట్, రాబర్ట్సన్‌పేట్, మచిలీపట్నం, ఆంధ్రప్రదేశ్-521001.
CIN: L65190MH2004GOI148838
అనుబంధం-IV (రూల్ 8(1))
స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)
[illegible]
అధీకృత అధికారి, ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్

यूनियन बैंक Union Bank of India
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ, 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎ.పి.-520001,
Email: arb.vijayawada@unionbankofindia.bank
అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
RULE 6 (2)/8 (6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002
ఋణగ్రహీతలు : 1) శ్రీ కణితి శివరామకృష్ణ, తండ్రి : కె వి వి డి ప్రసాద్, డి.నెం.6-10-16, ...
[illegible]
స్థలం : విజయవాడ, తేది : 15-07-2025
సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ IDFC FIRST Bank
CIN: L65110TN2014PLC097792
అనుబంధం IV (రూల్ 8(1))
స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)
[illegible]
షెడ్యూల్ వివరణ
[illegible]
తేది : 14.07.2025 ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి, ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్

यूनियन बैंक Union Bank of India
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ, 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎ.పి.-520001,
Email: arb.vijayawada@unionbankofindia.bank
అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
RULE 6 (2)/8 (6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002
[illegible]
స్థలం : విజయవాడ, తేది : 14-07-2025
సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

అమెరికా, ఇయు దేశాలకు
దేశ ప్రయోజనాల తాకట్టు

- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై సిపిఎం పొలిట్‌బ్యూరో ఆందోళన
- దేశ ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టవద్దని హితవు

న్యూఢిల్లీ : అమెరికా వంటి దేశాలతో, అలాగే యురోపియన్ యూనియన్‌తో ప్రభుత్వం వివిధ వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేయాలని భావిస్తున్నట్లు వార్తలు రావడంపై సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేసింది. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టిఎ)పై సంతకాలు చేయడానికి ముందుగా వివిధ పక్షాలను ప్రభుత్వం సంప్రదించాలి. ప్రభుత్వం ఇప్పటికే అమెరికా ఒత్తిడికి లొంగిపోయి మన ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలను యథేచ్ఛగా వారు దోపిడీ చేసుకునేందుకు వీలుగా తలుపులు బార్లా తెరుస్తోంది. వారితో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి ప్రభుత్వ తొందరపాటు డెయిరీ, వ్యవసాయం, రక్షణ, ఫార్మాస్యూటికల్, ఫైనాన్స్ వంటి కీలకమైన రంగాల్లో మన దేశ ప్రయోజనాలను వదులుకునేందుకు దారి తీస్తోంది. మన సార్వభౌమాధికారంపై రాజీ పడుతున్న, మన దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టేటువంటి అన్ని వాణిజ్య ఒప్పందాలను సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.

ప్రజా భద్రతపై మహారాష్ట్ర బిల్లును రద్దు చేయాలి

బిజెపి ప్రభుత్వం ఆమోదించిన మహారాష్ట్ర ప్రజా భద్రతా బిల్లు ప్రజల ప్రజాస్వామ్య హక్కులపై ప్రధానంగా దాడి చేస్తోంది. అతివాద వామపక్ష శక్తులతో పోరాటం పేరుతో అసమ్మతి వ్యక్తం చేసే వారందరినీ ప్రజా భద్రతకు, జాతీయ భద్రతకు ముప్పుగా పరిగణించాలని బిల్లు కోరుతోంది. ఈ బిల్లు ఉద్దేశ్యపూర్వకంగానే అతివాద వామపక్ష శక్తులు, అలాగే అటువంటి సంస్థల నిర్వచనాన్ని అస్పష్టంగా వదిలివేసింది. తద్వారా ఏ ప్రతిపక్షాన్నైనా లక్ష్యం చేసుకోవడానికి తగిన అవకాశాలు, పరిధిని సృష్టించుకుంది. అసమ్మతిని అణచివేయడానికి, రాజకీయ వ్యతిరేకత నోరు నొక్కడానికి గానూ ఈ బిల్లులోని కఠినమైన నిబంధనలను ఉపయోగించుకునేందుకు అన్ని రకాలుగా ముప్పు పొంచి వుంది. ఈ నిరంకుశ బిల్లును నిరసిస్తూ, తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేయాల్సిందిగా అన్ని రాజకీయ పార్టీలకు, ప్రజాస్వామ్య శక్తులకు సిపిఎం విజ్ఞప్తి చేస్తోంది.

జమ్మూ కాశ్మీర్‌లో ప్రజాతీర్పును గౌరవించండి

పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి భద్రతా వైఫల్యమేనని జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ ఇటీవల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అంగీకరించారు. కేంద్ర పాలిత ప్రాంతంగా జమ్మూ కాశ్మీర్‌ను ప్రత్యక్షంగా కేంద్రం పాలిస్తోంది. భద్రత, శాంతి భద్రతలకు సంబంధించిన చర్చలు, నిర్ణయాల్లో కూడా ప్రజలచే ఎన్నుకోబడిన ముఖ్యమంత్రిని పాల్గొననివ్వకుండా నిషేధించారు. భద్రతా వైఫల్యం జరిగిందని అంగీకరించడమంటే భద్రతకు నేరుగా బాధ్యత వహించే కేంద్ర హోం మంత్రి వైఫల్యమేనని అంగీకరించడమే కాగలదు. అటువంటి తీవ్రమైన లోపానికి ప్రభుత్వాన్ని జవాబుదారీ చేయాలి. సంబంధిత వ్యక్తులపై చర్యలు చేపట్టాలి.

ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వ పనితీరును లెఫ్టినెంట్ గవర్నర్ దెబ్బతీస్తున్నారు. ఫ్యూడల్ మహారాజాకి వ్యతిరేకంగా పోరాడి, ఆయన పాలన నుండి జమ్మూ కాశ్మీర్‌ను విముక్తి కల్పించడానికి కృషిచేసి అమరులైన 22మంది వీరుల త్యాగఫలానికి గుర్తుగా జరుపుకుంటున్న అమరవీరుల దినోత్సం నాటి శలవును కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పనిచేస్తున్న గవర్నర్ రద్దు చేశారు. అందుకు బదులుగా, రైతులను హతమార్చిని, విముక్తి పోరాటాన్ని అణచివేయడానికి ప్రయత్నించిన మహారాజా జయంతిని శలవు దినంగా ప్రకటించారు. ముఖ్యమంత్రితో సహా వివిధ రాజకీయ పార్టీల నేతలను అమరవీరులకు నివాళులు అర్పించడానికి అనుమతించలేదు. ప్రజాస్వామ్య హక్కులపై, ఫెడరల్ వ్యవస్థపై తీవ్రమైన దాడే ఇది. జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించేందుకు, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎన్నుకున్న ప్రజా తీర్పును గౌరవించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేస్తోంది.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న రైతులు (ఫైల్ ఫొటో)

బెంగాలీల తరలింపును ఆపాలి

బెంగాలీ మాట్లాడే వారిని లక్ష్యంగా చేసుకుని దాడులు జరుగుతున్నట్లు పలు రాష్ట్రాల నుండి వార్తలు వస్తున్నాయి. ఢిల్లీ, ఒరిస్సా, అస్సాం, హర్యానా, చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర వంటి పలు బిజెపి పాలిత రాష్ట్రాల్లో బెంగాలీలను గుర్తిస్తూ, వారిని బంగ్లాదేశీయులుగా ముద్ర వేస్తున్నారు. ఇదంతా ఎలాంటి సక్రమ ప్రక్రియను అనుసరించకుండానే, వారి పత్రాలను సక్రమంగా పరిశీలించకుండానే జరుగుతోంది. బెంగాలీ మాట్లాడే వారిని పోలీసులు నిర్బంధంలోకి తీసుకుని వారిపట్ల అమానుషంగా వ్యవహరిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారు. కొంతమందినైతే (భారత పౌరులతో సహా) బలవంతంగా భూ, సముద్ర మార్గాల ద్వారా బంగ్లాదేశ్‌కు పంపించేసిన సంఘటనలు కూడా వున్నాయి. బెంగాలీలపై దాడులను సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఎందుకంటే, భారత రాజ్యాంగం పౌరులందరికీ ప్రసాదించిన స్వేచ్ఛా కదలికల హక్కుకు వ్యతిరేకంగా ఈ దాడులు వున్నాయి. ప్రభుత్వం ఈ అక్రమ నిర్బంధాలను తక్షణమే విరమించి, ప్రజల హక్కులను పరిరక్షించాలని పార్టీ డిమాండ్ చేస్తోంది.

అస్సాంలో బహిష్కరణలు

అస్సాం ప్రభుత్వం పెద్దసంఖ్యలో ప్రజలను వారి హక్కుదారైన భూముల నుండి బహిష్కరిస్తోంది. ముఖ్యమంత్రి ఈ బహిష్కణల గురించి గొప్పగా చెప్పుకుంటున్నారు. పైగా సమాజంలో మతపరమైన చీలికలు తీసుకురావడానికి గానూ వీటిని ఉపయోగించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ భూముల కింద అత్యంత ఖరీదైన ఖనిజ వనరులు వున్నాయని ఇటీవల వార్తలు వచ్చాయి. ఆ వనరులను దోచుకోవడానికి ప్రైవేటు కార్పొరేషన్లను అనుమతించేందుకు చాలా ఆతృతంగా వున్నారు. బలవంతంగా ప్రజలను తరలించడానికి ఇది మరొక కారణంగా వుంది. ఈశాన్య రాష్ట్రాల మధ్య గల జాతిపరమైన విభేదాలను పెచ్చరిల్లేలా చేసి, వారిలో అభిప్రాయభేదాలు సృష్టించి, తమ ఆధిపత్యాన్ని నెలకొల్పుకునేందుకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు ప్రయత్నిస్తున్నాయి. ఈ ఎత్తుగడలు, చర్యలు మన దేశ ఐక్యతకు, సమగ్రతకు హాని కలిగిస్తాయి. ముఖ్యంగా సుదీర్ఘమైన అంతర్జాతీయ సరిహద్దును పంచుకుంటున్న ప్రాంతంలో ప్రమాదాన్ని తెస్తాయి.

రాజ్యాంగ పదవిని దుర్వినియోగం చేస్తున్న కేరళ గవర్నర్

ఆర్‌ఎస్‌ఎస్, దాని హిందూత్వ సిద్ధాంత భావజాలాన్ని పెంచి పోషించేందుకు కేరళ గవర్నర్ తన రాజ్యాంగ పదవిని దుర్వినియోగం చేస్తున్నారు. రాజ్‌భవన్ నిర్వహించే ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆయన ఉద్దేశ్యపూర్వకంగా అఖండ భారత్ మ్యాప్‌ను, భరతమాత చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. ఈ చిహ్నాలను రాజ్యాంగం గుర్తించలేదు. ఎన్నికైన ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ సలహాను ఆయన బహిరంగంగానే ధిక్కరిస్తున్నారు. రాజ్యాంగ ప్రమాణాలకు అనుగుణంగా అధికారిక కార్యక్రమాలను నిర్వహించడానికి తిరస్కరిస్తున్నారు. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం పరిరక్షించే లౌకికవాద విలువలను దెబ్బతీసేందుకు తన చర్యల ద్వారా, ఆయన ఆర్‌ఎస్‌ఎస్‌ను, దాని అనుబంధ సంఘాలను క్రియాశీలంగా ప్రోత్సహిస్తున్నారు. గవర్నర్ చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ కేరళలో వివిధ వర్గాలకు చెందిన ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు వివిధ ప్రదర్శనలను, నిరసనలను చేపట్టడాన్ని సిపిఎం అభినందించింది.

గవర్నర్ల అధికారాలపై సుప్రీం తీర్పు ఇచ్చిన నేపథ్యంలో సుప్రీంకోర్టులో తాము వేసిన పిటిషన్లను ఉపసంహరించుకోవడానికి కేరళ ప్రభుత్వాన్ని అనుమతించడానికి కేంద్ర ప్రభుత్వం తిరస్కరిస్తోంది. సుప్రీం కోర్టు రూలింగ్ కేవలం తమిళనాడుకే పరిమితం కాకుండా, అన్ని రాష్ట్రాలకూ వర్తించనున్నందున కేరళ వేసిన పిటిషన్లు ఇప్పుడు నిష్ఫలంగా మారాయి. ఈ వ్యాజ్యాన్ని సుదీర్ఘంగా కొనసాగిస్తూ, యూనివర్శిటీలకు రెగ్యులర్ వైస్ ఛాన్సలర్లు లేకుండా చేయాలన్నది గవర్నర్, కేంద్ర ప్రభుత్వం ఉద్దేశ్యంగా వుంది. సక్రమ ప్రక్రియను చేపట్టడం ద్వారా వైస్ ఛాన్సలర్లను నియమించాల్సి వుంది. రెగ్యులర్ విసిలను నియమించడంలో విఫలమైనందుకు గవర్నర్‌ను కేరళ హైకోర్టు కూడా విమర్శించింది. కేరళ ఉన్నత విద్యా వ్యవస్థను అపఖ్యాతి పాల్జేసి, నాశనం చేసేందుకు ఉద్దేశ్యపూర్వకంగానే ఒక ప్రయత్నం జరుగుతోంది. కేరళలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం సజావుగా పనిచేయకుండా అడ్డుకునేందుకు చేసే ఇటువంటి ప్రయత్నాలను సహించేది లేదు. కేరళ ప్రజల ప్రయోజనాల కోసం సిపిఎం, దాని మిత్రపక్షాలు నిరంతరాయంగా కృషి చేస్తాయి. బిజెపి కుట్రలను బహిర్గతం చేస్తాయి.

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో రానున్న కీలకమైన బిల్లులు

గనులు, ఖనిజాలు (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లుతో పాటూ అణు ఇంధన చట్టాన్ని, అణు నష్టానికి పౌర బాధ్యత చట్టాన్ని సవరించే బిల్లులను పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో సభలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోందని వార్తలు వస్తున్నాయి. దేశంలోని కీలకమైన ఖనిజ వనరులును ప్రైవేటు, విదేశీ సంస్థలు దోపిడీ చేసేందుకు అనుమతించడానికి గనులు, ఖనిజాల చట్టం సవరణ ఉద్దేశించబడింది. అలాగే కీలకమైన అణు శక్తి రంగంలోకి అమెరికా, ఇతర విదేశీ కార్పొరేషన్లు ప్రవేశించడానికి గల అడ్డంకులు, అవరోధాలన్నింటినీ తొలగించేందుకు అణు ఇంధన చట్టం, అణు నష్టాలకు పౌర బాధ్యత చట్టాల సవరణలు నిర్దేశించబడ్డాయి.

ఈ బిల్లులకు వ్యతిరేకంగా ఓటు వేసేందుకు పార్లమెంట్‌లోని ఇతర ప్రతిపక్ష పార్టీలను సమీకరించడానికి సిపిఎం ప్రయత్నిస్తుంది. మనదేశ ప్రయోజనాలకు వ్యతిరేకమైన, ఈ ప్రజా వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ పార్టీ ప్రజల్లో ప్రచారం చేస్తుంది, వారిని సమీకరిస్తుంది.

కార్మికవర్గానికి జేజేలు

పది కేంద్ర కార్మిక సంఘాలు, అఖిల భారత స్థాయిలో వివిధ సమాఖ్యలు పిలుపిచ్చిన సార్వత్రిక సమ్మె బ్రహ్మాండమైన విజయాన్ని సాధించింది. రైతులు, వ్యవసాయ కార్మికులు వారి వారి సంఘాల నేతృత్వంలో ఈ నిరసనల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసినందుకు కార్మికులను, ఇతర శ్రామిక వర్గాలను సిపిఎం అభినందిస్తోంది. రాబోయే పోరాటాలన్నింటిలో వారికి సంఘీభావంగా వుంటామని పునరుద్ఘాటించింది.

కేంద్ర కమిటీ సమావేశం

కేంద్ర కమిటీ తదుపరి సమావేశం న్యూఢిల్లీలో సెప్టెంబరు 13-15 తేదీల్లో జరగనుంది. ఇతర ఎజెండాతో పాటూ బీహార్‌లో ఇతర రాష్ట్రాల్లో రానున్న ఎన్నికల్లో పార్టీ ఎన్నికల సన్నాహాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.

రాజ్యసభ ముందుకు 13 బిల్లులు

- వీటిలో 8 కొత్తవి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో రాజ్యసభ ముందుకు 13 బిల్లులు ఆమోదం కోసం రానున్నాయి. ఈ జాబితాను రాజ్యసభ సెక్రటేరియట్ శనివారం విడుదల చేసింది. 13 బిల్లుల్లో 8 బిల్లులు కొత్తవి. మిగిలినవి ఇప్పటికే లోక్‌సభ ఆమోదించిన బిల్లులు, లేదా దిగువ సభలో ప్రవేశపెట్టిన బిల్లులు. సరుకు రవాణా బిల్లులు, సముద్రం ద్వారా వస్తువులను రవాణా చేసే బిల్లు, కోస్టల్ షిప్పింగ్ బిల్లులను ఇదివరకే లోక్‌సభ ఆమోదించింది. వీటిని ఇప్పుడు రాజ్యసభలో ఆమోదం కోసం జాబితాలో చేర్చారు. అలాగే గోవా రాష్ట్ర అసెంబ్లీ నియోజకవర్గాలలో షెడ్యూల్డ్ తెగల ప్రాతినిధ్య పునర్వ్యవస్థీకరణ బిల్లు, ఆదాయపు పన్ను బిల్లులను లోక్‌సభలో ఇప్పటికే ప్రవేశపెట్టారు.. ఆ బిల్లులను కూడా వర్షాకాల సమావేశాల్లో రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. కొత్త బిల్లులు.. 1. మణిపూర్ వస్తువులు, సేవల పన్ను సవరణ బిల్లు, 2. జన్ విశ్వాస్ నిబంధనల సరవణ బిల్లు, 3. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సరవణ బిల్లు, 4. పన్ను చట్టాల సవరణ బిల్లు, 5. జియోహెరిటేజ్ సైట్స్, జియో రెలిక్స్ సంరక్షణ, నిర్వహణ బిల్లు 6. గనులు, ఖనిజాభివృద్ధి, నియంత్రణ సవరణ బిల్లు, 7. నేషనల్ స్పోర్ట్స్ గవర్నెన్స్ బిల్లు, 8. జాతీయ డోపింగ్ నిరోధక సవరణ బిల్లు.

రాహుల్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

- జాన్ బ్రిట్టాస్

న్యూఢిల్లీ : ఆర్‌ఎస్‌ఎస్‌ను, సిపిఎంను ఒకే గాటున కట్టి కాంగ్రెస్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గత శుక్రవారం కేరళలో చేసిన వ్యాఖ్యలపై సిపిఐ(ఎం) రాజ్యసభ ఎంపి జాన్ బ్రిట్టాస్ తీవ్రంగా స్పందించారు. రాహుల్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని, అవాస్తవాలు అని ఆయన తిప్పికొట్టారు. లోక్‌సభ ప్రతిపక్షనేతగా రాహుల్ ఏకైక లక్ష్యం లౌకిక శక్తులను ఏకం చేసేదిగా ఉండాలే కానీ..వారిమధ్య గందరగోళం, విభజన సృష్టించేలా ఉండరాదని బ్రిట్టాస్ హితవు పలికారు. అయితే రాహుల్ వ్యాఖ్యలు పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ప్రతిపక్షాల ఐక్యతపై ప్రభావితం చేయబోవని శనివారం నాడు పిటిఐ వార్తా సంస్థ ప్రతినిధితో బ్రిట్టాస్ పేర్కొన్నారు. 'కేరళకు వెళ్లినప్పుడల్లా ఇలాంటి చెత్త మాటలు మాట్లాడే ప్రవృత్తి రాహుల్‌కు ఉంది. దానికి కేరళ కాంగ్రెస్ పార్టీ బాధ్యత వహిస్తుందని భావిస్తున్నాం.

ఆర్‌ఎస్‌ఎస్‌ను ఎదుర్కోవడానికి ఆయన కేరళను యుద్ధభూమిగా ఎంచుకున్నారు. అయితే వాస్తవానికి అక్కడ వామపక్షాలు, కాంగ్రెస్ మధ్యనే పోరాటం' అని బ్రిట్టాస్ అన్నారు. ప్రతిపక్షనేతగా ఉన్న రాహుల్‌గాంధీ లాంటి నేతలు లౌకిక పార్టీల శ్రేణుల మధ్య గందరగోళం, విభజన సృష్టించడం కంటే లౌకిక శక్తులను ఏకం చేయడమే ఏకైక లక్ష్యంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. 'బిజెపిని అధికారం నుండి దూరంగా ఉంచడానికి మేము 2004లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చాము. కాంగ్రెస్ ఊగిసలాటలు దేశానికి ఎంత భారీ నష్టాన్ని కలిగించిందో మనకు తెలుసు. రామజన్మభూమి ఉద్యమాన్ని వారు ఎలా ఎదుర్కొన్నారు? బాబ్రీ మసీదు తాళాలు ఎలా తెరిచారు? దాని కూల్చివేతకు కాంగ్రెస్ ఎలా అధ్యక్షత వహించిందో మనందరికీ తెలుసు. కాబట్టి లౌకిక శక్తుల మధ్య విభజనను సృష్టించే అంశాలను తీసుకురాకూడదు. ఇప్పుడు ప్రతిపక్షనేతగా రాహుల్‌గాంధీ బిజెపిపై దృష్టి కేంద్రీకరించేలా చూసుకోవాల్సిన బాధ్యత ఆయనపై ఉంది' అని బ్రిట్టాస్ గుర్తు చేశారు. రాబోయే వర్షాకాల సమావేశంలో గాంధీ వ్యాఖ్యలు ప్రతిపక్షాల ఐక్యతపై ప్రభావితం చేస్తుందా అని బ్రిట్టాస్‌ని ప్రశ్నించగా.. 'ఈ సమస్యల్ని మేము అధిగమిస్తామని విశ్వసిస్తున్నాం. కానీ రాహుల్ వంటి నేతలు మరింత పరిణతితో, బాధ్యతాయుతంగా ఉంటారని ఆశిస్తున్నాం. పార్లమెంటులో ప్రతిపక్షాల ఐక్యతకు మేము మద్దతిస్తాం' అని అన్నారు. కేరళలోని కాంగ్రెస్ పార్టీ రాహుల్‌గాంధీని రాజకీయంగా అమాయకంగా ఉంచాలని నిశ్చయించుకున్నట్లు కనిపిస్తోందని బ్రిట్టాస్ ఎద్దేవా చేశారు.

రాజ్యాంగాన్ని చంపేస్తున్న మోడీ

- కాంగ్రెస్ అధ్యక్షులు ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : భారత రాజ్యాంగాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హత్య చేస్తున్నారని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు గుప్పించారు. అయితే, ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నాయని, దేశ ప్రజలు వాటి ప్రయత్నాలను సాగనివ్వరని ఆయన చెప్పారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శనివారం మైసూర్‌లోని మహారాజా కళాశాల మైదానంలో 'సాధన సమావేశ' పేరుతో శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఖర్గే ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఒక్క మైసూరులో రూ.2,500 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి ప్రాజెక్టులు చేపడుతున్నట్లు తెలిపారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని నీరుగార్చేందుకు లేదా తిరగరాసేందుకు బిజెపి పదేపదే ప్రయత్నిస్తోన్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండి ఆ ప్రయత్నాలను అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. దేశ ప్రజలకు ఇచ్చిన హామీల్లో వేటినీ ప్రధాని మోడీ నిలబెట్టుకోలేకపోయారని విమర్శించారు. ప్రతి ఒక్కరికీ రూ.15 లక్షలు ఇస్తామన్న హామీని కానీ, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల కల్పన కానీ, రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామన్న హామీని కానీ ఇలా..ప్రతి హామీని నెరవేర్చకుండా పూర్తిగా విఫలమయ్యారని ఖర్గే విమర్శించారు. బిజెపి ఒట్టి గొప్పలు ప్రచారం చేసుకుంటుందే తప్ప చేతల్లో ఏమీ ఉండదన్నారు. దేశంలో ఒక్క శాతంగా ఉన్న జనాభాయే మొత్తం దేశ సంపదలో 40 శాతాన్ని తమ గుప్పిట్లో ఉంచుకున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అట్టడుగున ఉన్న 50 శాతం జనాభా నియంత్రణలో కేవలం 6.4 శాతం మాత్రమే సంపద ఉంటుందోని తెలిపారు. దేశంలో పేదల సంఖ్య క్రమేపి పెరిగిపోతోందని బిజెపి నేత నితిన్ గడ్కరియే వెల్లడించారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రధానిమోడీ ప్రపంచంలో 42 దేశాలను సందర్శించారు. కానీ.. సంఘర్షణలతో అట్టుడుకుతున్న మణిపూర్‌ను మాత్రం ఇప్పటివరకు ఆయన సందర్శించలేదు' అని ఖర్గే విమర్శించారు. ఈ సభలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్, ఇతర మంత్రులు పాల్గొన్నారు.

15కల్లా రాష్ట్ర సచివాలయం ప్లాస్టిక్ రహితం

(మొదటి పేజీ తరువాయి)

నీటిని వెంకన్న చెంతకు తీసుకొస్తామని తెలిపారు. చిత్తూరు జిల్లా రుణం తీర్చుకుంటానన్నారు.

పేద పిల్లలకు కుటుంబ పెద్దగా ఉంటా

పేద పిల్లలకు కుటుంబ పెద్దలా తాను అండగా ఉంటానని చంద్రబాబు అన్నారు. ప్రజావేదిక సభలో పి-4 కార్యక్రమంపై ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 15 లక్షల నుంచి 20 లక్షల పేద కుటుంబాలను ఆర్థికంగా పైకితీసుకురావాలన్న సంకల్పంతో ముందుకెళ్తున్నామన్నారు. 2029 నాటికి పేదరికంలేని రాష్ట్రంగా ఆవిష్కృతం కావాలన్నది తన ఆశయమని తెలిపారు. పిల్లలకు అవకాశం కల్పించే బాధ్యత తనదని, పైకొచ్చే బాధ్యత వారిదని అన్నారు. శుక్రవారం 40 మంది పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యానని, వారు వేల కుటుంబాలను దత్తత తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

బంగారు కుటుంబాలతో...

బంగారు కుటుంబానికి ఎంపికైన డి.వినూత మాట్లాడుతూ తాను ఇంటర్‌లో బైపిసి 986 మార్కులతో పాసయ్యానని, తాము తల్లిదండ్రులను కోల్పోయామని, తాను మెడిసిన్, చెల్లి, తమ్ముడు సివిల్స్ చేయాలనేది తమ కోరికని తెలిపారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ రాజేంద్రశెట్టి మాట్లాడుతూ తమ క్లబ్ తరపున ఈ బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. మరో బంగారు కుటుంబం ఈశ్వరి మాట్లాడుతూ 2019లో తన భర్త చనిపోయారని, ఇద్దరు పిల్లలని, వారిని చదివించాలని కోరారు. రాస్ విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాస్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఈశ్వరికి బ్యూటీషియన్ కోర్సు అందించి ఆర్థికంగా బలపడేందుకు అవకాశం కల్పిస్తామని, ఇద్దరు పిల్లలను సంస్థ ద్వారా చదివిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారాయణ, ఎంఎల్‌ఎలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డి, గాలి భాను ప్రకాష్, థామస్, డాక్టర్ పి.మురళిమోహన్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు, కమిషనర్ మౌర్య తదితరులు పాల్గొన్నారు.

గాజాలోఆహార పంపిణీ, సహాయక శిబిరాలపై
ఇజ్రాయిల్ అమానవీయ దాడులు

- 100 మంది పైగా మృతి

గాజా : యుద్ధోన్మాద ఇజ్రాయిల్ గాజాలో అమానవీయ దాడులను కొనసాగిస్తూనేవుంది. అంతర్జాతీయ సమాజ దాతృత్వంతో ఏర్పాటు చేసిన ఆహార పంపిణీ కేంద్రాలను, సహాయక శిబిరాలను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయిల్ సైనిక బలగాలు శనివారం భీకర దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో 104 మంది పైగా పాలస్తీనియన్లు మృతి చెందారు. వందలాది మంది గాయపడ్డారు. వీరిలో రఫాలో ఆహారం కోసం నిల్చున్నవారిలో 37 మంది మృతి చెందారు. వేలాది మంది పాలస్తీనియన్లు గాజాలో ఆకలితో అలమటిస్తున్నారని ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యుఎఫ్‌పి) తెలిపింది. ఇదిలా ఉండగా కాల్పుల విరమణ ప్రతిపాదనకు హమాస్ ప్రతిపాదించగా.. ఇజ్రాయిల్ తిరస్కరించింది. కాగా, ఇప్పటివరకు ఇజ్రాయిల్ దాడుల్లో.. 58,765 మంది మృతి చెందారు. 140,485 మంది గాయాలపాలయ్యారు. అనధికారంగా చాలా మందే చనిపోయారు.

ఇజ్రాయిల్ దాడుల్లో గాయపడిన చిన్నారిని వైద్యశిబిరానికి తీసుకువెళ్తున్న బంధువులు

అక్టోబరు 1 నుండి అమల్లోకి

- ఇయు దేశాలతో భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై పీయూష్ గోయల్

ముంబయి : యురోపియన్ యూనియన్‌లోని నాలుగు దేశాలకు, భారత్‌కు మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అక్టోబరు 1 నుండి అమలు జరగనుందని వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ శనివారం తెలిపారు. గతేడాది మార్చి 10న ఉభయ పక్షాలు వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (టిఇపిఎ)పై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం కింద రాబోయే 15 ఏళ్ళలో భారత్‌లో వంద బిలియన్ల డాలర్ల మేరకు పెట్టుబడులకు హామీ కల్పించారు. ఈ పెట్టుబడులతో భారత్‌లో పది లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు కల్పించేవీలుందని ఆయన చెప్పుకొచ్చారు. అలాగే స్విస్‌వాచ్‌లు, చాకొలెట్లు, పాలిష్ చేసిన వజ్రాలతో సహా పలు ఉత్పత్తులను అతి తక్కువ లేదా జీరో సుంకాలతో అనుమతిస్తారు. ఈ మేరకు గోయల్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. యురోపియన్ స్వేచ్ఛా వాణిజ్య అసోసియేషన్ (ఇఎఫ్‌టిఎ)లో ఐస్‌ల్యాండ్, లిచెన్‌స్టెయిన్, నార్వే, స్విట్జర్లాండ్ సభ్య దేశాలుగా వున్నాయి. ఒప్పందం అమల్లోకి వచ్చిన తర్వాత పదేళ్ళలోగా 50 బిలియన్ల డాలర్లు, ఆ తదుపరి ఐదేళ్ళలో మరో 50 బిలియన్ల డాలర్లు పెట్టుబడులు పెట్టనున్నట్లు ఇఎఫ్‌టిఎ ప్రకటించింది. దేశ ప్రజల ప్రయోజనాలను స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు దెబ్బతీస్తాయని ప్రజలు పదేపదే ఆందోళనలు వ్యక్తం చేస్తూవచ్చారు. అయితే ప్రజల ఆందోళనలను పెడచెవిన పెట్టిన మోడీ సర్కార్ ఒప్పందాల అమలుకు సంసిద్ధమవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఒడిస్సాలో మరో దారుణం

- బాలికకు నిప్పంటించిన దుండగులు

భువనేశ్వర్ : బిజెపి పాలిత ఒరిస్సాలో మహిళలకు, ఆడబిడ్డలకు రక్షణ లేకుండా పోతోంది. లెక్చరర్ వేధింపులకు బలైపోయిన బిఇడి విద్యార్థి ఘటన ఇంకా మరవకముందే మరో దారుణం చోటుచేసుకుంది. స్నేహితురాలి ఇంటికి వెళుతున్న 15 ఏళ్ళ బాలికపై గుర్తు తెలియని ముగ్గురు దుండగులు శనివారం ఉదయం దాడి చేసి ఆమెకు నిప్పంటించారు. ఒరిస్సాలోని పూరీ జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను పూరీ ఆస్పత్రికి తరలించారు, అక్కడ నుండి వెంటనే భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌కు తీసుకెళ్ళారు. దాదాపు 70 శాతం ఆమెకు శరీరం కాలిందని ఆస్పత్రి వర్గాలు చెప్పాయి. ఉదయం 8.30గంటల సమయంలో సాయం కోసం ఆమె అరుపులు, ఆక్రందనలు విని స్థానికులు పరుగున వచ్చి ఆమెను ఆస్పత్రికి తరలించారు. మోటార్‌సైకిల్ వచ్చిన దుండగులు నిర్జనంగా వున్న ప్రాంతంలో ఆమెను అటకాయించి, ముఖానికి చేతిరుమాలును కట్టేసి, వంటిపై ద్రావణం పోసి, అంటించి వెళ్ళిపోయారని తెలుస్తోంది. దాడి ఎందుకు చేశారన్నది ఇంకా తెలియరాలేదు. కాగా సంఘటనా స్థలంలో సాక్ష్యాధారాలను దర్యాప్తు బృందం సేకరించింది. దర్యాప్తు ప్రారంభమైందని అధికారులు తెలిపారు. బాధితురాలి పరిస్థితి మెరుగుపడితే ఆమె నుండి సాక్ష్యం తీసుకుంటామని చెప్పారు. ఈ సంఘటనపై ఒరిస్సా డిప్యూటీ సిఎం పార్వతి పరిదా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బాలాసోర్‌లోని ప్రభుత్వ కాలేజీలో ప్రొఫెసర్ వేధింపులు భరించలేక ఒక విద్యార్థిని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. డబుల్ సర్కార్‌తో అభివృద్ధి పరుగులు పెట్టిస్తామంటున్న బిజెపి నేతలు..ఆ పని చేయకపోగా నేరాల విషయంలోనే వృద్ధి సాధిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

క్యూబాకు సంఘీభావంగా ఫుట్‌బాల్ టోర్నీ

- ఢిల్లీలో ఆగస్టు 2-3, 9-10 తేదీల్లో నిర్వహణ

న్యూఢిల్లీ : కమ్యూనిస్టు క్యూబా విప్లవ యోధుడు ఫిడెల్ కాస్ట్రో జయంతి సందర్భంగా క్యూబా సంఘీభావ జాతీయ కమిటీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పలు కార్యాక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా న్యూఢిల్లీలో ఆగస్టు 2, 3 తేదీల్లోనూ, ఆ తర్వాత 9, 10 తేదీల్లో ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. క్రీడల పట్ల అమితాసక్తి ఉన్న కాస్ట్రోకు ఆగస్టు 13న ఆయన జయంతి సందర్భంగా ఘన నివాళిగా ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. అర్జెంటీనా దిగ్గజ ఫుట్‌బాల్ ఆటగాడు డిగో మారడోనా, కాస్ట్రో మధ్య స్నేహం మరచిపోలేనిది. క్యూబాలో విద్య, ఆరోగ్యం, వైద్యం, క్రీడలు మరియు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు అందరికీ అందుబాటులో ఉండేలా కాస్ట్రో చూశారు. ఆ కార్యక్రమాలను ప్రస్తుత క్యూబా ప్రభుత్వం కూడా కొనసాగిస్తోంది. దీని కారణంగానే అంతర్జాతీయ క్రీడలైన బేస్‌బాల్, బాక్సింగ్, అథ్లెటిక్స్ విభాగాల్లో క్యూబాకు ఎక్కువగా పతకాలు దక్కుతూ వస్తున్నాయి. గత ఆరు దశాబ్దాలుగా క్యూబాపై అమెరికా తీవ్ర ఆర్థిక ఆంక్షలను విధిస్తున్నా.. చెక్కు చెదరని ఆత్మవిశ్వాసంతో క్యూబా క్రీడల్లో రాణించడం ఆదర్శనీయం. కాస్ట్రో గౌరవార్థం, క్యూబాకు సంఘీభావంగా ఈ ఫుట్‌బాల్ టోర్నమెంట్ జరగనుండగా.. పలువురు స్టార్ ఫుట్‌బాల్ ఆటగాళ్లు ఈ టోర్నీలో ఆడనున్నారు. టోర్నమెంటులో భాగస్వాములు కావాల్సినవారు.. ఈ నెల 24వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కమిటీ సూచింది. ఇతర వివరాలకు 9650982691(అర్ణవ్), 9953485424(విజయన్), 9540039267(సుబీర్) సంప్రదించాలని పేర్కొంది.

లిక్కర్ కేసులో వైసిపి ఎంపి మిథున్‌రెడ్డి అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

రాబట్టారు? మద్య వర్తుల పాత్ర, మొత్తం మీద అంతిమ లబ్ధిదారుడు ఎవరు? అనే అంశాలపై దర్యాప్తు అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించినట్లు సమాచారం. లిక్కర్ అంశాల గురించి ఎక్కడెక్కడ సిట్టింగ్‌లు జరిగాయి? లిక్కర్ కుంభకోణం ఎవరి సూచనలతో చేయాల్సి వచ్చింది? ఈ స్కామ్‌లో అంతిమ లబ్ధిదారునికి ఎంత మొత్తంలో చేరిందనే విషయాలపై పలు దఫాలుగా ప్రశ్నించినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి సుమారు 50 ప్రశ్నలు వరకు అటూ ఇటూ తిప్పి సిట్ అధికారులు అడిగి వివరాలు రాబట్టేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. కొన్ని ప్రశ్నలకు అరకొరగా సమాధానంచెప్పినట్లు, మరి కొన్ని ప్రశ్నలకు తనకు తెలియదని సమాధానం చెప్పినట్లు తెలిసింది. అంతే కాకుండా ఈ విషయంతో తనకు సంబంధం లేక పోయినా రాజకీయ కక్షతో ఉద్దేశ్యపూర్వకంగా తనను కేసులో ఇరికించినట్లు మిథున్‌రెడ్డి దర్యాప్తు అధికారులతో అన్నట్లు సమాచారం.

ప్రిలిమనరీ చార్జిషీట్ దాఖలు :

వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన లిక్కర్ కుంభకోణం కేసుపై సిట్ దర్యాప్తు అధికారులు 300 పేజీలతో చార్జిషీట్‌ను శనివారం సాయంత్రం ఎసిబి కోర్టు జడ్జి ఇంటికి తీసుకెళ్ళి సమర్పించినట్లు సమాచారం. చార్జిషీట్‌తో పాటు వందకు పైగా ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికలు, ఎలక్ట్రానిక్ పరికరాలను కూడా జత చేసినట్లు తెలిసింది. ఈ కేసులో ఇప్పటి వరకు రూ.62కోట్లు సీజ్ చేసినట్లు అధికారులుపేర్కొన్నారు. 268 మంది సా క్షులను విచారించినట్లు చార్జిషీట్‌లో తెలిపారు. మద్యం ముడుపుల కేసులో షెల్ కంపెనీల ద్వారా రావడం, బ్లాక్‌ను వైట్‌గా మార్చడం, ఇప్పటి వరకు దర్యాప్తులో సేకరించిన సమాచారంతో పాటు స్వాధీనం చేసుకున్న పలు పత్రాలను కూడా జడ్జి ముందు ప్రవేశపెట్టినట్లు తెలిసింది. మరో 20 రోజుల్లో పూర్తి స్థాయి చార్జిషీట్ దాఖలు చేస్తామని సిట్ అధికారులు పేర్కొంటున్నారు

కేసులకు భయపడేదిలేదు : మిథున్‌రెడ్డి

అంతకు ముందు గన్నవరం విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడిన మిథున్ రెడ్డి టిడిపి కూటమి ప్రభుత్వం పథకం ప్రకారం తనను ఉద్దేశ్యపూర్వకంగా అక్రమ కేసులు పెడుతోందని అన్నారు. అక్రమ కేసులకు భయపడేది లేదని, కేసులను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటామన్నారు. ఈ కేసులన్నీ కోర్టులో నిలబడవన్నారు. సిట్ విచారణకు వెళ్లేముందు శనివారం గన్నవరం విమానాశ్రయం వద్ద మీడియాతో ఆయన మాట్లాడారు.

కుబేర..@ నెల్లూరు!

(మొదటి పేజీ తరువాయి)

లబ్ధిదారులకు యాక్సిస్ బ్యాంకు నుండి ఏకంగా నోటీసులే అందాయి. దీంతో వారు దిగ్భ్రాంతికి గురయ్యారు.

ఏడు నెలల క్రితమే ఫిర్యాదు...

ఈ లావాదేవీలపై అనుమానం రావడంతో నెల్లూరు యాక్సెస్ బ్యాంక్ మేనేజర్ మదన్ మోహన్‌రావు 2024 డిసెంబర్ 12న ముత్తుకూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు 179-2014 నెంబర్‌తో కేసు కూడా నమోదు చేశారు. తమ బ్యాంక్‌లో మోసం చేసి 56 పేర్లు మీద రూ.10 కోట్ల 60 లక్షలు దోపిడి చేసినట్లు ఆయన ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. కంపెనీ పేర్లు, ఇతర వివరాలను ఆయన పేర్కొన్నప్పటికీ దర్యాప్తు ప్రక్రియ మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఈ విషయమై కృష్ణపట్నం సిఐ రవినాయక్‌ను "ప్రజాశక్తి" వివరణ కోరగా జరిగింది వాస్తవమేనని, విచారణ చేయాల్సి ఉందని తెలిపారు.

బ్యాంకు కూడా స్పందించలేదు!

బ్యాంక్ ఉన్నతాధికారులు కూడా ఈ వ్యవహారంపై స్పందించకపోవడం అనుమానాలకు దారి తీస్తోంది. దీనిపై బ్యాంకు ఇంత వరకూ విచరణ జరపలేదని తెలిసింది. కేవలం 56 మంది నుంచే సుమారు రూ.10.60 కోట్ల మేర స్కామ్ జరిగినట్లు అనధికారికంగా చెబుతున్నారు. మొత్తంమీద ఒక్క నెల్లూరు జిల్లాలోనే రూ.20 కోట్ల మేరకు ఈ కుంభకోణం జరిగిఉండవచ్చని అనుమానిస్తున్నారు.

జీవన సౌరభం

లక్ష్యముండటమే కాదు, దాన్ని ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా సాధించుకునే వ్యూహ నైపుణ్యం కూడా ఉండాలి.

మీ కోసం

ఒక గ్లాసు నీళ్లల్లో నాలుగు వెల్లుల్లి రెబ్బలను దంచి వేసి ఈగలు వస్తున్న ప్రదేశంలో పెడితే ఈగల బెడద ఉండదు.

అపార్థం

ఒకసారి ఒక బాతు తన పిల్లలతో సరసు వైపు వెళుతుంది. బాతు పిల్లలు మార్గమంతా సంతోషంగా అరుస్తూ తమ తల్లిని అనుసరిస్తూ ఉన్నాయి. బాతుకి దూరంగా ఒక నక్క కనిపించింది. అంతే బాతు భయపడి అక్కడ ఉన్న తన పిల్లలను సరస్సు వద్దకు తొందరగా వెళ్ళమని అరిచింది. బాతు పిల్లలు సరసు వైపు వేగంగా వెళ్లాయి. తల్లి బాతు కూడా వేగంగా పరిగెడుతూ తన రెక్కకి దెబ్బకి తగిలి నేలపై కూలిపోయింది. అది ఆ దెబ్బతోనే సరసు వైపు నేలపై వెనుకకు పాకుతూ వెళుతుంది. అది చూసిన నక్క బాతు దగ్గరకి వెళ్ళింది. నక్క దగ్గరికి రాగానే బాతు మరింత భయపడిపోయింది. నక్క నెమ్మదిగా బాతుని నీటి వైపు తోయడం మొదలుపెట్టింది. అంటే నక్క బాతును రక్షించబోతుంది. నక్కని తప్పుగా అపార్థం చేసుకున్నందుకు నక్కని క్షమించమని అడిగి తనకి కృతజ్ఞతలు చెప్పి తల్లి బాతు సంతోషంగా తన పిల్లల దగ్గరికి వెళ్ళిపోయింది.

– టి. శ్రీవర్ధన్,
5వ తరగతి,
అరవింద హైస్కూల్,
కుంచనపల్లి.



భలే భలే మా బాల్యం

చిన్నారులలో చిలిపితనం
ప్రతిక్షణం తుంటరితనం
ముద్దు మాటల గడసరితనం
కల్లా కపటం ఎరుగనితనం

బాల్యం ఓ వరం
బాల్యం ఓ జ్ఞాపకం
బాల్యం ఓ పుస్తకం
బాల్యం ఓ
అమాయకత్వం

బడిబాట
స్నేహితునితో ఆట
మట్టితో సయ్యాట
ఇసుకలో పోట్లాట

భలే భలే బాల్యం
మా పాల బుగ్గల
బాల్యమట
చిన్ని కృష్ణుని వలెనట

– బొమ్మి శెట్టి రమేష్,
వైయస్సార్ కడప జిల్లా,
98483 73736

నేను గీసిన బొమ్మ



ఆరిపాక త్రివిక్రమ్,
7వ తరగతి,
శ్రీ వేణు విద్య నికేతన్,
కె.కోటపాడు,
అనకాపల్లి జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

విద్యార్థులకు దస్తూరి తిలకం

అందమైన చేతిరాత (కాలిగ్రఫీ) కూడా చిత్రలేఖనం, నాట్యం వలె నేర్చుకునే కళ. మనిషిలోని ప్రవర్తన, ఆలోచనలు, అంత: సౌందర్యాన్ని అంచనా వేయటానికి చేతిరాత ఉపయోగపడుతుంది. దస్తూరి, సంతకాలను బట్టి స్వభావాలు, వ్యక్తిత్వాలను అంచనా వేసేది గ్రాఫాలజీ. సంప్రదాయక కాలిగ్రఫీ విభిన్నంగా ఉంటుంది. వ్యక్తి శారీరక, మానసికస్థితితో కూడిన వైయక్తిక అభిరుచులకు అనుగుణంగా ఉంటుంది. ఈ కళ ద్వారా వేలాదిమంది పిల్లల జీవితాల్లో వెలుగురేఖలు నింపటానికి 'క్యాలిగ్రఫీ'ని విద్యార్థులు, ఉపాధ్యాయులకు నేర్పించడాన్ని ఉద్యమంగా నిర్వహిస్తున్నారు ఉప్పాల రామ్మోహనరావు.

బాపట్ల జిల్లా బాపట్ల మండలంలోని వెదుళ్లపల్లి గ్రామానికి చెందిన ఉప్పాల రాధాకృష్ణమూర్తి, శేషారత్నం దంపతులకు మూడో సంతానంగా రామ్మోహనరావు జన్మించారు. ఎమ్మెస్సీ, బిఇడి చదివిన ఆయన 1996 డిఎస్సీ ద్వారా ఎస్జీటీగా ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరారు. ప్రస్తుతం గణిత ఉపాధ్యాయుడిగా (ఎస్ఎ)గా గుంటూరు రూరల్ మండలం పొత్తూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. చిన్నప్పటి నుంచి దస్తూరి అందంగా ఉండడం ఆయనకు సాధనతో అబ్బిన విద్య. ఇదే కృషిని కొనసాగిస్తూ వస్తున్నారు. గణితంలో ఆయన చేస్తున్న ప్రయోగాలు, సరికొత్త బోధనా విధానాలు, సులభపద్ధతిలో నేర్పే విధానాన్ని అభినందిస్తూ విద్యాశాఖ జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందజేసింది. రాష్ట్రస్థాయి రిసోర్స్‌పర్సన్‌గా అనేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. టెక్స్ట్‌బుక్స్, మాడ్యూల్స్ రచయితగా పనిచేశారు. మేథ్స్‌కిట్ రూపకల్పనలో రాష్ట్రస్థాయి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రాథమిక స్థాయిలో పిల్లలకు అర్థమయ్యేలా 'గణితం బోధించటం ఒక కళ'. గణితమంటే ఎలాంటి భయం లేకుండా హాయిగా నేర్చుకునేలా 'భలే భలే గణితం' గేయాలు రచించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించటంలోనూ, విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి కృషిచేశారు. సామాజిక బాధ్యతగా బూట్లు, టై, బెల్టు, బ్యాగ్, నోటు పుస్తకాలు యూనిఫాం దుస్తులను విద్యార్థులకు సొంత ఖర్చులతో, దాతల సహకారంతో గతంలోనే సమకూర్చారు. ఇప్పుడు ప్రభుత్వం సమకూరుస్తుంది. 2016 సెప్టెంబర్ 5న అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. తన తండ్రి రాధాకృష్ణమూర్తి జ్ఞాపకార్థం 300 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి ఆరేసి నోటు పుస్తకాల చొప్పున ప్రతి సంవత్సరం పంపిణీని చేసేవారు.

క్యాలిగ్రఫీ కుటుంబం

తన మిత్రుడు తొరటి శ్రీనివాసరావు ఇచ్చిన సలహా మేరకు 2019 ఆగస్టు 12న క్యాలిగ్రఫీ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ అద్భుతమైన కళ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు చేరాలంటే అక్కడ పనిచేసే ఉపాధ్యాయుల ద్వారానే సాధ్యమని భావించారు. తొలుత ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ, హ్యాండ్ రైటింగ్ కిట్టు ఇచ్చారు. శిక్షణ పొందిన వారు 10 మంది విద్యార్థుల చొప్పున దత్తత తీసుకునేలా ఏర్పాటు చేసి నేర్పమని పది నోట్‌బుక్స్ ఇచ్చారు. ఒక వాట్సాప్ గ్రూప్‌ని క్రియేట్‌చేసి ప్రతిరోజూ సూచనలు చేస్తున్నారు. అందులో నైపుణ్యం సాధించిన 50 మంది ఉపాధ్యాయులతో క్యాలిగ్రఫీ టీమ్‌ను ఏర్పాటుచేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకూ 127 శిక్షణా కార్యక్రమాలను విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, దాతల ప్రోత్సాహంతో కొనసాగించారు. ఈనెల 14, 15 తేదీల్లో చిత్తూరు జిల్లా కుప్పంలోని ద్రవిడ విశ్వ విద్యాలయంలో 127వ శిక్షణా కార్యక్రమం విజయవంతమైంది. ఉప కులపతి ప్రొఫెసర్ దొరైస్వామి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కిరణ్‌కుమార్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లీష్ అండ్ కమ్యూనికేషన్స్ డాక్టర్ మురళీకృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో 90 మంది పిజి, రీసెర్చ్‌స్కాలర్లకు శిక్షణిచ్చారు. ఇప్పటివరకూ 5200 మంది ఉపాధ్యాయుల, 64 వేలమంది విద్యార్థుల చేతిరాతను అందంగా మార్చేశారు.

శిక్షణలో ప్రత్యేక ఏమిటంటే...

దాతల సహకారంతో ఏటేటా 10 వేల నోటు పుస్తకాలను అచ్చు వేయిస్తుంటారు. ప్రతి పేజీలో ఒక అక్షరాన్ని అది ఏర్పర్చాలో తెలియజేస్తూ అక్షర నిర్మాణాన్ని పలుకుతూ రాసే విధంగా అర్థవంతంగా నేర్పుతారు. ఇంపార్టెంట్‌స్ట్రోక్స్‌ను, కామన్‌స్ట్రోక్స్‌ను పరిచయం చేసి ఆ రెండింటినీ కలిపితే అక్షరాలు ఎలా ఏర్పడతాయో బోర్డుపై రాసి పలికిస్తూ బోధిస్తారు. విద్యార్థులు పరిశీలనతో పలుకుతూ నేర్చుకుంటారు. చేతిరాత మనసుకు చెందింది. మనసు, చేయీ సమన్వయంతో నేర్చుకుని రాసే ప్రొడక్టివ్ స్కిల్.

పిల్లల్లో మానసిక స్థితి మెరుగు

ఏటేటా జనవరి 23న జాతీయ చేతిరాత దినోత్సవాన్ని జరుపుతారు. ఈ ఏడాది నిర్వహించిన దినోత్సవంలో 500 మంది విద్యార్థులు, 120 మంది ఉపాధ్యాయులు, 100 మంది తల్లిదండ్రులు హాజరయ్యారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సొలేషన్ బహుమతులు, రూ. 2000, రూ.1500, రూ.1000, రూ.500 చొప్పున రూ.20 వేల నగదు బహుమతులు అందజేస్తున్నారు.

స్కాన్‌చేస్తే చాలు పాఠాలు

చేతిరాత నైపుణ్యంతో శిక్షణ కల్పించేందుకు క్యూఆర్ కోడ్‌తో తీసుకొచ్చిన 'రాతే..మన భవిష్యత్తు' పుస్తకాన్ని స్మార్ట్‌ఫోన్‌లో స్కాన్ చేయగానే బోర్డుపై అక్షరాలను రాసే వీడియోలు ప్రత్యక్షమవుతాయి. అక్షరాలను పలుకుతూ నేర్చుకోవటం ద్వారా సులభంగా చేతిరాతను మార్చుకోవచ్చు. చేతిరాత చక్కగా ఉంటే విద్యార్థుల్లో ఏకాగ్రత, నిబద్ధత, క్రమశిక్షణ పెరుగుతుంది. బాగున్న వారికి గుర్తింపు కూడా వస్తుంది. కేవలం మార్కుల కోసమే కాదు. అది విద్యార్థి వైఖరిలో మార్పు తేవటంతోపాటుగా చదువుపై ఏకాగ్రతను పెంచి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. అందమైన చేతిరాతను కల్గివుండటం ద్వారా సమాజంలో మనిషికి ప్రత్యేక గుర్తింపు వస్తుంది. అన్ని సబ్జెక్టులపై ఆసక్తిని పెంచి మంచి మార్కులు తెచ్చిపెడుతుందని రామ్మోహనరావు అంటున్నారు.

– యడవల్లి శ్రీనివాసరావు

ఆరేళ్లుగా క్యాలిగ్రఫీలో...

గత ఆరేళ్లలో వచ్చిన అనుభవాలతో కూడిన సమాచారంతో రూపొందించిన 'రాతే.. మన భవిత– 2025' పుస్తకాన్ని ఈ ఏడాది జనవరిలో ఆవిష్కరించాం. వచ్చే ఏడాది ఆఖరు నాటికి 10 వేలమంది ఉపాధ్యాయులు, లక్ష మంది విద్యార్థుల చేతిరాతను అందంగా మార్చా లనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ఈ కృషిలో నాతో పాటుగా మరో 50 మంది ఉపాధ్యాయులు ఎంతో సమర్థవంతంగా కృషి చేస్తున్నారు. క్యాలిగ్రఫీ చరిత్రలో మొదటిసారి శాస్త్రీయంగా క్యూఆర్ కోడ్‌తో రూపొందించిన ఏకైక పుస్తకం నాదే.

– ఉప్పాల రామ్మోహనరావు,
క్యాలిగ్రఫీ నిపుణులు

స్పిన్నర్ల ఉచ్చులో హర్మన్‌ప్రీత్ సేన

- ఇంగ్లండ్ చేతిలో 8వికెట్ల తేడాతో ఓటమి

లండన్: లార్డ్స్ మైదానంలో భారత మహిళలూ నిరాశపరిచారు. తొలుత వర్షం కారణంగా 29ఓవర్లకు కుదించిన రెండో వన్డేలో హర్మన్‌ప్రీత్ సేన ఇంగ్లండ్ మహిళల చేతిలో ఎనిమిది వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. తొలుత ఇంగ్లండ్ స్పిన్నర్లు ఎక్లేస్టోన్(3/27), స్మిత్(2/28) రాణించడంతో భారతజట్టు 29ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 143పరుగులు చేసింది. ఆ లక్ష్యాన్ని ఇంగ్లండ్ జట్టు ఛేదించే క్రమంలో మళ్లీ వర్షం కురవడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిపై 24ఓవర్లలో 115 పరుగులుగా లక్ష్యాన్ని నిర్దేశించారు. ఆ లక్ష్యాన్ని ఇంగ్లండ్ జట్టు 21 ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. ఇంగ్లండ్ జట్టు ఓపెనర్ జోన్స్ (46నాటౌట్), బ్యూమౌంట్(34), స్కీవర్ బ్రంట్ (21) బ్యాటింగ్‌లో రాణించారు. భారత బౌలర్లు క్రాంతి గాడ్, స్నేహ్ రాణాకు ఒక్కో వికెట్ దక్కాయి.

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన హర్మన్‌ప్రీత్ సేనకు శుభారంభం దక్కలేదు. ఓపెనర్ ప్రతిక రావల్(3) నిరాశపరిచింది. దీంతో 6పరుగుల వద్ద తొలి వికెట్ కోల్పోగా.. ఆ తర్వాత హర్లీన్‌తో జత కలిసిన మంధాన స్కోర్ బోర్డును నెమ్మదిగా ముందుకు తీసుకెళ్లింది. వర్షం కారణంగా పరుగులు రాబట్టడంలో టీమిండియా బ్యాటర్లు విఫలమయ్యారు. ఓపెనర్ స్మృతి మంధాన(42), హర్లీన్ (16), దీప్తి శర్మ(30నాటౌట్), అరుంధతి(14) మాత్రమే రెండంకెల స్కోర్ చేశారు. భారతజట్టు 72పరుగులకే సగం వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (30నాటౌట్), అరుంధతి రెడ్డి(14) కలిసి టీమిండియాను ఆదుకున్నారు. వీరిద్దరూ 7వ వికెట్‌కు 26పరుగులు జతచేసి ఆదుకున్నారు. చివరి ఓవర్ వరకు క్రీజ్‌లో నిలిచిన దీప్తి శర్మ ఆమాత్రమైనా స్కోర్ చేయడంతో భారతజట్టు గౌరవప్రద స్కోర్ చేయగల్గింది. ఇంగ్లండ్ బౌలర్లు ఎక్లేస్టోన్‌కు మూడు, స్మిత్, అర్లాట్‌కు రెండేసి, ఛార్లోట్‌కు ఒక వికెట్ దక్కాయి. మూడో, చివరి వన్డే ఛెస్టర్–లీ–స్ట్రీట్ వేదికగా మంగళవారం జరగనుంది.

స్కోర్‌బోర్డు...

ఇండియా మహిళల ఇన్నింగ్స్: ప్రతిక రావల్ (బి)అర్లాట్ 3, మంధాన (సి)ఛార్లీ డీన్ (బి)స్మిత్ 42, హర్లీన్ (సి అండ్ బి)ఎక్లేస్టోన్ 16, హర్మన్‌ప్రీత్ (బి)ఎక్లేస్టోన్ 7, రోడ్రిగ్స్ (సి అండ్ బి)ఛార్లీ డీన్ 3, రీచా ఘోష్ (ఎల్‌బి)ఎక్లేస్టోన్ 2, దీప్తి శర్మ (నాటౌట్) 30, అరుంధతి రెడ్డి (ఎల్‌బి)స్మిత్ 14, స్నేహ్ రాణా (బి)అర్లాట్ 6, క్రాంతి గాడ్ (నాటౌట్) 4, అదనం 16. (29ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 143పరుగులు.

వికెట్ల పతనం: 1/6, 2/46, 3/57, 4/69, 5/72, 6/98, 7/124, 8/135

బౌలింగ్: లారెన్ బెల్ 6–0–29–0, అర్లాట్ 6–1–26–2, ఛార్లోట్ డీన్ 6–0–31–1, ఎక్లేస్టోన్ 6–0–27–3, స్మిత్ 5–0–28–2.

ఇంగ్లండ్ మహిళల ఇన్నింగ్స్: జోన్స్ (నాటౌట్) 46, బ్యూమౌంట్ (ఎల్‌బి)స్నేహ్ రాణా 34, స్కీవర్ బ్రంట్ (బి)క్రాంతి గాడ్ 21, సోఫియా డంక్లే (నాటౌట్) 9, అదనం 6. (21 ఓవర్లలో 2వికెట్ల నష్టానికి) 116 పరుగులు.

వికెట్ల పతనం: 1/54, 2/102

బౌలింగ్: అరుంధతి రెడ్డి 5–0–21–0, క్రాంతి గాడ్ 3–0–29–1, శ్రీ చరణి 5–0–28–0, దీప్తి శర్మ 5–0–23–0, స్నేహ్ రాణా 3–0–12–1.

సెమీస్‌లో ఓడిన అర్జున్

ప్రజ్ఞానందకు ఓదార్పు విజయం

లాస్ వేగాస్: ఫ్రీస్టయిల్ గ్రాండ్ స్లామ్ టూర్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఎరిగేసి పోరాటం ముగిసింది. తొలి రౌండ్ నుంచి సంచలన విజయాలతో సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లిన ఈ యువకెరటం టైటిల్‌కు అడుగు దూరంలో ఆగిపోయాడు. ఈ టోర్నీలో సెమీస్‌కు చేరిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించిన తెలుగు కుర్రాడు అర్జున్.. సెమీఫైనల్లో అర్మేనియాకు చెందిన లెవాన్ అరోనియన్ చేతిలో అనూహ్యంగా కంగుతిన్నాడు. లాస్ వేగాస్ వేదికగా శనివారం జరిగిన పోరులో గట్టిగానే పోరాడిన అర్జున్ ప్రత్యర్థిని నిలువరించలేకపోయాడు. తొలి గేమ్‌లో అవకాశాలు వచ్చినప్పటికీ సద్వినియోగం చేసుకోలేక 0–2తో ఓటమిపాలయ్యాడు. ఇక ప్రపంచ నంబర్ వన్ ఆటగాడు మాగ్నస్ కార్ల్‌సన్‌ను ఓడించి టైటిల్‌పై ఆశలు రేపిన ప్రజ్ఞానంద క్వార్టర్స్‌లోనే వెనుదిరిగిన విషయం తెలిసిందే. ప్రపంచంలోని గ్రాండ్‌మాస్టర్లు ఆడుతున్న ఇంకో గేమ్‌లో ప్రజ్ఞానంద మరో విజయం సాధించాడు. సెమీస్ అవకాశం చేజార్చుకున్న ప్రజ్ఞానంద.. మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో అదరగొట్టాడు. తనమార్క్ ఆటతో విన్సెంట్ కెయ్‌మర్(జర్మనీ)ని మట్టికరిపించాడు. నల్లపావులతో ఆడిన భారత స్టార్ తొలి రౌండ్‌ను డ్రాగా ముగించాడు. ఆ తర్వాతి రౌండ్‌లో ప్రత్యర్థిపై గెలిచాడు. దీంతో 1.5–0.5తో ప్రత్యర్థిని ఓడించాడు. మరోవైపు నార్వే దిగ్గజం కార్ల్‌సన్ కూడా విక్టరీ కొట్టాడు. ఉజ్బెకిస్థాన్ ప్లేయర్ జవోఖిర్ సిందారవోపై అద్భుత విజయంతో మూడో స్థానం రేసులో నిలిచాడు.

రుతురాజ్ గైక్వాడ్ కీలక నిర్ణయం

యార్క్‌షైర్‌తో ఒప్పందం రద్దు

లండన్: టీమిండియా క్రికెటర్ రుతు రాజ్ గైక్వాడ్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. యార్క్‌షైర్‌తో కుదుర్చుకున్న ఒప్పందం నుంచి అతడు వైదొలిగాడు. ఈ విషయాన్ని యార్క్‌షైర్ కౌంటీ ధ్రువీకరించింది. వ్యక్తిగత కారణాల వల్ల అతడు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా యార్క్‌షైర్ జట్టు హెడ్‌కోచ్ ఆంటోని మెగ్రాత్ మాట్లాడుతూ.. "వ్యక్తిగత కారణాల దృష్ట్యా గైక్వాడ్ ఇంగ్లండ్‌కు రాలేకపోతున్నాడు. అతడు ఈ సీజన్ మొత్తానికి అందుబాటులో ఉండడు. ఈ విషయం మమ్మల్ని నిరాశకు గురిచేసింది. అయితే, గైక్వాడ్ నిర్ణయానికి గల కచ్చితమైన కారణాన్ని నేను చెప్పలేను. అతడి స్థానంలో సరైన ఆటగాడిని ఎంపిక చేసుకుంటాం. కానీ అందుకు సమయం తక్కువగా ఉంది. ఏదేమైనా ఈ విషయం గురించి నేను ఇంతకంటే ఎక్కువగా ఏమీ మాట్లాడలేను" అని పేర్కొన్నాడు. ఇంగ్లండ్ కౌంటీల్లో ఆడాలని నిర్ణయించుకున్న రుతురాజ్ గైక్వాడ్ యార్క్‌షైర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఓపెనింగ్ బ్యాటర్ తాజా కౌంటీ సీజన్‌లో సర్రేతో జరిగే మ్యాచ్‌తో అరంగేట్రం చేయాల్సి ఉంది. అదే విధంగా వన్డే కప్‌లోనూ పాల్గొనాల్సి ఉంది. కౌంటీలకు దూరంగా ఉండడానికి గల కారణాల్ని మాత్రం వెల్లడించలేదు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68